www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 21-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 127 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: విదియ సా. 5.07 తదుపరి తదియ; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 12.33 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ. 8.52-10.17; దుర్ముహూర్తం: ఉ. 11.53-12.43; అమృతఘడియలు: సా.5.25-6.50; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.33 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చంద్రయాన్-4, 5 డిజైన్లు రెడీ

- ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నాం
- ఐదేళ్లలో 70 ఉపగ్రహాల ప్రయోగానికి సన్నాహాలు
- ఈ ఏడాది చివర్లో గగన్‌యాన్ మిషన్ ప్రయోగం
- ఎస్ఎస్ఎల్వీ తయారీకి పదికిపైగా కంపెనీల ఆసక్తి
- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

2



మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ అధికారులు

ఐదేళ్లలో 17 వేల కి.మీ.

గ్రామీణ రహదారులకు మహర్దశ: సీఎం

- 10 వేల కి.మీ. మురుగు కాల్వలు
- కేంద్ర నిధుల సద్వినియోగంతో ఇంటింటికీ తాగునీరు
- ఎల్ఈడీ వీధిలైట్ల పునరుద్ధరణ
- 5 లక్షల పంటకుంటల తవ్వకాలు
- ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాలు పునఃప్రారంభిస్తాం
- జనవరి నుంచి 'జన్మభూమి 2.0'
- పంచాయతీరాజ్ బలోపేతానికి 990 కోట్లు విడుదల: చంద్రబాబు
- పవన్ కల్యాణ్‌తో కలిసి సమీక్ష

కొత్త వ్యవస్థలు వచ్చినా గ్రామ సర్పంచ్‌ను గౌరవించుకోవాలి. మళ్లీ గ్రామాల్లో వెలుగులు తెచ్చేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు పంచాయతీరాజ్‌శాఖకు జవసత్వాలు అందిస్తాం.

రాష్ట్రంలో అడవుల పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపుపై దృష్టి పెట్టాలి. హార్టీకల్చర్‌తో కలుపుకొని 50 శాతం గ్రీన్‌బెల్ట్ సాధించాలి. నగర వనం కార్యక్రమం ద్వారా 175 నియోజకవర్గాల్లో, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపు చేపట్టాలి.

- సీఎం చంద్రబాబు



పంచాయతీరాజ్ శాఖ సమీక్షా సమావేశంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, అధికారులు

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాబోయే ఐదేళ్లలో 17,500 కి.మీ మేర సిమెంటు రోడ్ల నిర్మాణం, 10 వేల కి.మీ సీసీ డ్రైనేజీ కాల్వల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ కోసం కేంద్రమిచ్చే నిధులను

మిగతా 12వ పేజీలో...

అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం

- సీఎం చంద్రబాబుతో సమావేశం 11
- రాజధానికి 15 వేల కోట్ల సాయంపై చర్చలు
- వెంట కేంద్ర ఆర్థిక శాఖ, ఏడీబీ అధికారులు
- 27 వరకు అమరావతిలోనే బృందం పర్యటన


రాష్ట్రంలో హెచ్‌సీఎల్ భారీ విస్తరణ

మంత్రి లోకేశ్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

కమీషన్లకే కిక్కు

'మద్యం' గుట్టు విప్పుతున్న డిస్టిలరీ యజమానులు

- జగన్ సర్కారు దోపిడీపై సీఐడీ కూపీ
- మద్యం ఆర్డర్లు ఎలా వచ్చాయ్?
- కమీషన్లు ఎవరెవరికి ఎంత చెల్లించారు?
- తెలంగాణలో రూ.1000 మద్యం.. ఏపీలో 1600 ఎలా?
- 'డిస్టిలరీ'లపై అధికారుల ప్రశ్నల వర్షం
- ఆ 600 వైసీపీ పెద్దల జేబుల్లోకి..
- కీలక సమాచారం చెప్పిన యజమానులు
- వ్యవహారాలన్నీ వాసుదేవ రెడ్డి చూసేవారు
- తెరపైకి నాటి సకల శాఖా మంత్రి పేరు
- త్వరలో వేలకోట్ల కుంభకోణం వెలుగులోకి



జగన్ సర్కారులో అదో అంతులేని ముడుపుల 'కిక్కు'! డిస్టలరీలను ఆక్రమించారు. సొంత బ్రాండ్లను ప్రవేశపెట్టారు. ఆ మద్యాన్నే విక్రయించారు. అంటే... మందూ వాళ్లదే... అమ్మేదీ వాళ్లే! ఇతర బ్రాండ్లు విక్రయించాలంటే కమీషన్ కొట్టాల్సిందే! ఈ తతంగం సాగిన తీరుపై సీఐడీ దృష్టి సారించింది. నేరుగా డిస్టలరీల యజమానులనే పిలిచి ప్రశ్నిస్తోంది. బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి లీలలను పక్కాగా తెలుసుకుంటోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మద్యం కేసులో సీఐడీ అధికారులు ఉచ్చు బిగిస్తున్నారు. ఊహకు అందని విధంగా జగన్ సర్కారు చేసిన దోపిడీపై కూపీ లాగుతున్నారు. సీఐడీ అధికారులు తాజాగా మద్యం డిస్టిలరీస్ యజమానుల్ని పిలిచి అత్యంత విలువైన సమాచారం సేకరించారు. మద్యం విక్రయాలకు సంబంధించిన ఆర్డర్లు ఎలా వచ్చాయి? కమీషన్లు ఏ రూపంలో ఎవరెవరికి ఎంతెంత ఇచ్చారు? వంటి విషయాలు సేకరించారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమికంగా గుర్తించిన దాని ప్రకారం తాడేపల్లి ప్యాలెస్‌కు 3113 కోట్ల అక్రమ సొమ్ము చేరింది. ఈ మొత్తం చాలా ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిని సీఐడీ అధికారులు రహస్య ప్రాంతంలో పలుమార్లు ప్రశ్నించారు. ఆయన్నుంచి సేకరించిన కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటున్నారు. కేసు బలపడేందుకు ఉచ్చు బిగిస్తున్నారు. అందులో భాగంగానే కీలక టీమ్ మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయానికి మద్యం డిస్టిలరీస్ యజమానులను పిలిపించింది. రాష్ట్రంలో 2019 వరకూ అందుబాటులో ఉన్న మద్యం బ్రాండ్లను కాదని మీకు ఆర్డర్లు ఎలా వచ్చాయని

మిగతా 11వ పేజీలో...

చిక్కడు.. దొరకడు!



- అజ్ఞాతంలోనే 'గనుల'రెడ్డి!
- వైసీపీ ముఖ్య నేత సూచనతోనే
- చెన్నైలో సేద తీరుతున్నారని ప్రచారం
- ఈ నెల 31న వెంకటరెడ్డి పదవీ విరమణ
- సర్వీసులో ఉండగా అరెస్టు చేస్తే తంటా
- రక్షణ శాఖ నుంచి సమస్యలొచ్చే చాన్సు
- అందుకే జగన్ శిబిరం సలహాతో మాయం
- అటు ఏసీబీ తీరుపైనా సందేహాలు 12
- ఆయనపై ఇంతవరకు కేసే పెట్టని వైనం

వైద్యుల భద్రతపై టాస్క్‌ఫోర్స్!



9 మంది సభ్యులతో ఏర్పాటు



గుంటూరులో మంగళవారం జూనియర్ వైద్యుల కొవ్వొత్తుల ర్యాలీ

- 2 నెలల్లో పూర్తి నివేదిక ఇవ్వాలి
- కోల్‌కతా హత్యాచార కేసుపై సుప్రీంకోర్టు ఆదేశం
- మీ భద్రతపై మాది భరోసా.. మమ్మల్ని నమ్మండి ప్లీజ్
- ఆందోళనలు విరమించి.. రోగులకు సేవలందించండి
- వైద్యులకు అత్యున్నత న్యాయస్థానం పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో వైద్యుల భద్రత కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యులతో కూడిన జాతీయ టాస్క్‌ఫోర్స్ (ఎన్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో తీవ్ర సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసును సుమోటోగా స్వీకరిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టాస్క్‌ఫోర్స్‌లో హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి చోటు కల్పించింది. పని ప్రదేశాల్లో వైద్యులపై లైంగిక పరమైన హింసను నివారించేందుకు.. వైద్యులు,

మిగతా 2వ పేజీలో...

మహారాష్ట్రలోని బడిలో చిన్నారులపై లైంగికదాడి

స్థానికుల ఆగ్రహం.. పాఠశాల ధ్వంసం, రైల్ రోకో

ప్రవీణ్ ప్రకాశ్ రివర్స్‌గేర్

11



- మళ్లీ సర్వీస్‌లోకి వచ్చేందుకు విశ్వప్రయత్నాలు?
- వీఆర్ఎస్ లేఖ వెనక్కి తీసుకుంటానని సంకేతాలు
- ఒత్తిడిలో ఉండి పొరపాటున దరఖాస్తు చేశానని, ప్రభుత్వం వెంటనే దాన్ని ఆమోదించిందని ఆవేదన



11

ఖరీఫ్‌కు గడ్డుకాలం!

- 61% మించని సాగు.. 49 మండలాల్లో వానలోటు
- వానలోటు లేకపోయినా కొన్ని చోట్ల ఎక్కువగా డ్రైస్పెల్స్
- సీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మరింత ప్రతికూలత
- 16% వర్షపాతం అధికంగా ఉన్నా ఎండ తీవ్రత, వేడి గాలులతో గాలిలో, భూమిలో తేమ కరువు
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై సర్కార్ దృష్టి

తాడిపత్రిలో హైటెన్షన్!

పెద్దారెడ్డి రాకతో ఉద్రిక్తత.. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

- వైసీపీ నేత కందిగోపుల మురళి ఇంటిపై దాడి
- ఇంట్లో సామగ్రి, రెండు కార్లు, స్కూటర్ ధ్వంసం
- ఏబీఎన్ రిపోర్టర్‌ను గన్‌తో బెదిరించిన కందిగోపుల
- ఎస్పీ జగదీశ్‌కు ఏపీయూడబ్ల్యూజే నేతల ఫిర్యాదు



ధ్వంసమైన కార్లు, బైక్

తాడిపత్రి, ఆగస్టు 20: అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలో ఘర్షణల కారణంగా టీడీపీ, వైసీపీ ముఖ్య నేతలను పోలీసులు పట్టణానికి దూరంగా ఉంచారు. కానీ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం సాయంత్రం తాడిపత్రికి భారీ అనుచరగణంతో బయలుదేరారు. స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి ఆయన వస్తున్న విషయం తెలియగానే పోలీసులు ఎ.కొండాపురం వద్ద అడ్డుకున్నారు. దీంతో పోలీసులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రిలోని తన ఇంట్లో కొన్ని పత్రాలు ఉన్నాయని, వాటికోసం వెళ్తున్నానని వాదించారు. దీంతో పోలీసులు ఆయన్ను వెంటబెట్టుకుని తాడిపత్రికి తీసుకొచ్చారు. ఆయన తనకు కావాల్సిన పత్రాలు తీసుకుని

మిగతా 2వ పేజీలో...

కేంద్రంలో నేరుగా నియామకాలు రద్దు



- పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయం.. 4 రోజుల కిందటి నోటిఫికేషన్ నిలిపివేత
- విపక్షాల ఒత్తిడికి తలొగ్గిన మోదీ సర్కారు.. నియామకాల్లో సమానత్వం, సామాజిక న్యాయానికి మోదీ కట్టుబడి ఉన్నారు: కేంద్ర మంత్రి జితేంద్రసింగ్
- రిజర్వేషన్లు కాపాడటానికి ఎంతవరకైనా వెళ్తాం: రాహుల్ గాంధీ

2

బెంగాల్లో అనిశ్చితి

మమత ప్రభుత్వంపై విద్యార్థులకు విశ్వాసం పోయింది

- 'అపరచితుడి'లా సీఎం తీరు: గవర్నర్ ఆనంద బోస్

కోల్‌కతా, ఆగస్టు 20: పశ్చిమ బెంగాల్లో ప్రస్తుతం అనిశ్చితి రాజ్యమేలుతోందని ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ అన్నారు. ప్రజలు.. ముఖ్యంగా విద్యార్థులు మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయారని తెలిపారు. కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై హత్యాచారం.. సమాజానికే సిగ్గుచేటైన ఘటనగా పేర్కొన్నారు. ప్రజలను సంరక్షించాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయలేదని.. పైగా చనిపోయిన వైద్యురాలికి న్యాయం చేయాలంటూ సీఎం మమత స్వయంగా నిరసనకు దిగడాన్ని తప్పుబట్టారు. ఆమెవన్నీ పైపై ప్రకటనలేనని వ్యాఖ్యానించారు. పీటీఐ వార్తాసంస్థకు ఆయన తాజాగా ఇంటర్వ్యూ ఇచ్చారు. 'బెంగాల్లో యువత భయాందోళనల్లో ఉన్నారు. మహిళలు తీవ్ర నిరాశానిస్పృహల్లో ఉన్నారు. పౌరులను సంరక్షించాల్సిన రాష్ట్రప్రభుత్వం తన బాధ్యత నిర్వర్తించడం లేదన్న భావన సర్వత్రా ఏర్పడింది. కోల్‌కతా పోలీసు వ్యవస్థ నేరపూరితం, రాజకీయమయం అయిపోయింది. సీఎం మమత ఓ ర్యాలీ నిర్వహించారు. ఆ సందర్భంగా క్యాంపస్‌లలో భద్రత లేదని ఆరోగ్య మంత్రి.. హోం మంత్రికి ఫిర్యాదు చేశారట! చర్యలు తీసుకోలేదని హోం మంత్రి సీఎంకు కంప్లయింట్ ఇచ్చారట! రాష్ట్రంలో ఆరోగ్య మంత్రి, హోం మంత్రి, సీఎం ముగ్గురూ మమతే కదా' అని ఎద్దేవాచేశారు.



రాష్ట్రపతితో బోస్ భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్కడ్‌తో సమావేశమయ్యారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన, బెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులను ధన్కడ్, ముర్ములకు గవర్నర్ వివరించారు.

చంద్రయాన్-4, 5 డిజైన్లు రెడీ: ఇస్రో చైర్మన్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: చంద్రయాన్-3 విజయవంతం నేపథ్యంలో తదుపరి మిషన్ల కోసం చంద్రయాన్-4, 5 డిజైన్లు కూడా పూర్తయ్యాయని, వాటికి ప్రభుత్వ అనుమతి కోరే పనిలో ఉన్నామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ మంగళవారం వెల్లడించారు. చంద్రయాన్-4 మిషన్ 2028లో ఉంటుందని ఇస్రో గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా, వచ్చే ఐదేళ్లలో 70 ఉపగ్రహాలు ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తుందని సోమనాథ్ పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవ రహిత మిషన్‌ను ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభిస్తామని, ఇప్పటికే రాకెట్‌కు సంబంధించిన అన్ని దశలూ శ్రీహరికోటలోని షార్‌కు చేరుకున్నాయని సోమనాథ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, చిన్న చిన్న ఉపగ్రహాలను కక్ష్యలోకి చేరవేసేందుకు వినియోగిస్తున్న స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్వీ) రాకెట్ల తయారీపై పదికిపైగా ప్రైవేటు కంపెనీలు ఆసక్తి కనబరిచాయని సోమనాథ్ మంగళవారం తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ'కు నిరసనగా నేడు భారత్ బంద్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశంపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా బుధవారం భారత్ బంద్ నిర్వహిస్తున్నారు. 'ది రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి' బంద్‌కు పిలుపు ఇవ్వగా, పలు ఎస్సీ ఎస్టీ సంఘాలు, బీఎస్పీ మద్దతు పలికాయి. భారత్ బంద్‌లో తమ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పాల్గొనాలని బీఎస్పీ కోరింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ విధానానికి లోబడి ఉప కులాలను వర్గీకరించే హక్కును ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు కల్పిస్తూ ఈ నెల 1వ తేదీన సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. కాగా, బంద్ నుంచి అంబులెన్స్‌లు, అత్యవసర సర్వీసులు, ఆస్పత్రులు-వైద్య సేవలు, ఫార్మసీ, పోలీసు సర్వీసులకు మినహాయింపు ఇచ్చారు.

ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయించం

- హైకోర్టుకు నివేదించిన ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 94ను సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయించబోమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మంగళవారం హైకోర్టుకు నివేదించింది. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిశీలన మాత్రమే చేస్తున్నారని యూనివర్సిటీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ విజయ్‌కుమార్ కోర్టుకు తెలియజేశారు. ఈ వివరాలు నమోదు చేసిన ధర్మాసనం జీవో 94 విషయంలో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)ని ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. మైనార్టీ కాలేజీలు మినహా ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద భర్తీ చేసే మొత్తం సీట్లలో 10శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా బలహీన వర్గాలు) కోటా కింద భర్తీ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 6న జారీచేసిన జీవో 94ను సవాల్ చేస్తూ పి.చరిష్మా, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం జీవో 94ను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జీవో 94తోపాటు ప్రస్తుతం కాలేజీల్లో ఉన్న 50 శాతం ఓపెన్ కేటగిరీ సీట్లలోనే 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలని ఎన్ఎంసీ ఇచ్చిన పబ్లిక్ నోటీసును సవాల్ చేస్తూ గుంటూరుకు చెందిన తుమ్మల శ్రీజ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది రాజ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ... కోర్టు జీవో 94ను సస్పెండ్ చేసినప్పటికీ హెల్త్ యూనివర్సిటీ నిబంధనలను మార్చలేదన్నారు. దానికి అనుగుణంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. యూనివర్సిటీ తరఫు స్టాండింగ్ కౌన్సిల్ స్పందిస్తూ... జీవో 94ను సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయించబోమని ధర్మాసనానికి నివేదించారు.

వైద్యుల భద్రతపై టాస్క్‌ఫోర్స్!

(మొదటి పేజీ తరువాయి)



నర్సులకు భద్రత, గౌరవప్రదమైన పరిస్థితులు కల్పించడానికి జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎన్‌టీఎఫ్‌కు నిర్దేశించింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్, తన మధ్యంతర నివేదికను మూడు వారాల్లోగా.. పూర్తిస్థాయి నివేదికను రెండు నెలల్లోగా సమర్పించాలని ఆదేశించింది. టాస్క్‌ఫోర్స్‌కు కేంద్ర క్యాబినెట్, హోంశాఖ, ఆరోగ్యశాఖ కార్యదర్శులు.. జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) చైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రెసిడెంట్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని ధర్మాసనం పేర్కొంది. వైద్యులపై భౌతికదాడులు, లైంగిక హింసకు సంబంధించి వైద్యసంస్థలు తమకు తాము ఎలాంటి నిబంధనలను రూపొందించుకోకపోవడం తీవ్ర ఆందోళనకరం అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. వైద్యుల భద్రత కోసం చట్టాలు ఉన్నాయని.. అయితే అవి వ్యవస్థాగత సమస్య (సిస్టమెటిక్ ఇష్యూస్)లను పరిష్కరించలేవు అని వ్యాఖ్యానించింది. పనిచేసే చోట వైద్యులకు భద్రతాలేమిపై సుప్రీం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందుకు మరో అత్యాచారమో.. హత్యో జరిగేదాకా ఎదురుచూడకూడదు అని కోర్టు వ్యాఖ్యానించింది. ఆర్జీ కర్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్యకు గురైన జూనియర్ వైద్యురాలి పేర్లు, ఫొటోలు, వీడియోలను తక్షణమే సామాజిక మాధ్యమాల్లోంచి తొలగించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యులు.. ఆందోళనలను విరమించి, ఎప్పటిలాగే వైద్యసేవలు కొనసాగించాలని అప్పీలు చేసింది. వైద్యుల సమ్మెతో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొంది. "వైద్యుల భద్రతపై భరోసా కల్పించేందుకు మేం ఉన్నాం.. ప్లీజ్ మమ్మల్ని నమ్మండి" అని వైద్యులను ఉద్దేశించి పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆస్పత్రి వైద్యులు తమ సమ్మెకు ముగింపు పలికారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించడాన్ని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. మరోవైపు.. ఆర్జీ కర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపేందుకు స్వామి వివేకానంద స్టేట్ పోలీస్ అకాడమీ ఐజీ డాక్టర్ ప్రణవ్ కుమార్ సారథ్యంలో నాలుగు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

టాస్క్‌ఫోర్స్ సభ్యులు వీరే

1. సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి, ఏవీఎస్ఎం, వీఎస్ఎం, డీజీ, మెడికల్ సర్వీసెస్ (నేవీ)
2. డి.నాగేశ్వర్‌రెడ్డి, చైర్మన్, ఎండీ, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ, ఏఐజీ హాస్పిటల్స్
3. ఎం.శ్రీనివాస్, ఎయిమ్స్(ఢిల్లీ) డైరెక్టర్
4. ప్రతిమామూర్తి, నిమ్‌హాన్స్ డైరెక్టర్, బెంగళూరు
5. గోవర్ధన్ దత్ పూరి, ఎయిమ్స్(జోధ్‌పూర్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
6. సౌమిత్రా రావత్, మెంబర్, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సర్ గంగారామ్ హాస్పిటల్
7. ప్రొఫెసర్ అనితా సక్సేనా, వైస్ ఛాన్సలర్, పండిట్ బీడీ శర్మ మెడికల్ యూనివర్సిటీ, రోహ్‌తక్
8. పల్లవి సప్లే, డీన్, గ్రాంట్ మెడికల్ కాలేజ్,జేజే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, ముంబై
9. పద్మా శ్రీవాస్తవ, గతంలో ఢిల్లీ ఎయిమ్స్ న్యూరాలజీ విభాగం ప్రొఫెసర్.

50 ఏళ్ల కిందటా ఇదే దారుణం!

- అరుణా షాన్‌బాగ్‌ను ప్రస్తావించిన సీజేఐ



న్యూఢిల్లీ, ఆగస్టు 20: కోల్‌కతా హత్యాచారం అంశంపై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్.. అరుణా షాన్‌బాగ్ ఉదంతాన్ని ప్రస్తావించారు. 1973 నాటి ఈ ఘటన అప్పట్లో దేశంలో సంచలనం సృష్టించింది. ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేసే అరుణా షాన్‌బాగ్‌పై 1973 నవంబరు 27వ తేదీ రాత్రి ఆస్పత్రిలోని వార్డు బాయ్ సోహన్‌లాల్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమె మెడకు.. కుక్కలను కట్టివేయటానికి ఉపయోగించే గొలుసు వేసి బిగించటంతో.. అరుణ మెదడు తీవ్రంగా దెబ్బతిన్నది. నాటి నుంచి 2015లో మరణించేవరకూ అరుణ అచేతనస్థితిలో (పర్సిస్టెంట్ వెజిటేటివ్ స్టేట్) ఉండిపోయారు. అదే ఆస్పత్రిలో పని చేసే సందీప్ సర్దేశాయ్ అనే డాక్టర్‌తో నిశ్చితార్థం జరిగి, మరికొన్ని నెలల్లో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాల్సిన అరుణా షాన్‌బాగ్ జీవితం ఈ దారుణ ఘటనతో సర్వనాశనమైపోయింది. అయితే, ఆస్పత్రి సిబ్బంది నాలుగు దశాబ్దాలపాటు ఆమెకు సేవలు అందించి ప్రాణాలు నిలబెట్టారు. అరుణ నిమోనియాతో 2015 మే 18న మరణించారు. ఆమె జీవితాన్ని నాశనం చేసిన వార్డు బాయ్ సోహన్‌లాల్ కేవలం ఏడేళ్లపాటు జైలులో ఉండి 1980లో విడుదలయ్యాడు. ఆస్పత్రిలో జరిగే వైద్య ప్రయోగాల్లో ఉపయోగించే కుక్కల కోసం తీసుకొచ్చే ఆహారాన్ని సోహన్‌లాల్ దొంగిలిస్తుండటంతో అరుణ అతడిని మందలించి, అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. దీనిపై కక్షతో ఆమెపై సోహన్‌లాల్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

లోకం తీరు



రాహుల్ పౌరసత్వంపై వ్యాజ్యం 'పిల్'గా స్వీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పౌరసత్వంపై బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యం స్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా విచారణ జరపడానికి మంగళవారం ఢిల్లీ హైకోర్టు అంగీకారం తెలిపింది. రాహుల్ గాంధీ గతంలో ఓ బ్రిటిష్ కంపెనీకి డైరెక్టర్‌గా పనిచేసినట్టు పత్రాలు ఉన్నందున ఆయన భారత పౌరసత్వాన్ని రద్దు చేసేలా కేంద్ర హోం శాఖను ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ నారుల.. సుబ్రహ్మణ్య స్వామిని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ పిటిషన్ ద్వారా ఏ చట్టబద్ధమైన హక్కును అమలు చేయాల్సి ఉందో అర్థం కావడం లేదని అన్నారు. కేసును స్వయంగా వాదిస్తున్న స్వామి సమాధానం ఇస్తూ దీనిని 'పిల్'గా పరిగణించి సంబంధిత ధర్మాసనానికి పంపించవచ్చని తెలిపారు. దీంట్లో తన సొంత ప్రయోజనాలు ఏవీ లేవని, భారత ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ సెప్టెంబరు 26న ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారించే రోస్టర్ బెంచ్‌కు కేసును బదిలీ చేస్తున్నట్టు తెలిపారు.



బడిలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడి

- స్కూల్ అటెండెంటే నిందితుడు
- థానేలో ఘటన

ముంబై, ఆగస్టు 20: విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికుల ఆగ్రహంతో మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్ అట్టుడికిపోయింది. స్థానికంగా ఒక పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన అటెండెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వందలాది మంది ఆందోళనకు దిగారు. వారంతా ఉదయమే ఆ పాఠశాల గేటును బద్దలుకొట్టి.. లోపలికి వెళ్లి తలుపులు, కిటికీలను ధ్వంసం చేశారు. తర్వాత స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకుని పట్టాలపై బైఠాయించారు. దాంతో పలు సబ్-అర్బన్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయవలసి వచ్చింది. దూర ప్రాంతాలకు వెళ్లే 12 రైళ్లను దారి మళ్లించారు. ఆ పాఠశాలలో అటెండెంట్‌గా పని చేస్తున్న వ్యక్తి అక్కడ చదువుతున్న ఇద్దరు చిన్నారులపై (3, 4 ఏళ్లు) ఈ నెల 13న టాయ్‌లెట్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారిలో ఓ చిన్నారి బడికి వెళ్లడానికి భయపడుతుండడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా అటెండెంట్ అఘాయిత్యం బయటపడింది. ఆ చిన్నారి ప్రైవేటు భాగాలకు గాయమైనట్టు వైద్య పరీక్షల్లో గుర్తించారు. ఈ దారుణంపై ఫిర్యాదు చేసినా పోలీసులు వెంటనే స్పందించలేదని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 17న నిందితుడిని అరెస్టు చేసి, 'పోక్సో' చట్టం కింద కేసు నమోదు చేశారు. పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్‌ను, కొందరు సిబ్బందిని సస్పెండ్ చేసింది. కేసు విచారణ వేగంగా జరిగేలా.. నిందితుడికి ఉరి శిక్ష పడేలా చూస్తామని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే హామీ ఇచ్చారు.

కేంద్రంలో నేరుగా నియామకాలు రద్దు

- పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయం
- ఎంతవరకైనా వెళ్తాం: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: విపక్షాల ఒత్తిడికి కేంద్రం తలొగ్గింది. వివాదాస్పదంగా మారిన నేరుగా నియామకాల(లేటరల్ ఎంట్రీ) ప్రక్రియను నిలిపివేసింది. 2018 నుంచి అమలు చేస్తున్న ఈ విధానాన్ని పునఃపరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఇచ్చిన ఆదేశం మేరకు నాలుగు రోజుల క్రితమే ఇచ్చిన ఉద్యోగ నియామకాల ప్రకటనను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రద్దు చేసింది. నోటిఫికేషన్ వెలువడగానే కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్లకు గండి కొడుతున్నారని మండిపడ్డారు. దొడ్డిదారిలో ఆరెస్సెస్ సానుభూతిపరులను కేంద్ర ప్రభుత్వంలోని కీలక ఉద్యోగాల్లోకి తెచ్చి పెట్టేందుకు ఈ విధానాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. ఆయనతో విపక్షాలే కాకుండా ప్రభుత్వంలో భాగస్వాములైన ఎల్‌జేపీ, జేడీయూలు గొంతు కలిపాయి. ఎల్‌జేపీ అధ్యక్షుడు, దళితనేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేరుగా నియామకాల మీద అభ్యంతరం తెలిపారు. ప్రైవేటు సెక్టారులో ఎలాగూ రిజర్వేషన్లు లేవని, ప్రభుత్వంలో ఉన్న రిజర్వేషన్లకు గండి కొడితే ఎలా అని చిరాగ్ ప్రశ్నించారు. దాంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలో కొందరు బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారు. కాగా, కూటమిలో అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాని కార్యాలయం చిరాగ్ పాశ్వాన్‌తో సంప్రదింపులు జరిపింది. పీఎంవో ఆదేశాల మేరకే రద్దు నిర్ణయం వెలువడింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో జాయింట్ సెక్రెటరీ, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ హోదాలో 45 మందిని నేరుగా నియమించడానికి ఈ నెల 17న యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. దానిపై రాజకీయ వివాదం రాజుకోవడంతో రద్దు చేశారు.

ఎంపాక్స్ చికిత్సకు మార్గదర్శకాలు

- రోగుల ఐసొలేషన్‌కు 5 పడకలు కేటాయింపు
- వ్యాక్సిన్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం: సీరం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఎంపాక్స్ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించడానికి ఢిల్లీ ఎయిమ్స్ మంగళవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఐసొలేషన్ వార్డులో చికిత్స కోసం ఐదు పడకలను కేటాయించింది. ఇతర రోగులు, సిబ్బందితో కాంటాక్ట్‌ను తగ్గించడానికి అనుమానిత రోగులను వెంటనే నిర్దేశిత ఐసొలేషన్ వార్డులో ఉంచాలని పేర్కొంది. ఈ వ్యాధిపై అవగాహన పెంచడం, వేగంగా గుర్తించడం, వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి కఠినమైన నియంత్రణ చర్యలు అవసరమని తెలిపింది. ఎయిమ్స్ జారీ చేసిన ఎస్‌వోపీ ప్రకారం.... మంకీపాక్స్ అనేది వైరల్ జునోసిస్ వ్యాధి. ఇది మశూచి రోగుల్లో కనిపించిన లక్షణాలను పోలి ఉంటుంది. అయితే దీని తీవ్రత తక్కువ. మంకీపాక్స్‌కు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, ఏడాదిలో సానుకూల ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నామని పుణెలోని సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా మంగళవారం ప్రకటించారు.



హైదరాబాద్‌లోని ఫీవర్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎంపాక్స్ వార్డులో పడకలు

మరో కొవిడ్ కాదు

ఎంపాక్స్‌ను కొవిడ్-19తో పోల్చలేమని, దాని వ్యాప్తిని నియంత్రించడం సాధ్యమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారి ఒకరు తెలిపారు. దీని వ్యాప్తిని అరికట్టడానికి అవసరమైన చర్యలు అధికారులకు తెలుసని అన్నారు. మనందరం కలిసి ఎంపాక్స్‌ను ఎదుర్కోవాలని డబ్ల్యూహెచ్‌వో యూరప్ రీజినల్ డైరెక్టర్ హాన్స్ క్లూజ్ పేర్కొన్నారు. ప్రస్తుతం యూరప్‌లో ప్రతినెలా క్లేడ్-2 ఎంపాక్స్ స్ట్రెయిన్ కొత్త కేసులు 100 వరకూ నమోదవుతున్నాయని హాన్స్ క్లూజ్ తెలిపారు.

నిండుకుండల్లా జలాశయాలు

- పదేళ్ల గరిష్ఠానికి రిజర్వాయర్లు
- కేంద్ర జలసంఘం నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశంలోని జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ప్రస్తుత నీటి నిల్వలు పదేళ్ల సగటుతో పోల్చుకుంటే 14 శాతం పెరిగాయి. ఇది ఈ సంవత్సరంలో గణనీయమైన పెరుగుదల అని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) పేర్కొంది. తాజాగా దేశంలోని రిజర్వాయర్ల నీటిమట్టాల వివరాలను సీడబ్ల్యూసీ విడుదల చేసింది. దీని ప్రకారం.. 150 భారీ రిజర్వాయర్లలో 124 బిలియన్ క్యూబిక్ మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ఇది ఆయా జలాశయాల ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో 69 శాతం. గత ఏడాది ఇదే సమయానికి 111.85 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు మాత్రమే నిల్వ ఉండడం గమనార్హం. రిజర్వాయర్ల సాధారణ నీటి నిల్వ 108.79 బిలియన్ క్యూబిక్ మీటర్లు. దీంతో పోల్చుకుంటే.. ప్రస్తుత నిల్వలు పదేళ్ల సగటుతో పోల్చుకుంటే 14 శాతం పెరిగాయి. అయితే.. రాష్ట్రాల వారీగా నీటి నిల్వలను సమీక్షించినప్పుడు కొంత వ్యత్యాసం కనిపిస్తోందని నివేదిక వివరించింది.

- ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడులలోని రిజర్వాయర్లు జలసిరిని సంతరించుకున్నాయని సీడబ్ల్యూసీ నివేదిక స్పష్టం చేసింది. ఆయా జలాశయాల సాధారణ నీటి నిల్వ సామర్థ్యం 60 శాతం అయితే.. ప్రస్తుతం 79 శాతంలో రిజర్వాయర్లు నిండుకుండల్లా ఉన్నాయని తెలిపింది. గత ఏడాది 53 శాతం నీటి నిల్వలే నమోదైనట్టు వివరించింది.
- దేశవ్యాప్తంగా వరి విస్తీర్ణం 6 శాతం పెరిగినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ప్రస్తుత 2024-25 ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 369.05 లక్షల హెక్టార్ల మేరకు వరి సాగవుతున్నట్టు తెలిపింది.

తాడిపత్రిలో హైటెన్షన్!

(మొదటి పేజీ తరువాయి)

అరగంటలో పోలీసు బందోబస్తు మధ్య అనంతపురానికి వెళ్లారు. తరువాత కాసేపటికే ఘర్షణలు మొదలయ్యాయి. పెద్దారెడ్డి వస్తున్నారని తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఆయన నివాసం వద్ద ఆందోళనకు దిగాయి. వైసీపీ మద్దతుదారులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. వైసీపీ వర్గీయులు రాళ్లు విసరడంతో టీడీపీ వర్గీయులు ఎదురు దాడి చేశారు. ఈ దాడిలో వైసీపీ వర్గీయుడు అడ్డు రఫీ గాయపడ్డారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇదే సమయంలో పెద్దారెడ్డి ఇంటి వద్దకు వెళుతున్న వైసీపీ నాయకుడు కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి.. టీడీపీ వర్గీయులను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు నేరుగా పుట్లూరు రోడ్డులోని ఆయన ఇంటిపైకి వెళ్లి దాడికి దిగారు. ఇంట్లో ఫర్నిచర్‌తో పాటు బయట నిలిపి ఉంచిన రెండు కార్లు, స్కూటర్‌ను ధ్వంసం చేశారు.

ఏబీఎన్ రిపోర్టర్‌కు బెదిరింపులు

ఘర్షణను కవర్ చేస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రమణను కందిగోపుల మురళి బెదిరించారు. 'నువ్వెందుకు వచ్చావ్..? బయటకు వెళ్లకపోతే గన్‌తో కాల్చి పారేస్తా..' అని గన్ బయటకు తీసి బెదిరించారు. ఈ తతంగమంతా పోలీసుల ఎదుటే జరిగినా వారు నోరు మెదపలేదు. మురళీప్రసాద్‌రెడ్డి తనను గన్‌తో బెదిరించారని, దుర్భాషలాడారని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్‌కు రమణ ఫిర్యాదు చేశారు. కందిగోపుల మురళిపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎస్పీని కోరారు.

భద్రత కట్టుదిట్టం

జిల్లాలో అత్యంత సమస్యాత్మక ప్రాంతంలో ఘర్షణలు చెలరేగడంతో ఎస్పీ జగదీశ్ వెంటనే తాడిపత్రికి చేరుకున్నారు. ఘటన గురించి పోలీసు స్టేషన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలు అదుపు తప్పకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటుచేయాలని సూచించారు. ఘర్షణల నేపథ్యంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాసం, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసం, వైసీపీ నేత కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి నివాసాల వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఆ 172 కోట్లు ఎక్కడ?

- జగన్ హయాంలో కేంద్రం నిధుల మళ్లింపు
- విశాఖలో యూనిటీ మాల్ కోసం ప్రతిపాదనలు
- 2023-24లో విడుదల చేసినా మాల్ కట్టని వైనం
- ఆ డబ్బు ఎటు మళ్లించారు? రుషికొండ ప్యాలెస్‌కా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లలో జగన్ సర్కారు అడ్డగోలుగా అప్పులు చేసింది. కేంద్రం నిధులను ఇష్టారీతిన దారి మళ్లించింది. 2023-24లో కేంద్రం ఇచ్చిన నిధుల్లో రూ.172 కోట్లు ఏమి చేసిందో? ఎందుకు ఖర్చు పెట్టిందో నేటికీ అంతు చిక్కడం లేదు. రాష్ట్రాలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కేంద్రం రాష్ట్రాల మూలధన వ్యయం కోసం ప్రత్యేక సాయం అనే పథకాన్ని కరోనా తర్వాత నుంచి అమలు చేస్తోంది. మూలధన వ్యయం విభాగంలోకి వచ్చే ప్రాజెక్టుల ప్రతిపాదనలను ఆయా రాష్ట్రాలు పంపితే, సంబంధిత శాఖలు వాటిని పరిశీలించి, ఆమోదించాక వాటి కయ్యే ఖర్చును కేంద్రమే భరిస్తుంది. ఈ పథకాన్ని వాడుకోవడంలో వైసీపీ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. నాలుగేళ్లలో కేవలం 2022-23లో మాత్రమే సమర్థవంతంగా వాడుకుంది. 2020-21లో రూ.688 కోట్లు, 2021-22లో రూ.501 కోట్లు, 2022-23లో రూ.6,105 కోట్లు, 2023-24లో రూ.172 కోట్లు ఈ పథకం కింద జగన్ సర్కార్ వాడుకోగలిగింది. 2023-24లో వైజాగ్‌లో యూనిటీ మాల్ కడతామంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రూ.172 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. ప్రత్యేక సాయం పథకం కింద నిధులు కేటాయించాలని కోరింది. అయితే 2022-23లో ఈ పథకం కింద వాడుకున్న నిధులకు యూసీలు సమర్పించిన తర్వాత 2023-24 ప్రతిపాదనలకు నిధులు విడుదల చేస్తామని కేంద్రం ఆర్థిక శాఖకు లేఖ రాసింది. కానీ 2023-24లో ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.180 కోట్లు విడుదలైనట్టుగా కేంద్రం వెల్లడించిన వివరాల్లో ఉంది. అందులో రాష్ట్రం రూ.172 కోట్లు వాడేసినట్టు పేర్కొంది. వైజాగ్‌లో యూనిటీ మాల్ కట్టనేలేదు. ఆ రూ.172 కోట్లు ఈ ప్రాజెక్టు కోసం తెచ్చారు. అయితే ఎక్కడ వాడారు? జగన్ ఐదేళ్ల పాలనలో కట్టిన ఏకైన భవనం రుషికొండ ప్యాలెస్ మాత్రమే. రుషికొండ ప్యాలెస్ ఖర్చు రూ.500 కోట్లు. ఆ రూ.172 కోట్లను రుషికొండ ప్యాలెస్ నిర్మాణం కోసం మళ్లించారా? అనేది స్పష్టత లేదు. కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం ఢిల్లీ నుంచి వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లిస్తోందని హెచ్చరిస్తూ 2023 సెప్టెంబరులో కేంద్ర ఆర్థిక శాఖ రాష్ట్ర ఆర్థిక శాఖకు లేఖ రాసింది. ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలు, పీఎం ఆవాస్ యోజన (గ్రామీణ్, అర్బన్), అంగన్‌వాడీ, పోషన్ 2.0 పథకాల మార్గదర్శకాలు ఉల్లంఘించినట్టు వెల్లడించింది. అలాగే, 13 కేంద్ర ప్రభుత్వ పథకాల ఇంటరెస్ట్ డిపాజిట్ సర్టిఫికెట్లను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించలేదని 2024 జనవరి 9న రాసిన లేఖలో కేంద్రం పేర్కొంది. 84 పథకాలకు సంబంధించిన సర్టిఫికెట్లను రాష్ట్రం సమర్పించిందని ఇందులో 3 పథకాలకు సంబంధించి కొంత వివాదం ఉందని వెల్లడించింది. 7 స్కీములు ఆపేశాక డీడీవో మ్యాపింగ్ చేశారని పేర్కొంది. మరో 3 స్కీముల్లో సమర్పించిన సర్టిఫికెట్లు పీఎఫ్ఎంఎస్‌లో ఉన్న వివరాలతో సరిపోలడం లేదని వెల్లడించింది. చాలా సర్టిఫికెట్ల మీద ఆర్థిక శాఖ సెక్రటరీల సంతకాలు, స్టాంపులు లేవని పేర్కొంది. ఆర్టీఐ కార్యకర్త రవికుమార్ అడిగిన ప్రశ్నలకు కేంద్రం ఈ సమాచారం ఇచ్చింది.

వైసీపీ నిర్లక్ష్యంతో హజ్‌హౌస్ శిథిలం

- టీడీపీ హయాంలో రూ.24 కోట్లు మంజూరు
- 80% పనులు పూర్తి.. మిగిలిన పనులూ పూర్తిచేయని జగన్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నా మైనార్టీలు అంటూ దీర్ఘాలు తీసిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటలు నీటిమూటలేనని మరోసారి రుజువైంది. కడపలోని హజ్‌హౌస్ నిర్మాణమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. హజ్‌యాత్రకు వెళ్లే వారి కోసం 2015లో టీడీపీ ప్రభుత్వం కడప జిల్లాలోని చెన్నూరు సమీపంలో 12.56 ఎకరాలు కేటాయించింది. ఈ భూమిలో హజ్‌హౌస్ నిర్మాణానికి 2014-2019లో రూ.24 కోట్లు కేటాయించి, 80 శాతం నిర్మాణ పనులు పూర్తి చేసింది. హజ్‌హౌస్‌లో కార్యకలాపాలు కూడా ప్రారంభమయ్యాయి. కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి చిన్న చిన్న పనులు 20 శాతమే మిగిలాయి. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక హజ్‌హౌస్ కార్యకలాపాలను, నిర్మాణ పనులను గాలికొదిలేసింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చిల్లిగవ్వకూడా హజ్‌హౌస్‌కు కేటాయించలేదు. టీడీపీ హయాంలో నిర్మించిన హజ్‌హౌజ్ ఆలనాపాలనను వైసీపీ పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

కేఆర్ఎంబీ పరిధిలోకి విద్యుత్ కేంద్రాలు

- ఏపీ పిటిషన్‌పై సుప్రీం విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలలోని విద్యుత్ కేంద్రాలను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న విద్యుత్ కేంద్రాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ ఏపీ సర్కార్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ అంశానికి సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చామని, అఫిడవిట్ దాఖలు చేశామని కేంద్రం తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. విచారణను సెప్టెంబరు 9కి వాయిదా వేసింది.

పీజీ అడ్మిషన్లు ఢమాల్!

- ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో భారీగా తగ్గుదల
- తొలిసారి 20వేల దిగువకు పడిన ప్రవేశాలు
- 2020లో పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు
- జగన్ ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు ఉన్నత విద్య దూరం

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విద్య పరిస్థితి దయనీయంగా మారి ంది. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన పీజీ కోర్సులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. 2020లో పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దుచేసిన జగన్ ప్రభుత్వం చివరి వరకు దానిని పునరుద్ధరించలేదు. మొత్తంగా గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం పీజీ విద్యను అస్తవ్యస్తం చేసింది. అలాగే డిగ్రీ అడ్మిషన్లు పడిపోవడం కూడా పీజీ ప్రవేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఎన్నడూలేని విధంగా 2024-25 పీజీ ప్రవేశాలు మరింత ఘోరంగా పడిపోయాయి. తాజాగా ఉన్నత విద్యామండలి విడుదల చేసిన లెక్కల ప్రకారం ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్లు తొలిసారి 18,232కు పరిమితమయ్యాయి. ఒకప్పుడు 50వేల వరకు ఉన్న ప్రవేశాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. కానీ అడ్మిషన్ల సంఖ్య ఇంత దారుణంగా 20వేల లోపునకు పడిపోవడం ఇదే తొలిసారి. గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని క్రమంగా తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా పీజీ విద్యకు ఈ పథకాన్ని రద్దు చేసింది. పీజీ ఫీజుల్లో అక్రమాలు వెలికితీసి, మళ్లీ రీయింబర్స్‌మెంట్ అమలుచేస్తామని 2020లో ప్రకటించింది. ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సులకూ ఫీజులు ఆపేసింది. అంతకుముందు పీజీ కోర్సులకు సంబంధించి కాలేజీలకు రూ.450కోట్లు చెల్లించాల్సి ఉండగా వాటిని పెండింగ్ పెట్టింది. జగన్ ప్రభుత్వం కావాలనే పథకాన్ని రద్దు చేసిందని కాలేజీ యాజమాన్యాలు నిర్ధారణకు వచ్చాయి. చివరకు ఫీజులు కట్టలేని పేద విద్యార్థులు డిగ్రీ దాటి పీజీ చదువులు కొనసాగించ లేకపోయారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రభావం

రాష్ట్రంలో డిగ్రీ చదివేవారి సంఖ్య పడిపోవడం కూడా పీజీ విద్యను దెబ్బతీసింది. ఏపీలో 4.47లక్షల డిగ్రీ సీట్లు అందుబాటులో ఉంటే ఈ ఏడాది 1.51లక్షల సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. గత రెండేళ్ల నుంచి దాదాపుగా ఇదే స్థాయిలో విద్యార్థులు డిగ్రీలో చేరుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నత విద్యపై చేసిన రకరకాల ప్రయోగాలు డిగ్రీపై ప్రభావం చూపాయి. భవిష్యత్తులోనూ పీజీకి విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిపోయేలా గత ప్రభుత్వం సింగిల్ మేజర్ డిగ్రీ విధానం అమల్లోకి తెచ్చింది. మూడు సబ్జెక్టుల డిగ్రీ విధానంలో విద్యార్థులు వాటిలో ఏదో ఒకదానిపై పీజీలో చేరేవారు. కానీ, సింగిల్ మేజర్‌లో ఒక మేజర్ సబ్జెక్టు, ఒక మైనర్ సబ్జెక్టు ఉంటాయి. ఆ రెండిటిలో ఏదైనా ఒక సబ్జెక్టు ఆధారంగా పీజీలో చేరొచ్చు. అంటే గతంలో పీజీకి మూడు ఆప్షన్లు ఉంటే, ఇప్పుడు అవి రెండుకు తగ్గిపోయాయి.

ఐసెట్ సీట్ల కేటాయింపు

ఐసెట్ కౌన్సెలింగ్ పూర్తిచేసి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు ఉన్నత విద్యామండలి మంగళవారం తెలిపింది. మొత్తం 21,480 మంది దరఖాస్తు చేసుకోగా, 19,665 మంది అడ్మిషన్లకు ఆప్షన్ల ఎంపిక చేసుకున్నారని వివరించింది. 18,232 మందికి సీట్లు కేటాయించినట్లు పేర్కొంది. కాగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మొత్తం 62,076 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో కన్వీనర్ కోటాలో 46,454 సీట్లుంటే వాటిలో సగం కూడా భర్తీ కాలేదు.

వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కించాలని చెప్పలేదు

- ఈవీఎం మెమరీని మాత్రమే పరిశీలించమంది
- సుప్రీంతీర్పును తప్పుగా అర్థం చేసుకున్నారు
- వైసీపీ మాజీ మంత్రి బాలినేని వ్యాజ్యంపై హైకోర్టుకు నివేదించిన కేంద్ర ఎన్నికల సంఘం

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎం, వీవీప్యాట్ల తనిఖీ, పరిశీలనకు బదులుగా మాక్ పోలింగ్ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఈసీఐ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. "సుప్రీంకోర్టు తీర్పును పిటిషనర్ తప్పుగా అర్థం చేసుకున్నారు. కనీసం 5 పోలింగ్ కేంద్రాల్లో వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించి, ఈవీఎంలలో పోలైన ఓట్లతో పోల్చి చూడాలని సుప్రీంకోర్టు ఎక్కడా చెప్పలేదు. ఈవీఎంలలో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయడాన్ని బర్న్(burnt) మెమరీ అంటారు. మెషీన్ రూపొందించినప్పుడు మాత్రమే ఈవీఎంలోని మైక్రోచిప్‌లో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయగలరు. పోటీలో ఉన్న అభ్యర్థులు అభ్యంతరం లేవనెత్తినప్పుడు బర్న్ మెమరీ ఏమైనా ట్యాంపరింగ్ జరిగిందా? అనే విషయాన్ని సాంకేతిక నిపుణులు, అధికారులు, అభ్యర్థుల సమక్షంలో పరిశీలించాలని సుప్రీంకోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలోనే మాక్ పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది" అని వివరించారు. అయితే, మంగళవారం కోర్టు సమయం ముగియడంతో ఈసీఐ వాదనల కొనసాగింపు కోసం విచారణను న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారానికి వాయిదా వేశారు. దీనికి ముందు పిటిషనర్ బాలినేని తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. మాక్ పోలింగ్ నిర్వహించాలన్న ఈసీఐ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఈ నెల 13న రిట్ దాఖలు చేశామన్నారు. మాక్ పోలింగ్‌ను వాయిదా వేయాలని ఈ నెల 16న ఎన్నికల సంఘానికి వినతిపత్రం అందజేశామని చెప్పారు. రిట్ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో మంగళవారం జరిగిన మాక్ పోలింగ్‌లో పిటిషనర్ పాల్గొనలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకి లోబడి వ్యవహరించాల్సిన బాధ్యత ఈసీఐపై ఉందని తెలిపారు.

సర్దుబాటు నిబంధనలు సవరించాలి

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఉపాధ్యాయుల సర్దుబాటులో అసంబద్ధంగా ఉన్న నిబంధనలను సవరించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి కోరారు. మిగులు టీచర్లలో మెరిట్ కం రోస్టర్ విధానం పాటించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు పూర్తిచేయకుండానే, ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడం సరికాదన్నారు. టీచర్ల సర్దుబాటు మండల స్థాయిలో పూర్తిచేసిన తర్వాతే డివిజన్ స్థాయిలో చేపట్టాలని ఆపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీవీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మిగులు ఉపాధ్యాయులను అదే మేనేజ్‌మెంట్‌లో సర్దుబాటు చేయాలని నోబుల్ టీచర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, బి.హైమారావు డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో అధికారులు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు పాటించడం లేదని ఆరోపించారు.

ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌కు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 21 నుంచి 27 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది. 22 నుంచి 28 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, 29 నుంచి సెప్టెంబరు 2 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక ఉంటుందని వివరించింది. 5వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని, 5 నుంచి 7లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని, 5 నుంచే తరగతులు ప్రారంభమవుతాయని తెలిపింది.

బ్రహ్మోత్సవాల్లో దాతలకు గదుల కేటాయింపు రద్దు

తిరుమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దాతలకు గదుల కేటాయింపు రద్దు చేసినట్టు టీటీడీ తెలిపింది. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో టీటీడీలోని వివిధ ట్రస్టులకు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు కేటాయించే గదులను రద్దు చేసినట్టు స్పష్టం చేసింది. అక్టోబరు 4న ధ్వజారోహణం, 12న చక్రస్నానం జరిగే రోజులు మినహా మిగతా రోజుల్లో దాతలను దర్శనానికి అనుమతిస్తారు.

27న తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తిరుమలలో ఈ నెల 27వ తేదీన శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖమండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. 28వ తేదీ సాయంత్రం 4 గంటలకు తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహిస్తారు.

అక్టోబరు 15న పైడిమాంబ సిరిమానోత్సవం

విజయనగరం రూరల్, ఆగస్టు 20: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ సిరిమానోత్సవం అక్టోబరు 15న నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ ప్రసాదరావు, ఆలయ అర్చకులు బంటుపల్లి వెంకటరావు తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. సిరిమానోత్సవానికి ముందు రోజు తొలేళ్ల ఉత్సవం జరుగుతుందన్నారు. పైడిమాంబ భక్తులు మండల దీక్ష, అర్ధమండల దీక్షలు సెప్టెంబరు 20 నుంచి ప్రారంభమౌతాయన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త బెడద

మంకీపాక్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న మన నౌకాశ్రయాలకు కూడా నిర్దిష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ వైరస్ సోకినవారిని ఐసొలేషన్‌లో ఉంచేందుకు, చికిత్స చేసేందుకు ఢిల్లీలోని రామ్‌మనోహర్‌లోహియా, సఫ్దర్‌జంగ్, లేడీ హార్డింగ్ ఆస్పత్రులను కేంద్రం గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కొన్ని ఆస్పత్రులను ప్రత్యేకంగా కేటాయించాలని, మంకీపాక్స్ లక్షణాలున్న వ్యక్తులు బయట పడినప్పుడు ఆ సమాచారం తమతో పంచుకోవాలని కేంద్రం కోరింది. ప్రస్తుతానికి మన దేశంలో ఒక్కకేసూ లేకున్నా, ఆ వైరస్ పొరుగుదేశం వరకూ సమీపించడంతో మనం అప్రమత్తంగా ఉండక తప్పదు.

భారతదేశానికి సంబంధించినంతవరకూ దాని వ్యాప్తి అంత ఉధృతంగా ఉండదని ప్రస్తుతానికి అంచనాలున్నాయి. భయం అక్కరలేదని నిపుణులు భరోసా ఇస్తున్నారు. పాకిస్థాన్‌లో నాలుగుకేసులు నమోదైనప్పటికీ, వ్యాధిసోకినవారి సంఖ్య అనధికారికంగా ఇంకా ఎక్కువగా ఉండవచ్చును. కేవలం ఎంపాక్స్ కారణంగా దేశాల మధ్య రాకపోకలపై నిషేధాలు లేవు కనుక, రాబోయే రోజుల్లో విదేశాల నుంచి దిగుమతయ్యే కేసుల సంఖ్య మన దేశంలో నమోదుకావచ్చు. విమానాశ్రయాల్లోనూ, నౌకాశ్రయాల్లోనూ తనిఖీలు పెంచడం, అనుమానం ఉన్నవారిని పరీక్షించి, వేగంగా ఫలితాలు సాధించి నిర్దిష్టమైన చర్యలకు నడుం బిగించడం తక్షణ కర్తవ్యం. భారతదేశంలో గత రెండేళ్ళలో ఓ ముప్పై కేసులు నమోదుకావడంతో పాటు, మొన్న మార్చిలో కూడా కేరళలో ఓ మంకీపాక్స్ కేసు బయటపడింది.

కాంగోలో ఈ వ్యాధి వేగంగా విస్తరించి, తీవ్రమైన ప్రభావాన్ని వేయడంతో ప్రపంచ ఆరోగ్యసంస్థ అంతర్జాతీయస్థాయి ఆరోగ్య అత్యయిక స్థితిని ప్రకటించడంతో పాటు, స్వల్పవ్యవధిలోనే రెండుసార్లు హెచ్చరికలు చేయవలసివచ్చింది. గతంలో కాలూనని ఆఫ్రికన్ దేశాల్లోకి కూడా విస్తరిస్తూ, పదిరోజుల్లో అరడజను దేశాలకు వేగంగా వ్యాపించి, గత ఏడాదితో పోల్చితే రెట్టింపు కేసులు నమోదవుతున్నందున ఆరోగ్య సంస్థ ఆందోళన చెందుతోంది. కాంగోలో వేలాదికేసులు నమోదై, ఆరు వందల మరణాల వరకూ రికార్డు కావడం అటుంచితే, స్వీడన్ వంటి సుదూరప్రాంతాల్లో కూడా దీని ఛాయలు కనిపించడం విశేషం. రెండేళ్ళలో రెండుసార్లు ఈ వైరస్ వేగంగా వ్యాప్తిచెందుతూ ప్రపంచాన్ని భయపెట్టగలిగింది. ఇందుకు ప్రధాన కారణం ఈ తరహా వ్యాధుల విషయంలో అన్ని దేశాలూ ఏకతాటిపైకి వచ్చి వాటిపై సంఘటితంగా యుద్ధం చేయకపోవడమే. దీనితో, గతంలో కంటే మరింత శక్తిమంతమైన వేరియంట్‌తో అవి వ్యాప్తిచెందడానికి అవకాశమేర్పడుతోంది. అత్యంత ప్రమాదకరమైన కరోనా విషయంలో సైతం పేదదేశాలతో ధనికదేశాలు ఎంత అనుచితంగా వ్యవహరించాయో చూశాం. వాక్సిన్ల సరఫరాలో అగ్రరాజ్యాలు చూపిన ఆ వివక్ష సదరు వైరస్ మరికొంతకాలం ప్రపంచాన్ని వేధించడానికి కారణమైంది. ఉన్న ఒక్క ఎంపాక్స్ వాక్సిన్ ఆఫ్రికన్ దేశాలకు పూర్తిస్థాయిలో సరఫరాకాలేదు. అనుమతుల విషయంలో కాంగో బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం కూడా ప్రమాదాన్ని పెంచింది. వనరులు దోచుకోవడానికి తప్ప ఈ పేద దేశాల మంచి చెడులు పట్టించుకొనే తీరిక అగ్రరాజ్యాలకు ఉండదు. ఆఫ్రికన్ దేశాల పట్ల మిగతా ప్రపంచం చూపుతున్న నిర్లక్ష్యం అందరికీ చేటుచేస్తున్నది. జికా, చికున్‌గున్యా వంటి వ్యాధుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. దాదాపు ఆరుదశాబ్దాల క్రితం గుర్తించిన ఈ వ్యాధిని, నిరుపేద ఆఫ్రికన్ దేశాల సమస్యగా వదిలేయడంతో ఇప్పటికీ దానికి భయపడాల్సి వస్తున్నది. సుదీర్ఘకాలం పట్టించుకోని, పరిశోధనలు లేని కారణంగా ఇప్పుడు అది మరింత శక్తిమంతమైన వేరియంట్లతో విజృంభించ గలుగుతోంది.

ఎంపాక్స్ విషయంలో ఆఫ్రికన్ దేశాలన్నీ ఏకతాటిపైకి రావాల్సి ఉంది. పరిశోధనలపై పెట్టుబడులకు మిగతా ప్రపంచం సహకరించాలి. ఎంపాక్స్ వాక్సిన్ అభివృద్ధిపరచే పనిలో ఉన్నామని, త్వరలోనే అది వెలుగుచూడవచ్చునని సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అదర్ పూనావాలా మంగళవారం ఆశాభావం వ్యక్తంచేశారు. ఏటా ప్రపంచాన్ని భయపెట్టిపోతున్న ఈ వైరస్ కథ వేగంగా ముగించాల్సిన అవసరం ఉంది.

ఉపాధికై గల్ఫ్ దేశాలకు వచ్చిన ఇంజనీరింగ్ పట్టభద్రులు పలువురు తమ విద్యతో సంబంధం లేని ఇతర ఉద్యోగాలు చేసుకుంటున్నారు! వికసిత్ భారత్‌లో నైపుణ్య సమృద్ధ యువత కీలకమని మోదీ సర్కార్ గత ఐదేళ్లుగా చెబుతున్నా అందుకు తగిన కార్యాచరణ లేదు. స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఏకంగా ఒక నగరాన్ని నిర్మించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూనుకోవడం హర్షణీయమే అయినా అందుకు సరైన అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు మనముందున్న అసలు ప్రశ్న.

నైపుణ్యాల వృద్ధి-నయా నగరం

విద్యతోపాటు నైపుణ్యాల శిక్షణ, అభివృద్ధి అంశాన్ని అనేక దేశాలు గుర్తించి ఆ దిశగా చురుగ్గా అడుగులు వేస్తున్నాయి. ఉపాధి వలసలను ఇతోధికంగా ప్రోత్సహిస్తోన్న భారత్ కూడా కొన్ని చర్యలకు శ్రీకారం చుట్టింది. అయితే పురోగతి కొరవడింది. తెలుగు రాష్ట్రాలూ నైపుణ్యాల మెరుగుదలకు విశేష ప్రాధాన్యమిస్తున్నాయి. స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఒక ప్రత్యేక నగరాన్నే నెలకొల్పనున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సంతోషం, అభినందనీయం. మరి క్షేత్రస్థాయి పరిస్థితులు, అవకాశాల గురించి ఏమైనా అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు అసలు ప్రశ్న.

అన్ని రకాల సాంకేతిక ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్న గల్ఫ్ దేశాలకు వృత్తి విద్య పట్టభద్రులు ఉపాధి కొరకు ప్రతి రోజు వందల సంఖ్యలో వస్తుంటారు. ఒక కఠోర వాస్తవమేమిటంటే ఇంజనీరింగ్ పట్టభద్రులు పలువురు తమ విద్యతో సంబంధం లేని ఇతర ఉద్యోగాలు చేసుకుంటున్నారు!. సాఫ్ట్‌వేర్‌ను మినహాయిస్తే మిగిలిన రంగాలలో మన యువత నైపుణ్యాలు అంతంత మాత్రమే.

తెలుగు రాష్ట్రాలలో ఉబేర్, రాపిడో ఇత్యాది అద్దె రవాణా బైకులను నడిపే వారిలో అనేకులు ఇంజనీరింగ్ పట్టభద్రులే సుమా! దుబాయిలోని జబల్ అలీ మందిరం వెలుపల ఎండలో చిన్న చితక గిఫ్టు సామాన్లు లేదా సెంటు బాటిళ్ళ విక్రేతలలో కూడ కొందరు వారే ఉండడం ఒక లజ్జాకర పరిస్థితికి అద్దంపట్టడం లేదూ? ఇంజనీరింగ్ పట్టభద్రులు ఎంతో మంది చాలిచాలనీ వేతనాలతో నెట్టుకొస్తున్నారు. కారణమేమిటి? వారిలో వృత్తి నైపుణ్యాలు, భాషా కౌశలాలు కొరవడడమేనని చెప్పక తప్పదు.

గల్ఫ్ లేఖ

అరబ్ దేశాలలో ఫిలిప్పీన్స్, అమెరికాలో మెక్సికో జాతీయులకు ఉన్న సాంకేతిక నైపుణ్య పాటవాలు మన భారతీయుల వద్ద లేక పోవడం స్పష్టంగా కనపడుతుంది. తమ నైపుణ్యత ఆధారంగా అధిక వేతనంపై ఒక ఫిలిప్పీన్స్ జాతీయుడు తరచు ఉద్యోగం మారినట్లుగా ఒక భారతీయుడు మారడంలేదు, మారలేదు.

సాఫ్ట్‌వేర్‌లో పూర్తిగాను, వైద్య రంగంలో పాక్షికంగాను ఉన్నత స్థానాలలో భారతీయులు రాణిస్తున్నారు, సందేహం లేదు. అయితే క్రింది, మధ్య శ్రేణులలో మాత్రం ఇతర దేశస్థులు, ప్రత్యేకించి ఫిలిప్పీన్స్ వారితో పోటీపడలేకపోతున్నారు. ఈ వాస్తవాన్ని భారత్ అధికార వర్గాలు కూడా గుర్తించాయి. పరిశ్రమలు, భారీ నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాలలో నిపుణులను గుర్తించే నీలం రంగు హెల్మెట్‌లకు బదులుగా కార్మిక శ్రేణికి చిహ్నామైన పసుపు పచ్చ హెల్మెట్లు ఎక్కువగా ఉండడం మన స్థాయికి తగినట్లుగా లేదు. ఇంజనీర్లు లేదా మేనేజ్‌మెంట్ ప్రతినిధులుగా పని చేస్తున్న అత్యధికులకు ఆంగ్ల భాషలో ఒక నివేదిక రూపొందించడానికి నానా ప్రయాసలు పడవల్సిన పరిస్థితి!





సముద్రాల ఆవలి సీమలకు జరుగుతున్న వలసలను పక్కన పెడితే, దేశీయంగా కూడ అభివృద్ధికి అనుగుణంగా వృత్తి నిపుణులు లేకపోవడం ఎంతైనా శోచనీయం. అది అభివృద్ధికి విఘాతమవుతోంది. మహా నగరాలలో సైతం విభిన్న రంగాలలో అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా అందుబాటులో వృత్తి నిపుణులు లేరు. తెలుగునాట ఉన్నత స్థాయి నైపుణ్యత ఉన్నవారందరూ విదేశీబాట పడుతుండగా మధ్యతరగతి వృత్తులలో సైతం ఉత్తరాది రాష్ట్రాల యువత ముందుకు వస్తోంది. చివరకు కళాత్మక పనికి పెట్టింది పేరయిన ఒంగోలు తాపీ మేస్త్రీల స్థానంలో మధ్యప్రదేశ్ తాపీ మేస్త్రీలకు ఆదరణ లభిస్తోంది. అలాగే పొలాలలో వరి నాట్లు వేయడానికి బెంగాలీ కార్మికులు తెలుగునాటకు వస్తున్నారు. ఒక్క పట్టణంలో కూడ నైపుణ్యత కల్గిన ఒక ఎసి. టెక్నీషియన్ గానీ, మొబైల్ టెక్నీషియన్ గానీ లేకపోవడం గమనార్హం.

సరైన అధ్యాపక వ్యవస్థ లేని విద్యా సంస్థలు ఏటా వేలాది సంఖ్యలో అరకొర చదువుతో యువతను వీధులలోకి వదులుతున్నాయి. అనుభవపూర్వకంగా నేర్చుకునే అవకాశాలు వారికి ఏ మాత్రం లేవు. అప్రెంటిస్‌షిప్ విధానం అంతరించిపోయింది. సాంకేతిక విద్యా రంగంలో ఏళ్ళ తరబడి భారీ సంఖ్యలో ప్రొఫెసర్లు, లెక్చరర్ల ఖాళీలు ఉన్నాయి. ఒకప్పుడు జాతి నిర్మాణంలో ఐటిఐలు, పాలీటెక్నిక్‌లు ముఖ్య భూమిక వహించాయి. వీటిలో చదివి చక్కెర కర్మాగారాలలో పని చేసిన అనేక మంది ప్రపంచ అగ్రగామి పెట్రో రసాయనాల సంస్థలలో విజయవంతంగా పనిచేస్తున్నారు. మరి వారిని తీర్చిదిద్దిన ఆ పాలీటెక్నిక్‌లు ఇప్పుడు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి.

ఈ పరిస్థితులలో యువతలో తార్కిక శక్తిని, వృత్తిలో సృజనాత్మక దృక్పథాన్ని పెంపొందించడం ముఖ్యమని నరేంద్ర మోదీ ప్రభుత్వం గుర్తించింది. వికసిత్ భారత్‌లో నైపుణ్య సమృద్ధ యువత కీలకమని గత ఐదేళ్లుగా చెబుతున్నది. అయితే అందుకు తగినట్లుగా కార్యాచరణ ఉన్నదా? లేదు. జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం (నాట్స్)ను పునర్వ్యవస్థీకరించి ఇంజనీరింగ్, డిప్లోమా హోల్డర్లకు మెరుగైన నైపుణ్యతను సంతరింపచేసేందుకు పెద్దపీట వేస్తున్నామని చెప్పి, నైపుణ్యాభివృద్ధిలో పైలట్ ప్రాజెక్టు క్రింద యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన నౌకాశ్రయాల దిగ్గజ సంస్థ దుబాయి పోర్ట్ వరల్డ్ భాగస్వామ్యంతో వారణాసిలో నౌకాయాన, సరుకు రవాణాకు సంబంధించిన శిక్షణా సంస్థను ఏర్పాటు చేసింది. సముద్ర తీరంలోని విశాఖ, కాకినాడ, చెన్నై, కొచ్చిన్‌లలో కాకుండా పూర్తిగా భూపరివేష్టిత వారణాసిలో అటువంటి సంస్థను ఏర్పాటు చేయడంలో ఔచిత్యమున్నదా? తెలుగు రాష్ట్రాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భాగస్వామ్యంతో పురోగమించడానికి ప్రయత్నించాలి.

ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా స్కిల్స్ యూనివర్సిటీ కొరకు ఏకంగా ఒక నగరాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించడం ఎంతో ఆనందం కలిగించింది. అదే సమయంలో అయోమయానికీ గురి చేసింది. యువత దశ, దిశ మార్చే ఈ బృహత్తర కార్యక్రమం స్వాగతించదగ్గదే కానీ దాని కొరకు సరైన అధ్యయనం జరిగిందా అనేది ఇప్పుడు మనముందున్న అసలు ప్రశ్న.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పదునెక్కుతున్న మోదీ వ్యూహప్రతివ్యూహాలు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కంసుడిని కృష్ణుడు హతమార్చకపోతే కృష్ణుడిని హతమార్చేందుకు కంసుడు తన ప్రయత్నాలను మానుకునేవాడు కాదని భాగవతంలో దశమస్కంధం చదివిన వారికి అర్థమవుతుంది. రాజకీయాలు కూడా అదే విధంగా ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలియనిది కాదు. లోక్‌సభలో బీజేపీ మెజారిటీ 240 సీట్లకు తగ్గిపోయినప్పటి నుంచీ కొంచెం వెనక్కు తగ్గినట్లు కనపడిన మోదీ స్వాతంత్ర్య పర్వదినం నుంచే తన ఆయుధాలు సంధించడం ప్రారంభించారు. దీనిని బట్టి ఆయన తన సహజ లక్షణాలు కోల్పోలేదన్న విషయం అర్థమవుతోంది.

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుసటి రోజు నుంచీ ఇండియా కూటమి తగ్గేదే లేదన్నట్లుగా కొదమసింహంలా దూకుడు ప్రదర్శిస్తూ మోదీ సేనను ఆత్మరక్షణలో పడేసేందుకు ప్రయత్నించడం ప్రారంభించింది. ఇటీవల ముగిసిన 18వ లోక్‌సభ తొలి సమావేశాల్లో రాహుల్ నేతృత్వంలో ఇండియా కూటమి అవకాశం దొరికినప్పుడల్లా ప్రభుత్వంపై దాడిని తీవ్రతరం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగానికి అడుగడుగునా అడ్డుతగిలేందుకు రాహుల్ గాంధీ స్వయంగా సారథ్యం వహించారు. ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాల వ్యవహార శైలితో అనేక సందర్భాల్లో సభాపతులు నిరాశా నిస్పృహలకు గురికాగా, అధికారపక్ష పెద్దలు చేష్టలుడిగి పోయారు. చివరకు శక్తి కూడదీసుకుని అనురాగ్ ఠాకూర్, నిర్మలా సీతారామన్‌తో పాటు ఒకరిద్దరు బీజేపీ నేతలు ప్రతిపక్షంపై విరుచుకుపడకపోతే, తొలి సమావేశాల్లో ప్రతిపక్షాలకు తిరుగులేకుండా పోయేది. నీట్ ప్రశ్నపత్రాల లీక్, కుల గణన, కనీస మద్దతు ధర, మణిపూర్‌తో పాటు అనేక అంశాలు ప్రతిపక్షాలకు ఆయుధాలయ్యాయి. వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వమే సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించేందుకు ముందుకు రావడం మారిన పరిస్థితులకు నిదర్శనం.

పార్లమెంట్ సమావేశాలు ముగిశాయో లేదో, ఆగస్టు 10న అదానీ స్టాక్ మార్కెట్ వ్యవహారంలో హిండెన్ బర్గ్ నివేదిక వెల్లడించిన తాజా అంశాలతో ప్రతిపక్షాలు మరింత రెచ్చిపోయాయి. అదానీ గ్రూప్ సంస్థలు తమ షేర్లను కృత్రిమంగా పెంచేందుకు ఉపయోగించిన విదేశీ నిధుల్లో సెబి చైర్మన్, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని వచ్చిన ఆరోపణల ఆధారంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ ఆరోపణలపై జేపీసీ ఏర్పాటుకు డిమాండ్ చేసింది. అదే సమయంలో కులజనగణన, రిజర్వేషన్లపై కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. మరో మూడు నెలల్లో జరగనున్న హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు కమలనాథులను చీకాకు పెట్టేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోకూడదని నిర్ణయించాయి.

కాని మోదీని కూడా తక్కువ అంచనా వేయలేం. ఆగస్టు 15న ఎర్రకోట ప్రసంగంతో ఎదురుదాడి చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ప్రసంగంలో ఆయన రెండు కీలకాంశాలను ప్రకటించారు. అవినీతిపై తాను ప్రకటించిన యుద్ధాన్ని తీవ్రతరం చేస్తానని మోదీ చేసిన వ్యాఖ్యలు గత అయిదేళ్లుగా అనేకమంది ప్రతిపక్ష నేతలపై జరుగుతున్న ఏజెన్సీల చర్యలు ఆగిపోవన్న విషయం ధ్రువీకరిస్తున్నాయి. ఇక ఇంతకాలం కొనసాగిన మతతత్వ పౌర స్మృతి బదులు లౌకిక పౌర స్మృతి దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉన్నదని మోదీ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ప్రతిపక్షాల కులజనగణన డిమాండ్‌ను అడ్డుకునేందుకు మోదీ ఈ ఆయుధాన్ని బయటకు తీసినట్లు కనబడుతోంది.

అవినీతిని ఎంత మాత్రమూ సహించేది లేదని మోదీ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన మరునాడే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై మైసూరు భూమి కుంభకోణానికి సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ అవినీతి నిరోధక చట్టంలో బహుళ ప్రాచుర్యం పొందిన సెక్షన్ 17ఏ కింద అనుమతిని మంజూరు చేశారు. మైసూరులో సిద్ధరామయ్య సతీమణి పార్వతి ఆమె పేరున లేని భూమిని ప్రభుత్వానికి ఇచ్చినందుకు బదులుగా 14 స్థలాలు అక్రమంగా పొందారని ఆరోపణలు రాగా, ఈ నిర్ణయం తనది కాదని, బీజేపీ హయాంలోనే ఈ స్థలాలను కేటాయించారని సిద్ధరామయ్య వాదిస్తున్నారు. సిద్ధరామయ్య నిర్ణయం తీసుకోనప్పుడు ఆయనపై 17ఏ క్రింద ఎలా చర్య తీసుకుంటారన్న చర్చ జరుగుతున్నప్పటికీ కర్ణాటక గవర్నర్ నిర్ణయం దేశ వ్యాప్తంగా బీజేపీయేతర ముఖ్యమంత్రులను ఉలిక్కిపడేలా చేసిందనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు అప్రమత్తంగా ఉండేలా మోదీ చేయగలిగారనడంలో సందేహం లేదు. ఇప్పటికే జార్ఖండ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు గవర్నర్లు ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంఘర్షణాయుత వైఖరిని అవలంబిస్తున్నారు. మోదీ ఎక్కడి నుంచైనా ఎదురు దాడి చేయగలరని సిద్ధరామయ్య వ్యవహారంతో ప్రతిపక్షాలకు అర్థమైంది. ఇదే సమయంలో కోల్‌కతాలో హత్యాచారానికి బలైన ఒక యువ డాక్టర్ విషాద ఉదంతాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ సహజంగానే విస్తృత యత్నాలు చేస్తోంది.

రాజకీయాల్లో అదును చూసుకుని ఎదురు దాడులు చేయడం మాత్రమే కాదు, అవసరమైనప్పుడు వెనక్కు తగ్గడం కూడా అవసరం. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో మధ్య స్థాయి పోస్టుల్లో సివిల్ సర్వీసు అధికారులను కాకుండా బయటి నుంచి వ్యక్తులను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన విడుదల చేసిన మూడు రోజుల్లోనే మోదీ సర్కార్ తన నిర్ణయాన్ని మార్చుకుంది. దాదాపు 45 జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లను నియమించేందుకు యుపిఎస్‌సి ప్రకటన చేసిన వెంటనే కాంగ్రెస్‌తో పాటు బీజేపీ మిత్రపక్షాలు కూడా విరుచుకుపడడం ఇందుకు కారణం. ఈ నిర్ణయం రాజ్యాంగం కల్పించిన దళితులు, ఓబీసీలు, ఆదివాసీల రిజర్వేషన్లకు వ్యతిరేకమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. బయటి వ్యక్తులను నియమించడం యుపిఎస్‌సి పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువకుల హక్కులను దోపిడీ చేయడమేనని, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం లభించకుండా చేసేందుకే ఈ నియామకాలు చేస్తున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. ఎన్డీఏ మిత్రపక్షాలు జనతాదళ్ (యు), లోక్ జనశక్తి (రాంవిలాస్) కూడా ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొమ్మని కోరాయి. దీనితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయానికి అనుగుణంగా నియామకాలు జరగాలని అభిలషిస్తున్నందువల్ల బయటినుంచి వ్యక్తుల నియామకానికి సంబంధించి ప్రకటన వెనక్కు తీసుకోవాలని కేంద్రమంత్రి జితేందర్ సింగ్ యుపిఎస్‌సి చైర్మన్‌కు లేఖ రాశారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ బిల్లు, సాగు చట్టాలు, డేటా సంరక్షణ బిల్లు, బ్రాడ్ కాస్ట్ బిల్లుతో పాటు పలు నిర్ణయాలను వెనక్కు తీసుకోవల్సి వచ్చింది. బయటి వ్యక్తులను నియమించాలన్న విషయాన్ని కాంగ్రెస్ హయాంలో కూడా పరిశీలించారని, మోదీ ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని బీజేపీ ఐటీ సెల్ కన్వీనర్ అమిత్ మాలవీయ రాహుల్‌ను విమర్శించిన రెండు రోజులకే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవడం గమనార్హం. త్వరలో ఎన్నికలు జరుగనున్న హర్యానాలో తమ విజయానికి ఓబీసీలు, దళితులపై పూర్తిగా ఆధారపడుతున్న బీజేపీ రాహుల్ విమర్శతో వెంటనే వెనక్కు తగ్గాల్సి వచ్చిందనడంలో సందేహం లేదు.

దేశంలో మాత్రమే కాదు, మోదీ ప్రభుత్వం అంతర్జాతీయంగా సవాళ్లు ఎదుర్కోవల్సి వస్తున్నది. బంగ్లాదేశ్‌లో తిరుగుబాటు తర్వాత ఆ దేశ ప్రధానమంత్రి హసీనాకు ఆశ్రయం కల్పించడం భారత్‌కు సమస్యాత్మకంగా పరిణమించింది. ఆమెను ఏ దేశానికి పంపించాలో తెలియక మనం సతమతమవుతుండగా యుద్ధ నేరాల క్రింద ఆమెను విచారించేందుకు బంగ్లా తిరిగి పంపాలని ఆ దేశం నుంచి డిమాండ్ వస్తోంది. ఇక అమెరికాలో అత్యంత కీలకమైన నాటో శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న సమయంలోనే మోదీ రష్యాలో రెండు రోజులు పర్యటించి పుతిన్‌ను కౌగలించుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రధానాంశంగా నాటో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో మోదీ తన రష్యా పర్యటనను వాయిదా వేసుకోవాలని అమెరికా కోరినప్పటికీ ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. యుద్ధ సమయంలో వ్యూహాత్మక స్వతంత్రత అన్న మాటకు అర్థం లేదని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ స్పష్టంగా ప్రకటించారు. భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రతను తాము గౌరవిస్తామని, కాని సంక్షోభ సమయాల్లో భారత అమెరికాలు కలిసికట్టుగా, విశ్వాసపాత్రమైన స్నేహితులుగా వ్యవహరించాలని తెలుసుకోవాలని ఆయన ఒక రక్షణ సదస్సులో చెప్పారు. తమతో సంబంధ బాంధవ్యాలను అలుసుగా తీసుకోవద్దని ఆయన హెచ్చరించారు. రష్యా చైనాకు జూనియర్ భాగస్వామిగా మారుతోందని, ఆ దేశాన్ని విశ్వసనీయ భాగస్వామిగా తీసుకోవడం మంచిది కాదని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సల్లివాన్ కూడా స్పష్టం చేశారు. మోదీ పుతిన్‌ను గాఢంగా కౌగలించుకున్న దృశ్యాలు విడుదలైన తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటన శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలిగించిందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే మోదీ తప్పనిసరై ఉక్రెయిన్‌తో పాటు రష్యాను బద్ధశత్రువుగా భావిస్తున్న పోలండ్‌కు కూడా వెళ్లి నాటో దేశాలను శాంతింపచేసే ప్రయత్నం చేశారు. "మీరెవరో, మీ శత్రువెవరో తెలిస్తే వంద యుద్ధాలు జరిగినా భయపడనక్కర్లేదు. మీ గురించి మాత్రమే తెలిసి మీ శత్రువు గురించి తెలియకపోతే, గెలుపుతో పాటు ఓటమికి కూడా సిద్ధంగా ఉండాలి. మీ గురించి కానీ, మీ శత్రువు గురించి కానీ ఏమీ తెలియకపోతే ప్రతి యుద్ధంలోనూ ఓడిపోవాల్సిందే" అని చైనా సైనిక వ్యూహకర్త సున్ సు 'ద ఆర్ట్ ఆఫ్ వార్'లో రాశారు. 13 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా, 10 సంవత్సరాలకు పైగా ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్రమోదీకి ఈ విషయం బాగా తెలిసే ఉండవచ్చు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



ఆగస్టు 15న ఎర్రకోట నుంచి వెలువరించిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంతో ప్రతిపక్షాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎదురుదాడి ప్రారంభించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ఇండియా కూటమి దూకుడుకు వివిధ అంశాలపై వెనక్కి తగ్గినా అవినీతిపై యుద్ధాన్ని తీవ్రతరం చేస్తానని ప్రకటించడం ద్వారా బీజేపీయేతర ముఖ్యమంత్రులు ఉలిక్కిపడేలా చేశారు. విపక్షాల కులగణన డిమాండ్‌ను అడ్డుకునేందుకు లౌకిక పౌరస్మృతి అనే ఆయుధాన్ని మోదీ ప్రయోగించారు.

ఆఖరి మనిషి ఆవేదనే వర్గీకరణకు పునాది కావాలి!

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై చివరికి ఏడుగురి న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్ట్ ధర్మాసనం ఆగష్టు 1, 2024న తీర్పును వెలువరిస్తూ, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల నిర్వహణను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వవచ్చని అభిప్రాయపడింది. ఎంఆర్‌పీఎస్ నాయకుడైన కృష్ణ మాదిగ నూతన కోర్టు తీర్పుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్ల అమలులో గతంలోని ఏబీసీడీల వర్గీకరణ పద్ధతిలోనే విధివిధానాలను రూపొందించాలని కోరుతున్నారు. అంతేకాకుండా మళ్ళీ కొత్తగా ఎస్సీల జనాభా లెక్కలు చేపట్టవలసిన అవసరం లేదంటున్నారు. వారికి అందుబాటులోవున్న ఆధారాలు ఏమిటోగాని మాదిగలకు తెలంగాణాలో 11శాతం, ఆంధ్రాలో 7శాతం రిజర్వేషన్ల అవకాశాలు వస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలో సూత్రబద్ధంగా వర్గీకరణను స్వాగతించే మాలల నుంచి కొన్ని వాదనలు ఇలా ఉన్నాయి.

1) మాదిగల నాయకత్వ ఫిర్యాదు ప్రకారం గడిచిన కాలంలో మాలలే ఎస్సీ రిజర్వేషన్లను అనుభవించడంలో మొదటి స్థానంలో ఉన్నప్పుడు గత వర్గీకరణ నమూనా ప్రకారం వారు ఏబీసీడీ గ్రూప్‌లో చివరి స్థానంలో ఉండాలి. అలాకాకుండా వారిని 'సీ' గ్రూపుగా ఎందుకు చేర్చారు? 2) రెండు తెలుగు రాష్ట్రాలలో మొత్తంగా 59 ఎస్సీ కులాలు సమాన నిష్పత్తిలో లేనప్పుడు ఏబీసీడీల విభజన శాస్త్రీయమైనదేనా? 3) ఎస్సీ రిజర్వేషన్ల సమస్య కేవలం రెండు తెలుగు రాష్ట్రాలకో లేదా దక్షిణ భారతదేశానికో పరిమితమైనది కాదు. మొత్తం దేశంలోని దళితులకు సంబంధించిన అంశం. కాబట్టి దేశంలోని అన్ని ఎస్సీ కులాలను సంతృప్తి పరిచే హేతుబద్ధతతో కూడిన న్యాయమైన విభజన మార్గాలను మేధావులు, ప్రభుత్వాలు అన్వేషించాలి. 4) మొత్తంగా రాష్ట్ర విభజన దృష్ట్యా ఎస్సీలలోని వివిధ కులాల వాస్తవ జనాభా శాతం ఎంతో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు శాస్త్రీయంగా తేల్చాలి. అలా చేయకుండా ప్రాథమిక అంచనాలతో తాత్కాలిక నిర్ణయాలు చేయరాదు. 5) ప్రత్యేకించి రాష్ట్ర విభజన అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కల్పించిన విద్య ఉద్యోగ అవకాశాలలో, సంక్షేమ పథకాల లబ్ధిదారులలో ఏ కులంవారు ఎంత ప్రయోజనం పొందారో లెక్కలు తేల్చి విభజన చేయాలనీ కోరుతున్నారు.

మాల మాదిగలకు అనుబంధంగా చూపబడుతున్న దళిత కులాలు ఎంఆర్‌పీఎస్ ప్రతిపాదిస్తున్న ఏబీసీడీల గ్రూపులవారీ వర్గీకరణకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. దానికి బదులుగా అల్పసంఖ్యాక దళిత కులాలను మాల, మాదిగేతర ప్రత్యేక గ్రూపులుగా జనాభా లెక్కల ఆధారంగా గుర్తించి, రిజర్వేషన్లను పంపిణీ చేయాలని ప్రతిపాదిస్తున్నారు. అప్పుడు మాత్రమే తమకు తాము ఆశిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ లబ్ధి చేకూరుతుందని బలంగా నమ్ముతున్నారు.



అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణాలో ఎస్సీలు 52,17,684గా వున్నారు. అందులో రెల్లి గ్రూప్ కేవలం 13,452 (0.25శాతం), మాదిగ గ్రూప్ 34,06,708 (65.29 శాతం)గా ఉన్నారు. మాల గ్రూప్ 17,90,553 (34.31 శాతం)గా ఉన్నారు. ఆదిఆంధ్ర గ్రూప్ 6,716 (0.12శాతం)గా ఉన్నారు. నేటి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తంగా ఎస్సీ జనాభా 82,82,243 ఉండగా, రెల్లి గ్రూప్ 1,90,749 (2.30 శాతం) ఉండగా, మాదిగ గ్రూప్ 35,20,165 (42.50శాతం)గా ఉన్నారు. మాల గ్రూప్ 43,64,277 (52.69శాతం)గా ఉండగా, ఆదిఆంధ్ర గ్రూప్ 2,05,394 (2.47శాతం)గా ఉన్నారు. అంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న 15శాతం ఎస్సీ రిజర్వేషన్లను తెలంగాణాలో రెల్లి సమూహానికి 0.03, మాదిగలకు 9.79, మాలలకు 5.14, ఆది ఆంధ్రులకు 0.12 శాతాలుగా పంపిణీ చేయవచ్చు. అదే ఆంధ్రప్రదేశ్‌లోనైతే రెల్లి సమూహానికి 0.34, మాదిగలకు 6.37, మాలలకు 7.90, ఆదిఆంధ్రులకు 0.37 శాతంగా అవకాశాలు కల్పించవచ్చు. లెక్కలు ఇలా ఉంటే మాదిగ నాయకత్వం మాత్రం దానికి భిన్నంగా మాట్లాడుతున్నది.

ఈ వాదనలు ఇలా ఉంటే మాల, మాదిగ అనుబంధ కులాలుగా పిలువబడుతున్న (న్యాయంగానైతే ప్రతి కులం దానికి అదే ఆత్మగౌర అస్తిత్వసమూహమే) హోలియ దాసరి, నేతకాని మాల, మాల పంబాల, మాల జంగం, మహర్లు, గుర్రం మాల, మాల బేకరీ, మాల మస్టీలు, బైండ్ల, బేడబుడగ జంగం, దక్కలి, మోచి, చిందు వారు ఎస్సీల అభివృద్ధి, వర్గీకరణ విషయాలపై మరింత సూక్ష్మమైన సామాజిక న్యాయ సూత్రీకరణలు వినిపిస్తున్నారు.

స్వతంత్ర భారతంలో ఇప్పటికీ చాలా అనుబంధ కులాలలో ఒక్క ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారిగా ఎదిగిన దాఖలాలు లేవు. కేవలం ప్రభుత్వ యంత్రాంగంలో కింది స్థాయి సహాయకులుగా ఎదిగారు. తమ కుల ధ్రువీకరణ పత్రాలు పొందటానికి యువత ఆర్డీఓల ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వాలు వారికి కుల ధ్రువీకరణ పత్రాలను స్థానిక ఎమ్మార్వోల ద్వారానే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దక్కలి, చిందు, బుడగజంగాలు, గుర్రం మాల, మాల మస్టీలలో ఇప్పటికీ అక్షర జ్ఞానమే అతికష్టమైన ప్రక్రియ అయినప్పుడు ప్రభుత్వం ఉద్యోగాల్లో వారి వాటాల గురించి ఆలోచించడంలో అర్థమే లేదంటున్నారు. కొన్ని తరాలుగా వారు చేసిన వెట్టి చాకిరికి ప్రతిఫలంగా పొందిన చిన్నపాటి కుల మాన్యపు భూములను సైతం ప్రభుత్వాలే ఆక్రమిస్తున్నాయని వాపోతున్నారు. నిజానికి వర్గీకరణకు ముందు, ఆ తరువాత కూడా కొద్దిపాటి తేడాలతో మాల, మాదిగలే ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను పొందుతూ సమాజంలో ప్రభావ శక్తులుగా పని చేస్తున్నారు. అంతేకానీ అంతర్గతంగా దళిత సమూహాలలో ఉన్న కుల హెచ్చుతగ్గులను నిర్మూలించే ప్రజాస్వామిక సంస్కృతిని ఏర్పాటు చేయలేకపోయారు.


సామ్రాజ్యవాద, అగ్రకుల ఆర్థికదృక్కోణాల వలన దళిత అనుబంధ కులాల జీవనాధార వృత్తులు పూర్తిగా ధ్వంసం చేయబడ్డాయి. ఫలితంగా వారు అసంఘటిత కార్మికులుగా, వలసజీవులుగా మారుతున్న తరుణంలో కూడా మాల, మాదిగలు వారిని పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. వర్గీకరణ వాదం కన్నా ముందు ఏర్పడిన ఉమ్మడి దళితవాదం, వర్గీకరణ భావనానంతరం ఏర్పడిన మాల, మాదిగ అస్తిత్వ వాదాల సర్వజనీయత (Universality) సమూహాల ప్రాధాన్యతలు క్రమంగా క్షీణిస్తూ, చైతన్యం పొందుతున్న ప్రతి దళిత జాతి విడిగా తన అస్తిత్వాన్ని (Particularity) నిర్మించే పనిలో ఉండాలని భావిస్తున్నాయి. కొంత కటువుగా ఉన్నప్పటికీ మాల మాదిగలకు అనుబంధంగా చూపబడుతున్న దళిత కులాలు ఎంఆర్‌పీఎస్ ప్రతిపాదిస్తున్న ఏబీసీడీల గ్రూపులవారీ వర్గీకరణకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. దానికి బదులుగా అల్పసంఖ్యాక దళిత కులాలను మాల, మాదిగేతర ప్రత్యేక గ్రూపులుగా జనాభా లెక్కల ఆధారంగా గుర్తించి, రిజర్వేషన్లను పంపిణీ చేయాలని ప్రతిపాదిస్తున్నారు. అప్పుడు మాత్రమే తమకు తాము ఆశిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ లబ్ధి చేకూరుతుందని బలంగా నమ్ముతున్నారు.

దళిత అనుబంధ కులాల ప్రతిపాదనలు 21వ శతాబ్ద కాలంలో ప్రపంచవ్యాప్తంగా ముందుకొస్తున్న బహుళ సంస్కృతుల వాదానికి, మరీ ముఖ్యంగా అల్ప సంఖ్యాక ప్రజారాశుల హక్కుల సిద్ధాంతకర్త అయిన విల్ కిమ్లికా ఆలోచనలకు దగ్గరగా ఉన్నాయని చెప్పవచ్చు. కిమ్లికా కెనడా దేశ తత్వవేత్త. ఈయన తన రచనల్లో మైనార్టీ సమూహాలు, మెజార్టీ సమూహాలతో హక్కుల కోసం తలబడుతున్నప్పుడు రాజ్యం వారికి ఎక్స్‌టర్నల్ ప్రొటెక్షన్ రైట్స్‌ను అనగా బాహ్య రక్షణ హక్కులను కల్పించాలన్నారు. అలాగే మైనార్టీ వర్గంలో సైతం చారిత్రకంగా నిక్షిప్తమైన అన్ని రకాల అంతర్గత వివక్షతలను నిర్మూలించడం కోసం ఇంటర్నల్ రిస్ట్రిక్షన్ రైట్స్ అనగా అంతర్గత పరిమిత హక్కుల భావనను అనుసరించాలని విశదీకరించాడు. అంటే ప్రతి బాధిత సమూహంలో అత్యంత వెనుకబడిన జాతికి సాధించిన అవకాశాల్లో మొదటగా స్థానం కల్పించాలని దానర్థం. అలాకాకుండా ఒక నిర్దిష్ట సమూహంలో అర్హులు లేనప్పుడు వెంటనే ఆ సమూహం యొక్క రిజర్వేషన్ల అవకాశాన్ని ఇతర సమూహానికి బదలాయించకూడదు. తద్వారా మాత్రమే పీడిత సమూహాలలో ఒక సంపూర్ణ సామాజిక న్యాయాన్నీ నెలకొల్పవచ్చని సిద్ధాంతీకరించాడు.

అందువలన కేవలం రాజ్యాంగపరమైన సాంకేతిక సంక్లిష్టతను ఆధారం చేసుకుని అవకాశాలు అందరికి అందాలనే వర్గీకరణ సూత్రాన్ని మొండిగా వ్యతిరేకించే మాల కుల సంఘాలు ఇప్పటికైనా మరింత ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆలోచించాలి. సూత్రబద్ధంగానైనా దళిత రిజర్వేషన్ల ప్రజాస్వామ్యబద్ధ పంపిణీనీ అంగీకరించాలి. అందుకు మాల బుద్ధిజీవులు, రాజకీయవేత్తలు నిజాయితీగా కృషి చేయాలి. అలాగే మాదిగ బుద్ధిజీవులు, రాజకీయ నాయకులు కూడా దళితుల్లోని అణగారిన కులాలు ప్రతిపాదిస్తున్న మరింత మెరుగైన రిజర్వేషన్ల వర్గీకరణ నమూనాలను సమధర్మ బుద్ధితో పరిగణలోకి తీసుకోవాలి. అంతేకానీ ఏబీసీడీల వాదాన్ని మరింతగా సంస్కరిస్తే గత మూడు దశాబ్దాలుగా నిర్మించిన మాదిగ దండోర ఉద్యమానికే పెను ప్రమాదమని భావించవలసిన అవసరం లేదు. అప్పుడే తిరిగి ఉమ్మడి సమస్యలైన దళితులకు ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు, భూ పంపిణీలో సమన్యాయ వాటా, సంపూర్ణ సామాజిక స్వేచ్ఛ, రాజ్యాధికారంలో నిజమైన భాగస్వామ్యం కోసం ఐక్య పోరాటాలు నిర్మించగలుగుతారు. లేదంటే ఎల్లకాలం పాలక వర్గాల రాజకీయ కుట్రల్లో విభజించబడి పాలించబడతారు.

● **డా. నాగం కుమారస్వామి**
పాలమూరు విశ్వవిద్యాలయం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



చేనేత.. అందాల కలబోత..



జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మారిస్ స్టెల్లా కాలేజీలోని చేనేత వస్త్ర ప్రదర్శనలో మంగళవారం విద్యార్థులు చేసిన ర్యాంప్‌వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముగింపు వేడుకల సందర్భంగా అందమైన చేనేత వస్త్రాలు ధరించి విద్యార్థులు హొయలొలికించారు. పొందూరు, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, చీరాల తదితర చేనేత వస్త్రాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా మంత్రి సవిత విచ్చేసి ప్రసంగించారు.

6లో..

అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్ని రకాలుగా సంపాదించవచ్చో అనడానికి నిలువెత్తు నిదర్శనం వైసీపీ నాయకుడు, మాజీమంత్రి జోగి రమేశ్. ఇప్పటికే సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అడ్డంగా దొరికిపోయిన జోగి కుటుంబం.. తాజాగా పెడన మండలంలో వందలాది మంది చిన్న రైతుల పొట్టకొట్టి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. అధికారం దూరం కావడంతో అక్రమార్జనే ధ్యేయంగా ఆయన చేసిన అవినీతి బాగోతాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తామే అధికారంలోకి వస్తామన్న ధీమాతో లెక్కకుమించిన తప్పులు చేసుకుంటూ పోయిన జోగి కుటుంబం ఇప్పుడు ఊచలు లెక్కపెట్టే పరిస్థితికి చేరింది.



గరికపూడి, నిడమర్రు గ్రామాల వద్ద జోగి రమేశ్ సబ్‌లీజుకు ఇచ్చిన చెరువులు ఇవే..

గలీజు జోగి

వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ మరో కుంభకోణం

- కృత్తివెన్ను మండలంలో ఆయన మార్కు దోపిడీ
- దాదాపు 300 ఎకరాల చెరువుల్లో అడ్డగోలు అవినీతి
- చిన్న రైతుల చెరువులు తక్కువకు లీజుకు తీసుకుని..
- బడాబాబులకు ఎక్కువకు సబ్‌లీజుకు ఇచ్చి..
- ఏటా రూ.2 కోట్ల పైచిలుకు ఆదాయం హాంఫట్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/కృత్తివెన్ను) : అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి జోగి రమేశ్ పెడన నియోజకవర్గంలో తన అనుచరుల ద్వారా చేసిన అవినీతి పనులన్నీ బయటకు వస్తున్నాయి. చేపల చెరువుల తవ్వకాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, పాస్ పుస్తకాల పంపిణీ.. ఇలా అన్నింటిలోనూ తన అనుచరుల ద్వారా వసూళ్ల దందా సాగించిన జోగి సొంత పార్టీ నేతలనూ వదల్లేదన్న విమర్శలున్నాయి. కానీ, తాజాగా వెలుగులోకి వచ్చిన ఉదంతం మాత్రం వసూళ్ల దందాలో జోగిలోని కొత్తకోణాన్ని తెలియజేస్తుంది. కేవలం మాట అడ్డంపెట్టి చిన్న, సన్నకారు రైతులకు దక్కాల్సిన కోట్లాది రూపాయలు జేబులో వేసుకున్న తీరును చూసి 'అమ్మ జోగి' అంటూ సొంత పార్టీ నేతలే ముక్కున వేలేసుకుంటున్నారు.

చిన్న చెరువులపై పెద్ద కన్ను

కృత్తివెన్ను మండలం గరిశపూడి, నిడమర్రు రెవెన్యూ గ్రామాల పరిధిలో తణేలు వంతెన సమీపంలోని ఆర్ఎస్ నెంబరు 66, 75, 76, 77లో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో చిన్నచిన్న చెరువులు ఉన్నాయి. వీటిలో అత్యధికం ప్రభుత్వ భూములు కాగా, అవి స్థానికుల ఆక్రమణలో ఉండేవి. కొంతమేర పట్టా భూములు కూడా ఉన్నాయి. ఈ భూములన్నింటినీ స్థానికులు వాటాలుగా పంచుకుని పీతలు, రొయ్యల చెరువులుగా సాగు చేసుకుంటున్నారు. ఈ విధానం కొన్నేళ్లుగా అమల్లో ఉంది. పెదలంక డ్రెయిన్‌ను ఆనుకుని ఉండటంతో ఆటుపోట్లకు ముంపునకు గురయ్యే ఈ భూముల నుంచి అంతంతమాత్రంగానే ఆదాయం ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెడన ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత జోగి రమేశ్ కన్ను ఈ భూములపై పడింది. మంత్రి అయ్యే వరకు ఓపిక పట్టిన ఆయన ఆ తర్వాత వాటిని చెరబట్టాడు. ఆదాయం రాని ఆ భూములను తనకు ఏడేళ్ల పాటు అగ్రిమెంటు రాసి, లీజుకు ఇవ్వాలని రైతులను జోగి రమేశ్ కోరారు. లీజు పూర్తయ్యేలోపు భూములకు పట్టాలు ఇప్పిస్తానని ఆశ చూపారు. దీంతో చిన్న సన్నకారు రైతులంతా పట్టాల కోసం ఆశపడి, తమ భూములను సంవత్సరానికి ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు లీజుకు ఇచ్చారు. ఇవ్వని వారిని భయపెట్టి, బెదిరించి మరీ భూములను లీజుకు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. లీజుకు తీసుకున్న భూముల్లో కొంతభాగం తక్షణమే గోదావరి జిల్లాకు చెందిన బడా రైతులకు సబ్ లీజుకు ఇచ్చేశారు. రైతుల నుంచి లీజుకు తీసుకున్న మొత్తానికి పది రెట్లు బడా రైతులకు సబ్‌లీజుకు ఇవ్వడం గమనార్హం. ఎకరా రూ.50 వేల

లీజు పేరిట రెట్టింపు దోపిడీ

నుంచి రూ.60 వేల వరకు లీజుకు ఇచ్చేశారు. అంటే మధ్యవర్తిగా మాట అడ్డంపెట్టి ఏడాదికి ఎకరం చెరువు ద్వారా రూ.50 వేల వరకు లబ్ధి పొందారన్న మాట. పైగా వాటిని పెద్దపెద్ద చెరువులుగా తవ్వేందుకు సదరు బడా రైతు నుంచే ఎకరాకు రూ.5 వేల చొప్పున ఖర్చుల నిమిత్తం పిండేయడం గమనార్హం. ఈ చెరువుల ద్వారా ఏటా మాజీమంత్రికి లీజు రూపంలో రూ.కోటిన్నర వరకు ఆదాయం వస్తుండటం గమనార్హం. పడతడిక, నిడమర్రు గ్రామాల పరిధిలో పోడు రోడ్డు నుంచి లక్ష్మీపురం సబ్ చానల్ వరకు మధ్యలో సుమారు 120 ఎకరాలను కూడా ఈ మాదిరిగానే రైతుల నుంచి తక్కువకు లీజుకు తీసుకుని, సబ్ లీజుకు ఇచ్చి ఏటా రూ.60 లక్షల వరకు జేబులో వేసుకుంటున్నారు.

ఆ వీఆర్వోలు సెపరేటు..!



ఖరీదైన ఖద్దరు దుస్తులు వేసుకుంటారు కానీ, పేరొందిన రాజకీయ నాయకులు కాదు. జిగేలుమనే బంగారు ఆభరణాలతో మెరిసిపోతారు కానీ, బడా వ్యాపారవేత్తలు కాదు. అంతకుమించిన ఐ ఫోన్లు.. స్పోర్ట్స్ బైకులు ఉపయోగిస్తారు కానీ, సినిమా హీరోలు కూడా కాదు. విలాసవంతమైన భవనాలు.. ఆధునిక అపార్టుమెంట్లలో రాచభోగాలు అనుభవిస్తారు కానీ మాఫియా డాన్లు కూడా కాదు. వినడానికి విడ్డూరంగా ఉన్నా.. నమ్మడానికి కాస్త కష్టమైనా.. వీరంతా సాధారణ ప్రభుత్వ ఉద్యోగులైన వీఆర్వోలు. వీరి వేతనం నెలకు రూ.50 వేలే. వీరిని చూస్తే మాత్రం అస్సలు అలా కనిపించరు. విజయవాడ నగరం, విజయవాడ రూరల్ మండల పరిధిలో ఏళ్ల తరబడి తిష్టవేసి రెవెన్యూలో షాడో బాసులుగా చెలామణీ అవుతున్నారు. ప్రజలను జలగల మాదిరిగా పీల్చి పిప్పి చేస్తున్నారు. తహసీల్దార్లు, డీఆర్వోలు మొదలుకుని ఆర్డీవోల వరకూ, ఆఖరుకు ఏసీబీ అధికారులను సైతం బుట్టలో వేసుకుని పనులు చక్కబెడుతున్న 'ధనా'పాటీలు వీరు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో ఇక్కడి నుంచి కదలకుండా ఉండటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

విజయవాడ, విజయవాడ రూరల్ మండలాలను ఏలుతున్న 'ధనా'పాటీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 14 లక్షల జనాభా కలిగిన విజయవాడ నగరంలో నాలుగు రెవెన్యూ మండలాలున్నాయి. నగరాన్ని ఆనుకుని శరవేగంగా విస్తరిస్తున్న మండలం విజయవాడ రూరల్. ఈ ఐదు మండలాల పరిధిలో పనిచేస్తున్న విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల (వీఆర్వో) రూటే వేరు. దాదాపు డజను మంది వీఆర్వోలు 'షాడో' బాస్ అవతారమెత్తారు. ఖద్దరు దుస్తులతో రాజకీయ నాయకులను, సెలబ్రిటీలను తలపించేలా, బంగారు ఆభరణాలు, ఐఫోన్లతో కనిపించే ఈ షాడో బాస్‌లు సొంత వృత్తి కంటే వ్యాపారాలపైనే ఎక్కువ దృష్టి పెడతారు. తమ మండలాల పరిధిలో డాక్యుమెంట్ రైటర్ల అవతారమెత్తారు. సబ్ రిజిస్ట్రార్లతో సంబంధాలను కలిగి ఉండి భారీ ఎత్తున దండుకుంటున్నారు. వీఆర్వో ఉద్యోగాల కంటే డాక్యుమెంట్ రైటర్ల ఉద్యోగాలే ఎక్కువగా వెలగబెడుతున్నారు. అంతేకాదు.. రియల్టర్ల అవతారమెత్తి త్రిపాత్రాభినయం కూడా చేస్తున్నారు. వీఆర్వోలుగా తమకున్న అధికారాలను దుర్వినియోగపరిచే స్థాయికి దిగజారుతున్నారు. రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసే స్థాయికి వెళ్తున్నారు. తప్పుడు రిపోర్టులు ఇచ్చే స్థాయికి దిగజారుతున్నారు. మాజీమంత్రి జోగి రమేశ్ అగ్రిగోల్డ్ భూముల కబ్జా వ్యవహారంలో ఒక వీఆర్వో తప్పుడు ఎండార్స్‌మెంటే కీలకపాత్ర పోషించింది. వీరిలో చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయటం కోసం విజయవాడ బైపాస్ వెంబడి ఖరీదైన భూములు కొన్నారంటే ఏ స్థాయిలో చేతులు చాస్తున్నారో అర్థమవుతుంది.

తూతూమంత్రంగానే తహసీల్దార్లు

ఈ షాడోబాస్‌లు ఉన్న మండలాల్లో తహసీల్దార్ల పాత్రేమీ ఉండదు. కొత్తగా వచ్చే తహసీల్దార్లకు స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవడంతో వీఆర్వోలపైనే ఆధారపడతారు. దీనిని ఆసరాగా చేసుకుని ఈ షాడోలు రూపాంతరం చెందుతున్నారు. తహసీల్దార్లకు తప్పుడు సమాచారాలు ఇవ్వటంతో పాటు డబ్బు ఆశచూపి వారిని లొంగదీసుకోవడం, ప్రతి పనికీ రేటు కట్టి తహసీల్దార్లకు ప్రయోజనం కల్పించడం చేస్తున్నారు. వీరిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు మాత్రం శూన్యం. రాజకీయ నేతల దృష్టికి తీసుకెళ్లినా అదే పరిస్థితి.

ఆ డజను మంది వీఆర్వోల రూటే వేరు..!

- 18 ఏళ్లుగా కదలకుండా అడ్డగోలు దోపిడీ
- రూ.కోట్లలో ఆస్తులు కూడగట్టి లగ్జరీ లైఫ్
- వీఆర్వోలుగా, డాక్యుమెంట్ రైటర్లుగా, రియల్టర్లుగా త్రిపాత్రాభినయం
- తహసీల్దార్లను డమ్మీలు చేసి చెలా'మనీ..'
- వైసీపీ ప్రభుత్వ హయాంలో పెచ్చుమీరిన అవినీతి
- కొండలు, గుట్టల్లో అడ్డగోలు తవ్వకాలకు ఊతం
- మైనింగ్ మాఫియాతో వాటాలు పంచుకుని వ్యాపారం
- జోగి రమేశ్ భూ కబ్జాల్లో కీలకంగా ఓ వీఆర్వో
- ప్రస్తుతం బదిలీల నుంచి బయటపడే యత్నాలు

వైసీపీ హయాంలో భారీ దోపిడీ

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ రూరల్ మండల పరిధిలోని ఈ షాడో వీఆర్వోలు అడ్డగోలుగా అక్రమ మైనింగ్‌కు సహకరించారు. కొండలు, గుట్టలు, గట్లు, కాలువ గట్లు, చెరువులు, తోటలు తవ్వుకోవటానికి అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు. అక్రమ మైనింగ్ వ్యాపారులను వాటాలు కూడా అడిగే రేంజ్‌కు వీరు చేరారు. మైనింగ్ మాఫియాను రక్షించేందుకు ఓ వీఆర్వో ఏకంగా వాట్సాప్ గ్రూపునే ఏర్పాటు చేశాడంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఉన్నతాధికారుల తనిఖీలు, ప్రజల ఫిర్యాదులు, ఆకస్మిక తనిఖీలు.. ఇలా సమస్త సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆ వాట్సాప్ గ్రూప్ ద్వారా చేరవేసేవాడు. దీంతో మైనింగ్ మాఫియా అప్రమత్తమయ్యేది. విజయవాడ రూరల్ మండలంలో సాగిన మైనింగ్ మాఫియాపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆగ్రహించింది. వారి ఆదేశాల మేరకు అప్పటి సబ్ కలెక్టర్ అదితిసింగ్ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఈ సమాచారాన్ని స్థానిక వీఆర్వోలు మాఫియాకు చేరవేశారు. అక్రమ మైనింగ్ తవ్వకాల వద్దకు సబ్ కలెక్టర్ చేరుకోకుండా ఉండటానికి ఏకంగా రోడ్డుకు గండి కొట్టించారు.

ధ్రువీకరణ పత్రాల్లో దండుడే..

నగర పరిధిలో ధ్రువీకరణ పత్రాల లావాదేవీలే ఎక్కువగా నడుస్తుంటాయి. ఈ పత్రాల జారీకి సంబంధించి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు (ఎఫ్ఎంసీ) సదరు వీఆర్వోలకు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ఎఫ్ఎంసీ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టడం, దరఖాస్తుదారులను తమ చుట్టూ తిరిగేలా చేయటం, ఆ తర్వాత వారితో బేరాలకు దిగటం చేస్తున్నారు. నగరంలో పనిచేసే ఓ వీఆర్వో కమ్ డాక్యుమెంట్ రైటర్‌కు కామవాంఛ ఎక్కువ. గతంలో ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, చివరికి రోడ్డున పడ్డాడు. ఈ ఉదంతం తర్వాత మళ్లీ అక్రమ సంపాదనకు తెరతీశాడు. విజయవాడ రూరల్ మండలంలో ముఖ్యమైన గ్రామంలోని ఓ వీఆర్వో ఏకంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందే డాక్యుమెంట్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. పశ్చిమ నియోజకవర్గం దాటిన తర్వాత మేజర్ గ్రామ పంచాయతీలో వీఆర్వోగా పనిచేసిన వ్యక్తి ఇక్కడి భూములు ఖరీదైనవి కావటంతో రైతుల దరఖాస్తులకు కొర్రీలు వేస్తూ భారీగా అవినీతికి పాల్పడ్డాడు. విజయవాడ నగరంలోనూ, రూరల్ ప్రాంతంలోనూ తిష్ట వేసిన ఈ వీఆర్వోలు ఇక్కడి నుంచి పక్కకు కదలడానికి అస్సలు ఇష్టపడరు. ఇటు అటు మారి సర్దుకుంటారు తప్ప ఆ ప్రాంతాన్ని మాత్రం విడిచిపెట్టరు. వైసీపీ హయాంలో విచ్చలవిడి అవినీతికి పాల్పడ్డ ఇలాంటి వారిని సాగనంపకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదముంది.



రూ.కోట్ల కోసం కాయిన్ తయారీ

- కటకటాలపాలైన ఎలక్ట్రీషియన్
- పోలీసుల అదుపులో మరో ఐదుగురు

చిట్టినగర్, ఆగస్టు 20 : అతనొక ఎలక్ట్రీషియన్. చిన్నచిన్న పనులు చేసుకుంటూ ఎంతో కొంత సంపాదించుకుంటున్నాడు. ఆ సంపాదన సంతృప్తినివ్వలేదు. జీవితంలో రూ.కోట్లు కళ్లారా చూడాలనుకున్నాడు. అలా రూ.కోట్లు కురిపించే కాయిన్ తయారు చేయడం కోసం పగలు రాత్రి కష్టపడ్డాడు. సంవత్సరం పాటు శిక్షణ తీసుకున్నాడు. చివరికి పోలీసులకు చిక్కి చిక్కుల్లో పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. జక్కంపూడి హౌసింగ్ కాలనీ 222లో ఏ.రాజా తన భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఎలక్ట్రీషియన్ అయిన రాజా కొన్నాళ్ల కిందట స్థానిక బస్‌షెల్టర్ ఎదురుగా షాపు అద్దెకు తీసుకుని ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదాయం సరిపోకపోవడంతో అధిక ఆదాయం సంపాదించేందుకు అన్వేషణ మొదలుపెట్టాడు. రూ.కోట్లు సంపాదించే రైస్ పుల్లింగ్ కాయిన్ గురించి తెలుసుకున్నాడు. తెలంగాణాలోని భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతంలో ఓ గురువు వద్ద చేరి రైస్ పుల్లింగ్ కాయిన్ ఎలా తయారు చేయాలో శిక్షణ పొందాడు. శిక్షణానంతరం రెండు నెలల క్రితం జక్కంపూడి కాలనీ చేరుకున్నాడు. రైస్ పుల్లింగ్ కాయిన్ తయారు చేసి కోట్లాది రూపాయలు సంపాదించాలని పథకం వేసుకున్నాడు. కాయిన్ తయారీకి కావాల్సిన పురాతన ఆలయాల్లో ఉండే రాగి చెంబులను ఖమ్మం, తదితర ప్రాంతాల నుంచి కొన్నాడు. ఆ తర్వాత కెమికల్స్‌ను సిద్ధం చేసుకుని పని మొదలుపెట్టాడు. తన షాపులో కాయిన్ తయారు చేయడం మొదలుపెట్టాడు. చివరికి విజయవంతంగా కాయిన్ తయారుచేసి రెండు మూడు రోజుల్లో విక్రయించాలని పథకం రచించాడు. ఇంతలో పోలీసులకు సమాచారం అందడంతో కథ బెడిసికొట్టింది. కాయిన్ తయారు చేసిన రాజాతో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారు. షాపులో పెద్ద గొయ్యి తీసి కాయిన్ ఉంచేందుకు ఏర్పాట్లు చేసుకోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాయిన్ తయారీకి వినియోగించిన సామగ్రితో పాటు కాయిన్ ఉంచిన పెద్ద బాక్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేను సైంటిస్టును..

రాజా చెప్పిన సమాధానాలకు పోలీసులు అవాక్కయ్యారు. తాను సైంటిస్టునని, తాను తయారు చేసిన కాయిన్ పవర్.. సెల్‌ఫోన్లలోని బ్యాటరీలను లాగేసుకుంటుందని ఏవేవో పొంతనలేని సమాధానాలు చెప్పాడు. తాను ఏ తప్పూ చేయలేదని, ఇతర దేశాల్లో రైస్ పుల్లింగ్ తయారీకి అనుమతులు ఉన్నాయని, తాను కాయిన్ మాత్రమే తయారు చేశానని, ఎవరినీ మోసం చేయలేదని సమర్థించుకున్నాడు.



ఆరని మంటలు

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ, నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ వాసవ్య మహిళా మండలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు.

6లో

రెవెన్యూ టూ సీఆర్‌డీఏ డిప్యుటేషన్లు

రెండు జిల్లాల్లో 8 మంది తహసీల్దార్లకు స్థానచలనం

- మరో నలుగురు డీటీలు కూడా..
- సీసీఎల్ఏ ఆదేశాలతో తహసీల్దార్లలో గందరగోళం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)లో రెవెన్యూ విభాగంలో పెద్దసంఖ్యలో డిప్యుటేషన్లకు రంగం సిద్ధమైంది. తొలిదశలో 23 మంది తహసీల్దార్లను సీఆర్‌డీఏకు డిప్యుటేషన్ పద్ధతిలో పంపించగా, తాజాగా రెండు జిల్లాల పరిధిలో 8 మంది తహసీల్దార్లు, నలుగురు డిప్యూటీ తహసీల్దార్ల (డీటీలు)ను కేటాయించింది. ఈ విషయాన్ని వ్యక్తిగతంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు తెలియపరచటంతో పాటు సీఆర్‌డీఏకు కూడా వివరించింది. తహసీల్దార్ల స్థానాల్లోకి వచ్చి రెండు వారాలు కూడా గడవక ముందే హఠాత్తుగా తమను సీఆర్‌డీఏకు పంపించడంతో తహసీల్దార్లంతా అవాక్కయ్యారు. ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించినా లాభం లేదనుకుని కలెక్టర్లపై ఆశ పెట్టుకున్నారు. ఈ ఆదేశాలను సీసీఎల్ఏ ఇంకా కలెక్టర్లకు పంపించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ల అభిప్రాయం కోసం పలువురు

- మిగతా 6లో

దానపత్ర రహస్యం

వెంచర్ కోసం సీఆర్‌డీఏ అధికారి వింత నాటకం

పంచాయతీకి దానపత్రంలో ఇచ్చిన స్థలం (సరిహద్దు రాళ్ల మధ్యలో)



- తన భూమిలో వెంచర్ వేద్దామని రోడ్డు కోసం దానపత్రం
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా అధికార దుర్వినియోగం
- సహకరించిన మైలవరం పంచాయతీ అధికారులు
- ప్రభుత్వం మారడంతో ప్లేటు ఫిరాయింపు
- పంచాయతీ అనుమతి లేకుండా దానపత్రం రద్దు
- విచారణ జరపాలని కలెక్టర్‌కు వార్డు సభ్యుల ఫిర్యాదు

ఆయన సీఆర్‌డీఏ అధికారి. వైసీపీ పాలనలో తన వ్యవసాయ భూమిలో వెంచర్ వేసి ప్లాట్లు అమ్మి సొమ్ముచేసుకుందామనుకున్నారు. అది వర్కవుట్ కాకపోవటంతో గతంలో రోడ్డు కోసం దానపత్రంగా పంచాయతీకి ఇచ్చిన స్థలాన్ని ఎలాంటి అనుమతీ లేకుండా రద్దు చేసుకున్నారు. దీనికి మైలవరం సబ్ రిజిస్ట్రార్ అధికారులు కూడా సహకరించారు. వెంచర్‌కు, దానపత్రానికి లింకేమిటనుకుంటున్నారు కదా? ఆ ట్విస్ట్ తెలియాలంటే ఈ కథనం చదవాల్సిందే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారికి మైలవరంలోని సర్వేనెంబర్ 126, 126/1లలో 3.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని వెంచర్‌గా అభివృద్ధి చేయాలని భావించి నివేశనా స్థలాలుగా మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించారు. ఆ తర్వాత వెంచర్ కోసం రోడ్డు కావాల్సి ఉండటంతో 20 అడుగుల రోడ్డును సృష్టించాలనుకున్నారు. ఈ రోడ్డు కోసం సుమారుగా 2,297.77 చదరపు గజాల తన స్థలాన్ని ప్రజోపయోగార్థం పంచాయతీకి దానపత్రంగా ఇచ్చారు. ఈ దానపత్రం మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ 2333/2023గా నమోదైంది. దానపత్రంలో గ్రామ పంచాయతీకి తన స్థలాన్ని ప్రజోపయోగార్థం అభివృద్ధి చేయడానికి సర్వాధికారాలను ఇస్తున్నట్టు దానపత్రంలో పేర్కొన్నారు. ఈ దానపత్ర వ్యవహారాన్ని మైలవరం గ్రామ పంచాయతీ అధికారులు పాలకమండలి సమావేశం దృష్టికి తీసుకురాకుండా రికార్డుల్లోకి ఎక్కించకుండా చాలా కాలంపాటు రహస్యంగా ఉంచారు.ఈ వ్యవహారానికి అప్పటి పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు అడ్డగోలుగా సహకరించారు.

పరిశీలన ఆసక్తికర అంశాలు వెలుగులోకి..

ఈ దానపత్ర వ్యవహారం పంచాయతీ పాలకవర్గ సభ్యుల దృష్టికి రావటంతో అప్పట్లో 12వ వార్డు మెంబర్ అయిన ముద్దర నాగ వెంకట చిట్టిబాబు దీనిపై లోతుగా పరిశీలించి సీఆర్‌డీఏ, ఎంఏయూడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరెవరూ ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదు. దీంతో చిట్టిబాబు రాష్ట్ర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతం తర్వాత వెంచర్ ఏర్పాటు కోసం సీఆర్‌డీఏ అధికారి దరఖాస్తు చేసుకోలేదు.

ప్రభుత్వం మారడంతో రూటు మార్చిన అధికారి

గతంలో చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుగుతోంది. ఈలోపు ఎన్నికలు రావటం కూటమి అధికారంలోకి రావటంతో తనపై సమగ్ర విచారణ జరుగుతుందని సీఆర్‌డీఏ అధికారి రూటు మార్చారు. గతంలో పంచాయతీకి సర్వాధికారాలు దఖలు పరిచిన ఈ అధికారి గ్రామ పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా దానపత్రాన్ని రద్దు చేయటానికి సిద్ధపడ్డారు. మైలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెంబర్ 7869/2024 ద్వారా దానపత్రాన్ని రద్దు చేసుకున్నారు. మైలవరం సబ్‌రిజిస్ట్రార్ అధికారులు ఇందుకు సహకరించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజనకు వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారణలో ఉన్న ఈ వ్యవహారంపై మైలవరం సబ్ రిజిస్ట్రార్ అధికారులు ఎలాంటి విచారణా జరపకుండా దానపత్రం ఎలా రద్దు చేస్తారని, తక్షణం ఈ వ్యవహారంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి నాయక్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా ఉంది. సీఆర్‌డీఏ కమిషనర్ కూడా దీనిపై దృష్టి సారించాలని వార్డు సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత

చేనేతకు స్వర్ణయుగం

- వారానికి ఒక్కరోజైనా ఈ వస్త్రాలను ధరించాలి
- రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత

కృష్ణలంక, ఆగస్టు 20 : రాష్ట్రంలో చేనేతకు స్వర్ణయుగమొచ్చిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి, చేనేత రంగ అభివృద్ధికి కృషిచేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళి సంక్షేమ శాఖా మంత్రి జె.సవిత అన్నారు. ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి చేతులమీదుగా నగరంలోని మెరిస్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ప్రారంభమైన చేనేత వస్త్ర ప్రదర్శన (గాంధీ బునకర్ మేళా) ముగింపు వేడుకలు మంగళవారం జరిగాయి. వేడుకల్లో చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, చేనేత వస్త్రాల ఫ్యాషన్ షో ఆకట్టుకొన్నాయి. పొందూరు, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, చీరాల తదితర చేనేత వస్త్రాలు వీక్షకులను అలరించాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సవిత మాట్లాడారు. చేనేత కార్మికులకు ప్రతి ఒక్కరూ అండగా వుండాల్సిన అవసరముందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శన వల్ల ప్రజల్లో చేనేతపై మంచి అవగాహన వచ్చిందని, ప్రతి ఒక్కరూ వారంలో ఒక్కసారైనా చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, కమిషనర్ జె.రేఖా రాణి, ఆప్కో ఎండీ ఆర్.పవన్‌మూర్తి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- జిల్లా గృహ నిర్మాణ సమీక్షలో మంత్రి కొలుసు పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ సృజన తదితరులు

కృష్ణలంక, ఆగస్టు 20 : 'పేదలకు ఇళ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రధానం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే' అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంత్రి పార్థసారథి నేతృత్వంలో గృహ నిర్మాణంపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏపీఎస్‌హెచ్‌సీఎల్‌ఎండీ పి.రాజాబాబు, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, మైలవరం, తిరువూరు శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హాజరయ్యారు. జిల్లాలో మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్లు తదితరాలను కలెక్టర్ సృజన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో పీఎంఏవై అర్బన్ (బీఎల్‌సీ) కింద 1,08,836 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 18,820 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. 40,536 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందన్నారు. పీఎంఏవై-గ్రామీణ్ కింద 6,567 ఇళ్లు మంజూరు కాగా 2,127 ఇళ్లు పూర్తయ్యాయని వివరించారు. నరేగా కాంపోనెంట్, మెటీరియల్ స్టాక్, లే అవుట్‌లలో మౌలిక వసతులు, ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలు, నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి తదితరాలను కలెక్టర్ వివరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలు, వాటిని చేరుకొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పార్థసారథి దిశానిర్దేశం చేశారు.

● లబ్ధిదారులను ప్రోత్సహించాలి

వివిధ లే అవుట్‌లలో విద్యుత్, నీరు, అంతర్గత రహదారులు తదితర వసతులు ఉన్నందున త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు చొరవ చూపాలని, ఇందులో భాగంగా లబ్ధిదారులను ప్రోతహించాలని సూచించారు. గృహ నిర్మాణం, డీఆర్‌డీఏ, మెప్మా, మున్సిపల్, డ్వామా, లీడ్‌బ్యాంక్, మండల, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు తదితరులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పీఎంఏవై అర్బన్ (బీఎల్‌సీ), గ్రామీణ పరిధిలో దాదాపు 9 వేల ఇళ్ల నిర్మాణాలు లింటెల్ లెవెల్, రూఫ్ లెవెల్, రూఫ్ క్యాస్ట్ లెవెల్‌లో ఉన్నాయని, 100 రోజుల ప్రణాళికలో భాగంగా వీటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తమ తమ నియోజకవర్గాలలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ జీవీ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా హౌసింగ్ పీడీ రజనీకుమారి, ఆర్‌డీఓలు బీహెచ్.భవానీశంకర్, ఎ.రవీంద్రరావు, కె.మాధవి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, మండల అధికారులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో అవకతవకలపై విచారణ

విచారణ పూర్తయ్యాక కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తా - డీఎంహెచ్‌వో గీతాబాయి



సర్వజన ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

మచిలీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కరోనా సమయంలో మచిలీపట్నంలోని సర్వజన ఆసుపత్రిలో పరికరాలు, మందులు, ఇతరత్రా సామగ్రి కొనుగోలు, తదితర అంశాలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లావైద్యశాఖ అధికారి గీతాబాయి మంగళవారం విచారణ నిర్వహించారు. సర్వజన ఆసుపత్రి కరోనా సమయంలో జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిగా కొనసాగేది. కరోనా బాధితుల కోసం దాతలు, వివిధ సంస్థలు ఇచ్చిన బెడ్‌లు, ఆక్సిజన్ సిలిండర్‌లు, ఇతరత్రా సామగ్రిని ఆసుపత్రి ద్వారా కొనుగోలు చేసినట్టు చూపి అప్పటి ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ ఉల్లి కృష్ణ పెద్దమొత్తంలో బిల్లులు చేసుకున్నట్టు కొందరు ఆసుపత్రి సిబ్బంది ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై విచారణ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయిని కలెక్టర్ బాలాజీ విచారణాధికారిగా నియమించారు. దీనిపై విచారణకు హాజరుకావాలని గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సూపరింటెండెంట్‌లతోపాటు, డీసీహెచ్‌ఎస్, ఆసుపత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, స్టాఫ్‌నర్సులు 24 మందికి ఈనెల 20వ తేదీన జరిగే విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. మంగళవారం జరిగిన విచారణకు కొంతమంది మాత్రమే హాజరయ్యారు. వీరి నుంచి డీఎంఅండ్‌హెచ్‌వో స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఆసుపత్రి రికార్డులను ఆమె పరిశీలించారు. కొందరు అధికారులు, సిబ్బంది ఇంకా విచారణకు హాజరుకావాల్సి ఉందని, విచారణ పూర్తిచేసిన అనంతరం తుది నివేదికను కలెక్టర్‌కు పంపుతామని డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు.

● సీనియర్ అసిస్టెంట్ ఉల్లికృష్ణపై ఆరోపణలు

మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉల్లి కృష్ణపై పలు ఆరోపణలు రావడంతోనే ఈ అంశంపై కలెక్టర్‌కు సిబ్బంది ఫిర్యాదు చేశారు. తూర్పు కృష్ణా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఉల్లి కృష్ణ గతంలో వైసీపీ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే పేర్ని నానికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి నుంచి అవనిగడ్డ ఆసుపత్రికి ఆయన బదిలీపై వెళ్లారు. జిల్లా కేంద్రంలో ఆయన పనిచేయడం లేదని, తూర్పు కృష్ణా ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసేందుకు ఆయన అర్హత కోల్పోయాడని కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. మచిలీపట్నంలో నిర్మించిన ఎన్‌జీవో హోమ్ భవనానికి గతంలో ఎంపీగా పనిచేసిన కొనకళ్ల నారాయణరావు మంజూరుచేసిన రూ.20 లక్షల నిధులు, భవనం నిర్మాణం కోసం ఉద్యోగులు ఇచ్చిన రూ.18 లక్షల విరాళాలను పక్కదారి పట్టించారనే ఆరోపణలు చేస్తున్నారు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో అవినీతి జరిగిందనే అంశం వెలుగులోకి రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. రెండు, మూడు రోజులపాటు ఈ విచారణ కొనసాగనుందని, విచారణ పూర్తయిన తరువాత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై సర్వత్రా చర్చనడుస్తోంది.

రెవెన్యూ టూ సీఆర్‌డీఏ డిప్యుటేషన్లు

(5వ పేజీ తరువాయి)

తహసీల్దార్లు చూస్తున్నారు.

కొరత తీరేనా..?

ఎవరెన్ని ఆశలు పెట్టుకున్నా ఎంపికైన వారు సీఆర్‌డీఏకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలను బలోపేతం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కచ్చితంగా ఆయా శాఖల నుంచి డిప్యుటేషన్లపై పంపించాల్సిన అవసరం ఉంది. అనుభవం కలిగిన వారినే సీఆర్‌డీఏకు పంపిస్తున్నారు. అయితే, దీనివల్ల రెండు జిల్లాల్లో స్థానికంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల కొరత ఏర్పడుతుంది. ఈ కొరతను తీర్చుకోవటానికి సీనియారిటీ కలిగిన డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ ఈ అంశంపై కోర్టులో వివాదం నడుస్తోంది. లేకపోతే అర్హులైన డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. రెండు జిల్లాల యంత్రాంగాలతో పాటు రెవెన్యూ ఉద్యోగుల సంఘాలు కూడా కోర్టు తగాదాలను పరిష్కరించుకోవటం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపించొచ్చు.

డిప్యుటేషన్లు పొందిన తహసీల్దార్లు, డీటీలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ తహసీల్దార్ సీహెచ్ దుర్గాప్రసాద్, విజయవాడ తూర్పు తహసీల్దార్ ఆర్‌వీవీ రోహిణీదేవి, మైలవరం డీటీ ఎం.శ్రీహరి, విజయవాడ సెంట్రల్ డీటీ ఎస్.శ్రీనివాసమూర్తి, కృష్ణాజిల్లా నుంచి గన్నవరం తహసీల్దార్ కె.వెంకటశివయ్య, పెడన తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, కలెక్టరేట్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ పి.మధుసూదనరావు, చల్లపల్లి డీటీ ఎస్ఎస్ఎస్ కుమార్, కంకిపాడు డీటీ నాగరాజు డిప్యుటేషన్ పొందారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతిలో హోమద్రవ్యాలు, పట్టుచీరను సమర్పిస్తున్న అర్చకులు

వన్‌టౌన్, ఆగస్టు 20 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడురోజుల పాటు వైభవంగా జరిగాయి. వేదపండితుల వేదఘోష, అర్చకుల మంత్రోచ్చారణల మధ్య హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. అమ్మవారికి చేరేందుకు పట్టువస్త్రాన్ని సమర్పించారు. అద్యంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఈవో దంపతులు యాగశాలలో వేద పండితులను సత్కరించి ఆశీర్వచనం అందుకున్నారు.



మునిసిపల్ రోడ్డులో ప్లాటు యజమాని నిర్మించిన ప్రహరీ

ముందు చోద్యం.. తరువాత నోటీసు!

- అక్రమ లే అవుట్‌లపై మునిసిపల్ అధికారుల వింత వైఖరి

జగ్గయ్యపేట, ఆగస్టు 20 : జగ్గయ్యపేట పురపాలకసంఘ పరిధిలో విచ్చలవిడిగా అనధికారికంగా లే అవుట్‌లు పెడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు నిద్ర నటిస్తున్నారు. లే అవుట్‌లు వేసేటప్పుడు అడ్డుకోకుండా చోద్యం చూడటం, అంతా అయిపోయాక నోటీసులు ఇవ్వడం పరిపాటిగా మారింది. శాంతినగర్ వ్యవహారంలో జాయింట్ సర్వే చేయించకుండా అధికారులు ప్లాట్ యజమానికి పరోక్షంగా సహకరించారు. రోడ్డు పగులగొట్టడానికి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు గోడ కట్టుకునేదాకా చూస్తూ ఊరుకుండిపోయారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

పట్టణంలో 31వ వార్డులోని శాంతినగర్ పరిధిలో వైదేహి అపార్ట్‌మెంట్ వెనుక గత ఎన్నికల ముందు రూ.4.50 లక్షలతో మున్సిపల్ అధికారులు రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసేదాకా మాట్లాడని ప్లాట్ యజమాని అంతా పూర్తయ్యాక తన స్థలంలో రోడ్డు వేశారని అభ్యంతరం చెప్పారు. ఇప్పుడు తాజాగా మునిసిపల్ అధికారులు ఇచ్చిన ఎండార్స్‌మెంట్‌ను గుప్పిట పెట్టుకుని మునిసిపల్ స్థలంలో ప్రహరీ నిర్మించారు. మంగళవారం ఉదయం నుంచి పని జరుగుతున్నా స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మునిసిపల్ అధికారులు సాయంత్రం అంతా అయిపోయాక ప్లాట్ యజమాని పుల్లారావుకు నోటీసు ఇచ్చారు. మునిసిపాలిటీ రోడ్డులో కట్టిన ప్రహరీని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకపోతే తాము తొలగించి ఆ డబ్బులు రికవరీ చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. కమిషనర్ నాగమల్లేశ్వరరావు వివరణ కోరగా ప్రహరీ నిర్మించారని తమ దృష్టికి రాగానే నోటీసు ఇచ్చామని సమర్థించు కున్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఎ.కొండూరు : మండలంలోని కంభంపాడు ప్రభుత్వం జూనియర్ కళాశాలలో జువాలజీ, కామర్స్ గెస్ట్ బోధన సిబ్బంది పోస్టుల భర్తీ కోసం ఈ నెల 21న దరఖాస్తులు స్వీకరిస్తునట్టు ప్రిన్సిపాల్ ఝాన్సీ తెలిపారు. అసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు 21 బుధవారం మధ్యాహ్నం 3 గంటలలోపు రెండు సెట్ల దరఖాస్తులు అందజేయాలని, 22న ఉదయం 11 గంటలకు విజయవాడలోని పాయకాపురం, రాధానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు గరిష్టంగా రూ.10 వేలు వరకు జీతం చెల్లించబడుతుందన్నారు.

ఇంగ్లీష్, ఫిజిక్స్ అధ్యాపకుల నియామకానికి హాజరు కావాలి

గంపలగూడెం : గంపలగూడెం ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, ఫిజిక్స్ సబ్జెక్టుల బోధనకు అతిథి అధ్యాపకుల పోస్టుల నియామకానికి ఈనెల 22న ఉదయం 11 గంటలకు విజయవాడలోని పాయకాపురం రాధానగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్యాంపస్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో డెమో క్లాసులకు అర్హత కలిగిన అభ్యర్థులు హాజరు కావాలని ప్రిన్సిపల్ జి.అనురాధ మంగళవారం తెలిపారు.

డాక్టర్ల రక్షణకు చర్యలు



● సీఎంతో సంప్రదించి నిర్ణయిస్తాం : హోంమంత్రి వంగలపూడి అనిత

మొగల్రాజపురం, ఆగస్టు 20 : డాక్టర్‌లపై అఘాయిత్యాలు జరిగితే నిందితులకు ఇప్పుడున్న చట్టం ప్రకారం మూడేళ్లు శిక్ష ఉంటుందని, బెయిల్ కూడా సులువుగా వస్తోందని చట్టాన్ని మార్చి నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదయ్యేలా చేయాలని, 3 నుంచి 7 ఏళ్ల శిక్షపడేలా చూడాలని వచ్చిన విజ్ఞాపనను సీఎం చంద్రబాబుతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. దానితోపాటే సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పోరాడటంతోపాటు బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పిలుపునిచ్చారు.



అఘాయిత్యాల నిర్మూలనపై స్కిట్

కలకత్తాలో వైద్య విద్యార్థిని డాక్టర్ మౌమితపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ నిందితుడికి కఠిన శిక్ష సత్వరమే విధించాలని, ప్రతి స్త్రీ భద్రత మన బాధ్యత అనే నినాదంతో డివి మానర్ హోటల్ నుండి టిక్కిల్ రోడ్డుమీదుగా పీబీ సిద్దార్థ కళాశాల వరకు వాసవ్య మహిళా మండలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇతర డాక్టర్స్ అసోసియన్స్ సంయుక్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీతో పాటు అనంతరం జరిగిన సభలో మంత్రి అనిత మాట్లాడారు. ఎక్కడో ఒక సంఘటన జరిగినప్పుడు ఇక్కడ ఇలాంటి కార్యక్రమాలు ఎంటనే కామెంట్స్ వస్తున్నాయని ఆటువంటి వారు మారాలని ఇక్కడ ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల మన దగ్గర కూడా అవేర్‌నెస్ వస్తుందని అందరు జాగ్రత్తగా ఉంటారని చెప్పారు. చాలా మంది పేరంట్స్ కూడా గుర్తించి జాగ్రత్త పడాల్సిన విషయం ఒకటుందని పిల్లలకు సెల్ ఫోన్‌లు ఇచ్చి పనుల్లో పడుతున్నారని కాని వారు అందులో పోర్న్ చూసి ఆఘాయిత్యాలకు పాల్పడుతున్నారని అందుకు ఉదాహరణ ఇటీవల నంద్యాలలో 7 సంవత్సరాల బాలికను ముగ్గురు మైనర్‌లు హత్యాచారం చేసిన ఘటన అన్నారు. పాఠశాల స్థాయి నుండే ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఎంటో కూడా తెలిసే విధంగా చూస్తామని చెప్పారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ మాట్లాడుతూ ఇంట్లో మగ పిల్లలకు కూడా తల్లిదండ్రులు మంచి విలువలు నేర్పాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాసవ్యమహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి. కీర్తి మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల విద్యార్థినులు కలకత్తాలో జరిగిన దారుణం కళ్లకు కట్టే విధంగా ప్రదర్శించిన స్కిట్ కంటి తడిపెట్టించింది. ఆఘాయిత్యాలపై శ్రీలత వేసిన చిత్రాన్ని సీఎం చంద్రబాబుకు ఇవ్వాలని కోరుతూ హోం మంత్రి అనితకు అందించింది.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు



● పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు

అజిత్‌సింగ్‌నగర్ : మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని నగర పోలీసు కమిషనర్ ఎస్.వి .రాజశేఖర్‌బాబు అన్నారు. నగరంలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం కమిషనరేట్ పరిధిలోని పలువురు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, గంజాయి, మద్యం అక్రమ రవాణా, దొంగతనాలు, కొట్లాటలు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చేడు నడత కలిగిన వ్యక్తులపై నగర బహిష్కరణ, పీడీ యాక్ట్ పెట్టి నేరాలను నియంత్రించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసుతో పాటు పహారా నిర్వహించి అనుమానితులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో లా అండ్ ఆర్డర్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది అవగాహనతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో డీసీపీలు గౌతమి శాలి, కెఎం.మహేశ్వరరాజు, టి.హరికృష్ణ, చక్రవర్తి, అడిషనల్ డీసీపీలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

మినీ జాబ్‌మేళా రేపు

భారతీనగర్, ఆగస్టు 20: ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో డి మార్ట్, విజేత, ఫ్లిప్‌కార్టు, జీనియస్, ఎస్‌బిఎస్ లిమిటెడ్ వంటి పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని పదవ తరగతి, ఐటీఐ, డిప్లమో తోపాటు ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన 18 సంవత్సరాల నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగులు బయోడేటా ధ్రువప్రతాలు జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ర్యాలీ



విద్యార్థులు, నగరపాలక సంస్థ సిబ్బంది ర్యాలీ

కృష్ణలంక, ఆగస్టు 20 : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం కృష్ణలంకలో ఉర్దూ స్కూల్ విద్యార్థులు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంట్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత మీద ప్రజలకు అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం నెలకొల్పారు. దోమల వల్ల కలిగే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా జ్వరాల బారిన పడకుండా వుండేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించవలసిన పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర పరిధిలో దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్స్ చేస్తున్నారని, ఒకవైపు డ్రెయిన్లలో డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తిచేస్తూనే, యాంటీ లార్వా ఆపరేషన్స్, కాల్వలో పూడికలు తీయుట, మురుగునీటి పారుదల ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయడం ద్వారా దోమలను నియంత్రిస్తున్నారని తెలిపారు.

ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ఆరోగ్యమైన జీవనాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, కార్పొరేషన్ సిబ్బంది, ఉర్దూ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఆగస్టు 20: ఎటువంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నియోజక వర్గ పర్యటనలో భాగంగా మంగళవారం 13వ డివిజన్‌లోని న్యూ ఆర్టీసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మెగా టౌన్‌షిప్ వెనుక రోడ్లో రూ.37 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కాలనీ వారంతా కలిసి కట్టుగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుంటారని, ఇది ఈ కాలనీ ప్రత్యేకత అని అన్నారు. ఈ డివిజన్‌లో ప్రధాన సమస్యలను పరిష్కరించి ప్రజలకు మౌలిక వసతులు సమకూరుస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ డివిజన్‌లోని రెండు రోడ్లను నిర్మాణం చేయడానికి రూ.37లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే అభివృద్ధి ప్రారంభమైందన్నారు. డివిజన్ అధ్యక్షుడు గద్దె ప్రసాద్, వీరంకి డాంగీకుమారి, వేములపల్లి శ్రీనివాస్, కొరపాటి శ్రీనివాస్, నూతి శ్రీనివాస్, లీలాప్రసాద్, గోపాలరావు, శేషగిరి రావు, అడ్డుకట్ల రామారావు, జావిరాజు నాని, ఈడుపుగంటి వీరభద్రరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే బ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య

సత్యనారాయణపురం, ఆగస్టు 20: చంద్రబాబుతోనే బ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య అన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవం సందర్భంగా సత్యనారాయణపురంలో మంగళవారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 2014 ఆగస్టు 20న బ్రాహ్మణ కార్పొరేషన్ స్థాపించి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం ఆ తేదీన బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవంగా పరిగణించి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం, దేవాలయాల్లో పూజలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి బ్రాహ్మణుల ఉసురు పోసుకుందన్నారు. చంద్రబాబు హయాంలో తిరిగి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటనా జాతీయ అధ్యక్షుడు గొట్టేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, రాష్ట్రీయ బ్రాహ్మణ ప్రధానకార్యదర్శి వారణాసి సారధి, వర్కింగ్ ప్రెసిడెంట్ గార్లపాటి విజయకుమార్, నందిగామ అధ్యక్షుడు నందిరాజు ప్రకాష్, కల్పన, గూడూరు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

● వన్‌టౌన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



వన్‌టౌన్, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూళ్ల విద్యాసంస్థల పరిపాలనా అధికారి డాక్టర్ వి. నారాయణరావు అన్నారు. మంగళవారం కేబీఎన్ కళాశాల ఉమన్స్ స్టడీ ఆధ్వర్యంలో కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పై సమాజంలోని ప్రతి ఒక్కరూ నిరసన వ్యక్తం చేయాలన్నారు. మహిళలు, విద్యార్థినులపై ఎటువంటి నేరాలు జరగకుండా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలలో నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా కఠిన చట్టాలు అమలు చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఎస్ఆర్ఎస్‌వి బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సూర్యకనకదుర్గ, చిట్టూరి హైస్కూల్ ప్రిన్సిపాల్ కె. సుధారాణి, ఎంఎస్ఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ వి. శ్యామల, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ ఎగ్జిబిషన్



ప్రదర్శనను తిలకిస్తున్న కళాశాల నిర్వాహకులు

వన్‌టౌన్, ఆగస్టు 20: పొట్టి శ్రీరాములు చలవాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన కళాశాల కరస్పాండెంట్ సీఏ చిట్టా అమర సుధీర్ విద్యార్థులు రూపొందించిన నమూనాలు, పరికరాలు ఎంతో ఆకట్టుకున్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయని తెలిపారు. కోశాధికారి కె. రాఘవయ్య మాట్లాడుతూ సెమీ కండక్టర్స్ రంగం భారతదేశ పురోగతికి తోడ్పడుతుందన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ గ్రంధి పవన్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించి ఆరోగ్య భద్రతలను తెలిపే సెన్సర్‌లను తయారు చేయాలని సూచించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. రంగారావు మాట్లాడుతూ ఎగ్జిబిషన్ నిర్వహణకు సహాయపడిన కళాశాల మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్న విద్యార్థులు పోస్టల్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగాలు, వాటి ఆవిష్కరణలను వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. పతంజలి శాస్త్రి, అధ్యాపకులు డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, కె. సూర్యభరత్, కె. విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో రాజీవ్‌గాంధీకి ప్రత్యేక గుర్తింపు

● ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



గవర్నర్‌పేట, ఆగస్టు 20: దేశ రాజకీయాల్లో రాజీవ్‌గాంధీ ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యక్తి అని ఏపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలీ అన్నారు. ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి షేక్ మస్తాన్ వలీ పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా వలీ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు దేశ ఆర్థిక సామాజిక వ్యవస్థలను ఎంతో వృద్ధిలోకి తెచ్చిందన్నారు. విదేశీ విధానంలో చురుకైన పాత్ర పోషించి పొరుగు దేశాలతో సత్సంబంధాలకు కృషి చేశారని కొనియాడారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, పీసీసీ ఉపాధ్యక్షుడు వి. గుర్నాథం, కొలనుకొండ శివాజీ, సీనియర్ నేతలు అన్సారీ, కుర్షీదా, గంగిశెట్టి ఉమాశంకర్, పీవై కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మేరీ మెమోరియల్ బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం



విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 20 : బాస్కెట్‌బాల్ టోర్నీల ద్వారా ఈ క్రీడపై ఆసక్తి పెంచడం హర్షణీయమని శాప్ మాజీ చైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి అన్నారు. మారిస్ స్టెల్లా కళాశాల ఆవరణలో మూడు రోజుల పాటు సాగే మేరీ మోమోరియల్ సిటి లెవెల్ ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ మాజీ చైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి, ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి జి చక్రవర్తిలు హాజరై బాల్ ఆడి ప్రారంభించారు. స్థానికంగా 20 స్కూల్స్, ఎనిమిది కళాశాలల జట్ల టీమ్‌లు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో తలపడ్డాయి.

ఇందులో విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. జిల్లా సెక్రటరీ జీఎస్‌సీ బోస్, ఉపాధ్యక్షులు జాన్సన్, ప్రశాంత్ చౌదరి, బాస్కెట్‌బాల్ కార్పొరేషన్ సెక్రటరీ జి. ప్రేమ్‌కుమార్, మారిస్ స్టెల్లా చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ లీనా క్వాడ్రస్, ప్యాట్రన్ డాక్టర్ జసింతా క్వాడ్రస్‌లు, కళాశాల పీఈటీ విభాగం హెడ్ రాజాలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



వన్‌టౌన్, ఆగస్టు 20 : 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బ్రాహ్మణ వీధిలోని బుద్దువారి గుడివద్ద ఓ వృద్ధుడు మరణించి ఉండటాన్ని గమనించిన స్థానికులు మంగళవారం కార్పొరేటర్‌కు సమాచారం అందించారు. కార్పొరేటర్ వెంకటేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహానికి పూలమాల వేశారు. కార్పొరేషన్ వాహనం ద్వారా మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం మహాప్రస్థానం వాహనంలో తరలించారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే బొండా ఉమా



స్థానికులతో మాట్లాడుతున్న బొండా ఉమా

పాయకాపురం, ఆగస్టు 20 : నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. పాయకాపురం పరిధిలోని 61వ డివిజన్ హెచ్‌బ్లాక్ పరిసర ప్రాంతాల్లో పార్కులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదం అందించే దిశగా పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

దేవినేని గాంధీపురం వాసులకు ఇళ్ల పట్టాలు అందజేస్తాం

61వ డివిజన్‌లో పార్కుల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే బొండా ఉమాకు దేవినేని గాంధీపురం వాసులు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు.

గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్న దేవినేని గాంధీపురం వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన బొండా ఉమా త్వరలోనే ఇళ్ల పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేతలు దాసరి కనకారావు, దాసరి ఉదయశ్రీ, ఆకుల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి అదృశ్యం

రాణిగారితోట, ఆగస్టు 20: ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంపై కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. రాణిగారితోటకు చెందిన గుడివాడ రామ్మోహన్‌రావు(54) అదే ప్రాంతంలో కిరాణాకొట్టు నిర్వహిస్తున్నాడు. ఈనెల 13న మధ్యాహ్నం 3గంటలకు ఆసుపత్రికి వెళ్లివస్తానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ రేపు

భారతీనగర్, ఆగస్టు 20: జిల్లాలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టును తాత్కాలిక ప్రాతిపదికంగా భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి. ఆర్యావతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఒకేషనల్ విభాగంలో విద్యార్థులకు మెకానికల్ అండ్ ఆటోమొబైల్ టెక్నీషియన్ కోర్సులలో బోధన అందించేందుకు అర్హతగల అభ్యర్థులు గురువారం పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు మెకానికల్ లేదా ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.

దుకాణంలో రూ.1.02 లక్షలు చోరీ

జగ్గయ్యపేట, ఆగస్టు 20: బలుసుపాడు జంక్షన్‌లో క్రిస్టియన్‌పేట పోలీస్ బీట్‌కు కూతవేటు దూరంలో కమిషన్ వ్యాపారి కొత్తా రమేష్ కుమార్ దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టి దొంగలు రూ.1.02 లక్షలు అపహరించుకుపోయారు. సీసీ కెమెరాలో పడకుండా షట్టర్ ఎత్తి నేరుగా క్యాష్ కౌంటర్ తాళాలు పగులగొట్టి నగదు, చిల్లర ఎత్తుకెళ్లారు. పాత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద దుండగులు బైక్‌ను పార్క్ చేసి నట్టు, రాత్రి గం.2-30 సమయంలో చోరీ జరిగినట్టు తెలుస్తోంది. వ్యాపారి కొత్తా రమేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన

నందిగామ రూరల్ : జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మాగల్లు సచివాలయం వద్ద మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్/హెచ్‌ఐవీ నియంత్రణ చర్యలపై అవగాహన కలిగించారు. ఎయిడ్స్ వ్యాప్తి, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులను వివరించారు. ఏపీసీ వైద్యులు రాజేంద్రప్రసాద్, చక్రవర్తి, సీహెచ్‌వో వర్షిణీ, లక్ష్మీనాయక్, సుందర్‌రావు, వెంకట్రావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట ప్రాంతంలో పెట్రోల్ బంకుల్లో వచ్చిన అభియోగాలపై మంగళవారం అసిస్టెంట్ సప్లైస్ ఆఫీసర్ చల్లా లక్ష్మీ నారాయణరెడ్డి, తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ యు.భాను ప్రసాద్ తనిఖీ చేశారు. పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మెటికల శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు కల్పించాల్సిన సౌకర్యాలను ప్రశ్నించారు. మరోమారి ఆకస్మిక తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్‌జీ రంగా వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.

విభాగాలు: అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్ (హోంసైన్స్)

స్పెషలైజేషన్‌లు:

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

క్యాంపస్‌లు

- బాపట్ల, తిరుపతి, నైరా, మహానంది అగ్రికల్చరల్ కాలేజీలు
- గుంటూరులోని ఏపీజీసీ
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- బాపట్లలోని డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- లామ్‌లోని అడ్వాన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్

అర్హత: పీజీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐకార్ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్ విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BYXem1hలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

Alstom India

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply.
- Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
- The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
- The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

Legrand Empowering

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.
- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.
- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 05-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9

SCHOLARSHIP ALERT

buddy4study.com

చిత్రకు లతా మంగేష్కర్ అవార్డు

ప్రఖ్యాత నేపథ్య గాయకురాలు కె.ఎస్.చిత్ర, సంగీత దర్శకుడు ఉత్తమ్ సింగ్‌లను దివంగత గాయని లతా మంగేష్కర్ స్మారక పురస్కారాలు వరించాయి. మధ్యప్రదేశ్‌లో సెప్టెంబరు 28న ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంగళవారం ప్రకటించింది. ప్రతీ ఏటా లతా మంగేష్కర్ జయంతి రోజున ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 2022 సంవత్సరానికి ఉత్తమ్ సింగ్, 2023 సంవత్సరానికి చిత్ర ఈ అవార్డులు అందుకోనున్నారు. లత స్మారకార్థం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్మించిన నూతన ఆడిటోరియంలో ఈ అవార్డులను బహూకరిస్తారు.





అందరికీ ధన్యవాదాలు

తన ఆరోగ్యం బాగుండాలని కోరుతూ దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా ఈ నెల 17న నగరంలోని ఒక కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమె... సోమవారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆమె భావోద్వేగంతో అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'తమిళ అభిమానులకు నాపై ప్రత్యేక ప్రేమ ఉంది. వారికి పాటలంటే ప్రాణం. అందుకే భగవంతుడు నన్ను పంపాడు. దేవుడు నాకు ఇంత మంచి గొంతు ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు అర్థమైంది. దేవుడి దయ వల్లే ఇదంతా సాధ్యమైంది' అని ఆమె పేర్కొన్నారు.

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

సర్దుకుపోవడం.. రాజీపడటం...

మలయాళ పరిశ్రమలో ఈ రెండూ చాలా ఫేమస్ ● మల్లూవుడ్‌లో మహిళల సమస్యలపై హేమ కమిటీ రిపోర్ట్
● పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలని కండిషన్ ● అంగీకరిస్తే కోడ్‌నేమ్, ఎదురు తిరిగితే అప్రకటిత నిషేధం



2017లో నటి భావన కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ ఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే హేమ ఈ కమిటీకి ఛైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి.

మలయాళ చిత్రసీమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. మల్లూవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను సూచించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మహిళలపై వేధింపులు, శ్రమ దోపిడి, అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి సాధారణంగా మారాయని, క్రిమినల్ గ్యాంగ్స్ కనుసన్నల్లో మలయాళ చిత్రపరిశ్రమ నడుస్తోందని కమిటీ ఆరోపించింది. సమస్య పరిష్కారానికి పటిష్ఠ చట్టం అవసరమని, ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాలు విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని పేర్కొన్నారు.

కమిటీ గుర్తించిన ముఖ్యమైన అంశాల్లో కొన్ని

- షూటింగ్ సమయంలో మహిళలకు మరుగుదొడ్డి సదుపాయాల కొరత ఉంది. ఈ-టాయ్‌లెట్‌లు సరిపడా స్థాయిలో ఉండడం లేదు. అలాగే దుస్తులు మార్చుకునేందుకు సరైన గదులు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు భయపడాల్సి వస్తోంది.
- ప్రొడక్షన్ మేనేజర్లు అవకాశాల కోసం తమను కలిసే మహిళలను లొంగదీసుకుంటున్నారు. 'పరిస్థితులను బట్టి సర్దుకుపోండి, కొన్ని విషయాల్లో రాజీపడండి అలాగైతేనే మీకు మా సినిమాలో అవకాశం ఇస్తాం' అని కండీషన్ పెడుతున్నారు. 'పిలిచినప్పుడల్లా పక్కలోకి రావాలి' అని షరతుడు పెడుతున్నారు. సర్దుకుపోవడం, రాజీపడడం... అనే ఈ రెండు మలయాళ చిత్రసీమలో చాలా ఫేమస్ అని కమిటీ నివేదికలో పేర్కొంది.
- షూటింగ్‌లో తమకు కేటాయించిన వసతి గృహాల్లో ఒంటరిగా ఉండాలంటే మహిళా నటీమణులు భయపడుతున్నారు. ఎవరు ఎప్పుడు తాగి వచ్చి తలుపు కొడతారో అనే భయంతో స్నేహితులనో, బంధువులనో తోడు తెచ్చుకుంటున్నారు. తాము బస చేసిన హోటళ్లలో, షూటింగ్స్‌లో ఉన్న మగవాళ్లు ఎక్కువ సార్లు మత్తులో జోగుతూ తమ తలుపు తట్టారని కమిటీ ముందు చెప్పారు. వారించినా పదే పదే తలుపులు కొడుతున్నారనీ, వాళ్లు తలుపులు బద్దలు కొట్టుకొని లోపలకి వచ్చి తమను ఏమైనా చేస్తారేమోనని చాలాసార్లు భయపడినట్లు తెలిపారు. చిత్రీకరణకు ముందే ఓ హీరో, హీరోయిన్‌ను లైంగికంగా వేధించాడు. ఆ ప్రభావం ఆమె నటనపై పడింది. అతనిపైన ఉన్న ద్వేషమే ఆమె ముఖంలో ప్రతిఫలించింది. దీనివల్ల ఒక్కషాట్‌కు ఆమె 17 టేక్‌లు తీసుకోవాల్సి వచ్చింది. దీంతో డైరెక్టర్ ఆమెను తిట్టాడు.

స్టార్‌డమ్‌తో ఇబ్బందులు

లైంగికవేధింపులకు గురైన నటీమణులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయమే దీనికి కారణం. సామాన్య మహిళలతో పోల్చితే సెలబ్రిటి స్థాయిలో ఉన్నవాళ్లు ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. సైబర్ దాడులు సహా పలు రూపాల్లో వారిపై దాడి చేస్తున్నారు. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని మహిళలు చెబుతున్నారు. కోర్టు, పోలీసులను ఆశ్రయిస్తే, ప్రాణహానితో పాటు కుటుంబం మొత్తం దారుణమైన పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పలుకుబడి పనిచేస్తోంది

- కొందరు పలుకుబడి ఉన్న నిర్మాతలు, దర్శకులు, నటీనటులు ప్రొడక్షన్ కంట్రోలర్స్ లాంటి పవర్‌ఫుల్ వ్యక్తులు పరిశ్రమను నియంత్రిస్తున్నారని నివేదిక పేర్కొంది. తమ పలుకుబడిని ఉపయోగించి పరిశ్రమలో అవకాశాలు రాకుండా చేస్తారని మహిళలు భయపడుతున్నారు. లైంగిక వేధింపులకు గురైనప్పుడు ఫిర్యాదు చేస్తే, వారిపైన అప్రకటిత నిషేధం కొనసాగుతుంది. తర్వాత మరో సినిమాలో అవకాశం రాకుండా చేస్తున్నారు. దీనివల్ల తమ కెరీర్ బుగ్గి అవుతుందని మహిళలు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు.
- అగ్రతారలకు మినహా ఇతర నటీనటులకు పారితోషికానికి సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదు. దీనివల్ల మహిళలు, జూనియర్ యాక్టర్స్‌కు పూర్తి పారితోషికం అందడం లేదు. డిమాండ్ చేసే వీలు కూడా ఉండడం లేదు.

ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలి


రిటైర్డ్ జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ట్రిబ్యూనల్ పనిచేయాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న మహిళా న్యాయమూర్తులను నియమించాలి. మహిళలకు సురక్షితమైన వసతి, రవాణా, టాయిలెట్‌లు, ఉండే దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. షూటింగ్‌లో డ్రగ్స్, మద్యంపై నిషేధం విధించాలి. జూనియర్ ఆర్టిస్టులకు వర్క్ కాంట్రాక్ట్‌లను అమలు చేయాలి. మహిళలకు వారి ప్రతిభ, శ్రమకు తగ్గ పారితోషికం అందేలా చూడాలి. సమాన అవకాశాలతో పాటు అందరినీ కలుపుకోని పోయే వాతావరణాన్ని పరిశ్రమలో సృష్టించాలని నివేదిక సూచించింది.

చిక్కుల్లో 'జైలర్' దర్శకుడి సతీమణి

ఇటీవల జరిగిన బీఎస్పీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసులో 'జైలర్' చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ సతీమణి మోనీషాను నగర పోలీసులు విచారిస్తున్నారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా ఇప్పటికే 23 మందిని అరెస్టు చేయగా, ఓ నిందితుడు పోలీస్ ఎన్‌కౌంటరులో ప్రాణాలు కోల్పోయాడు. ఇందులోభాగంగా, పేరుమోసిన రౌడీ మొట్టై రాజేంద్రన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొట్టై రాజేంద్రన్ దేశం విడిచి పారిపోయినట్టు సమాచారం. ఆయన పారిపోయేముందు మోనీషాతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించడంతో ఆమె చిక్కుల్లో పడ్డారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

నవ్య | చిత్రజ్యోతి



శ్రద్ధాకు రూ. 5 కోట్లు.. తమన్నాకు రూ. కోటి!

శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు నటించిన 'స్త్రీ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. పోటీలో రెండు చిత్రాలు ఉండడంతో వాటికంటే ఒక రోజు ముందు విడుదల చేస్తే హిట్ గ్యారంటీ అనుకున్న నిర్మాతల అంచనాలు వమ్ము కాలేదు. అడ్వాన్స్ బుకింగ్స్‌లో సత్తా చాటిన 'స్త్రీ 2' చిత్రం విడుదలయ్యాక వసూళ్లలోనూ ముందంజలో ఉంది. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం తొలి ఐదు రోజుల్లోనే దాదాపు రూ.322 కోట్ల గ్రాస్‌ను సాధించింది. సూపర్ న్యాచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2' విడుదలైన మర్నాడు వచ్చిన 'వేద', 'ఖేల్ ఖేల్ మే' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ధాటిని తట్టుకోలేక కలెక్షన్లలో తేలిపోయాయి. కాగా, 2018లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'స్త్రీ' చిత్రానికి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. రెండు భాగాలకూ అమర్ కౌశిక్ దర్శకత్వం వహించగా, మ్యాడోక్ ఫిల్మ్, జియో సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

అయిదు నిమిషాలకు కోటి

నటి తమన్నా 'సరిలేరు నీకెవ్వరు', 'జైలర్', 'జై లవ కుశ' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాల్లో తళుక్కుమన్న సంగతి తెలిసిందే. ఆమె తాజాగా, 'స్త్రీ 2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్' అనే ఐటెం సాంగ్‌లో నటించారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రాజ్‌కుమార్ రావుకు రూ. ఆరు కోట్లు, హీరోయిన్ శ్రద్ధా కపూర్‌కు రూ. ఐదు కోట్లు పారితోషికంగా ఇచ్చారు. అయితే ఐటెం సాంగ్‌లో అయిదు నిముషాలు అలా మెరిసిన తమన్నా ఆ పాట కోసం ఏకంగా రూ. కోటి రూపాయలు వసూలు చేశారట. ఆమె నర్తించిన ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'స్త్రీ' మొదటి భాగంలో నోరా ఫతేహి ప్రత్యేక గీతం కోసం రూ.25 లక్షలు తీసుకోగా.. రెండో భాగానికి తమన్నా నాలుగు రెట్లు అధికంగా తీసుకోవడం విశేషం. తమన్నా డిమాండ్ అలా ఉంది మరి!



పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్ అమ్మకానికి!

నటి సోనాక్షి సిన్హా ఇటీవలే పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆమె తను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌ను అమ్మకానికి పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గత ఏడాది సెప్టెంబరులో ముంబైలోని బాంద్రాలో రూ.11 కోట్లు పెట్టి ఆమె ఓ ఇంటిని కొన్నారు. అదే అపార్ట్‌మెంట్లో ఇటీవలే ఆమె జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్‌ను ఆమె రూ.25 కోట్లకు అమ్మకానికి పెట్టారు. ఏడాది కూడా కాకుండానే.. అదీ వారిద్దరి పెళ్లి జరిగిన అపార్ట్‌మెంట్‌ను ఇలా సడెన్‌గా అమ్మకానికి పెట్టడం అందరిలో కుతూహలాన్ని రేకెత్తిస్తోంది. అసలు ఈ అపార్ట్‌మెంట్ అమ్మడానికి అసలు కారణం ఏంటా అని అభిమానులు నెట్టింట చర్చిస్తున్నారు.

అసూయతో వచ్చిన మాటలవి





ప్రభాస్‌పై బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలను హీరో సుధీర్‌బాబు, దర్శకుడు అజయ్ భూపతి తప్పుపట్టారు. మంగళవారం సోషల్‌మీడియాలో ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. "అర్షద్ వార్సీ నుంచి ఇలాంటి ప్రొఫెషనలిజం లేని మాటలు రావడం అస్సలు ఊహించలేదు. విమర్శనాత్మకంగా మాట్లాడవచ్చు కానీ ఇలా చులకనగా మాట్లాడ్డం సరికాదు. ఇలాంటి అనవసర వ్యాఖ్యలను పట్టించుకునే తీరిక ప్రభాస్‌కు లేదు. ఆయన స్థాయి చాలా పెద్దది" అని ఎక్స్‌లో సుధీర్‌బాబు పేర్కొన్నారు. "భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లడానికి.. తన వంతుగా ఏమైనా చెయ్యడానికి ప్రభాస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆయన మన దేశానికే గర్వకారణం. ఈ మాటలన్నీ వార్సీ నుంచి అసూయతో వచ్చినవే" అని దర్శకుడు అజయ్ భూపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, ఇటీవలే అర్షద్ వార్సీ, 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో ప్రభాస్ లుక్ జోకర్‌లా ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

కొత్తగా..



విడుదల తేదీ మారింది

వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ తెలుగులో కూడా తనకంటూ అభిమానుల్ని ఏర్పరచుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం కోసం 1980ల నాటి ముంబై నగరాన్ని పునర్నిర్మించడం విశేషం. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించిన ఈ సినిమాను మొదట సెప్టెంబర్ ఏడున విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. ఈ మార్పు గురించి చిత్ర నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నా నిర్మాణానంతర కార్యక్రమాలకు అదనపు సమయం పడుతోంది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించడం కోసం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఎక్కడా రాజీ పడడం లేదు. అందుకే విడుదల తేదీ మారింది' అని చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా 'లక్కీ భాస్కర్' విడుదల కానుంది.

దసరాకి వస్తున్న రాజావారు



'మ్యాడ్', 'ఆయ్' వంటి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్స్ హిట్‌తో దూసుకుపోతున్న నార్నే నితిన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సంపద హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సతీశ్ వేగేశ్న దర్శకుడు. చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌కు నచ్చి, ఎంపిక చేసిన కథతో మా సినిమా రూపుదిద్దుకుంది. ఆయన అంచనాల మేరకు దర్శకుడు సతీశ్ ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని రూపొందించారు. భారీ తారాగణంతో పూర్తి కమర్షియల్ ఫార్మెట్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాను దసరాకు విడుదల చేస్తున్నాం. ఇది నార్నే నితిన్‌కు హ్యాట్రిక్ ఫిల్మ్ అవుతుంది' అని చెప్పారు.

ప్రేమోత్సవం



దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రమోషన్‌లో భాగంగా చిత్రంలోని 'మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' పాటను విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ గీతానికి అనూప్ రూబెన్స్ స్వరాలు అందించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలవుతుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య 9
కుటుంబ కదంబం
బుధవారం • 21 ఆగస్టు 2024





జీన్స్.. జాలీగా..

జీన్స్ డ్రస్సుల్లో ఉండే సౌకర్యం అంతా ఇంతా కాదు. ఎంచుకోడానికి వీలున్నన్ని మోడల్స్ జీన్స్‌లో ఉంటాయి. అలాగని కంటికి నచ్చింది కొనేసుకోకుండా, ట్రెండ్‌కు తగిన జీన్స్ డ్రెస్ ఎంచుకోవడం మీద దృష్టి పెట్టాలి.

జబర్దస్త్ జీన్స్ ప్యాంట్స్

టాంపర్డ్ జీన్స్: వెలసిపోయినట్టుండే జీన్స్ డైలీ వేర్‌గా బాగుంటాయి. వీటి మీదకు కార్డిగాన్స్ లేదా లాంగ్ టీష ర్ట్‌లను ధరించాలి. బూట్స్, స్పోర్ట్స్ షూస్, చేతికి పెద్ద డయల్ వాచ్ అందంగా ఉంటాయి. సెంటర్ ఆఫ్ ఎట్రా క్షన్ కావాలనుకుంటే హాజరయ్యే ప్రదేశాన్ని బట్టి జీన్స్ ఎంచుకోఎవాలి. జీన్స్ షర్ట్, టీ షర్ట్, క్రాప్ టాప్స్‌తో జీన్స్‌ను మ్యాచ్ చేయవచ్చు. అందమైన శరీరాకృతి కలిగి ఉండే అమ్మాయిలకు పెన్సిల్ కట్ జీన్స్ బాగుంటాయి. అయితే కురచగా కనిపించే అమ్మాయిలు బూట్‌కట్ జీన్స్‌ను ఎంచుకోకపోవడమే మేలు. బూట్‌కట్ జీన్స్‌కు స్కిన్ ఫిట్టింగ్ టాప్స్ బాగుంటాయి. ఈ జీన్స్‌కు మ్యాచింగ్‌గా పెన్సిల్ హీల్స్ ధరించాలి. సాదాసీదాగా కనిపించాలను కుంటే స్ట్రెయిట్ కట్ జీన్స్ ఎంచుకోవాలి. కాటన్ టాప్స్ మొదలు ఎలాంటి టాప్స్‌తోనైనా ఈ రకం జీన్స్‌ను మ్యాచ్ చేయవచ్చు. కాస్త ట్రెండీగా కనిపించాలనుకుంటే కలర్ ఫుల్ స్టోల్ ధరించాలి. బిగుతుగా ఉండే జీన్స్‌ను ఇష్టపడని వాళ్ల కోసం ఉద్దేశించినవే బాయ్‌ఫ్రెండ్ జీన్స్. వీటిని బూట్స్, హీల్స్‌తో మ్యాచ్ చేయవచ్చు.

జీన్స్ స్కర్ట్

ట్రెండీగా, మోడర్న్‌గా కనిపించాలనుకునే అమ్మాయిలు జీన్స్ స్కర్ట్స్‌ను ఎంచుకోవచ్చు. నీ లెంగ్త్, షార్ట్ లెంగ్త్ స్కర్టుల్లో పొడవుగా ఉండే అమ్మాయిలు షార్ట్ లెంగ్త్, కుర చగా ఉండే అమ్మాయిలు నీ లెంగ్త్ స్కర్ట్స్ వేసుకోవచ్చు. అలాగే ఎంబ్రాయిడరీ, సెక్విన్స్ కుట్టిన స్కర్ట్స్ ఈవినింగ్ పార్టీలకు బాగుంటాయి. ఈ రకం స్కర్ట్స్‌కు జోడీగా బూట్స్, స్పోర్ట్స్ షూస్ ధరించవచ్చు. చేతికి పెద్ద డయల్ వాచ్ బాగుంటుంది.

జీన్స్ టాప్స్

జీన్స్ మెటీరియల్‌తో తయారయ్యే టాప్స్, టైట్ ఫ్రాక్స్ ట్రెండీగా, స్టైలిష్‌గా ఉంటాయి. షికార్లకూ, సరదాలకూ తగినట్టు సౌకర్యంగా కూడా ఉంటాయి. ఫుల్ హ్యాండ్ టాప్ లేదా షర్ట్‌ను జీన్ ప్యాంట్‌తో, స్కర్ట్‌తో మ్యాచ్ చేయవచ్చు. ఫ్రాక్‌కు పెన్సిల్ హీల్ షూలు, బూట్స్ చక్కగా మ్యాచ్ అవుతాయి. సింపుల్ జ్యువెలరీ, యాక్సెసరీస్ ఈ రకం డ్రస్సులకు చాలా బాగా నప్పుతాయి.



భవనాలు కళాత్మకంగా..

భారతీయ చారిత్రక నిర్మాణాలకు కళాత్మక జీవం పోస్తోంది తెలంగాణాకు చెందిన మసూమా రిజ్వి. రాష్ట్రపతి భవనం నుంచి తాజాగా అయోధ్యలో ప్రారంభమైన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం వరకూ ఎన్నో సుప్రసిద్ధ కట్టడాలకు ఇంటీరియర్ డెకరేషన్ చేసిన మసూమా గురించిన మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు.

ప్రదేశాలకు కొత్త కళను తెచ్చిపెట్టగలిగే నైపుణ్యం తనకుందని మసూమా రిజ్వీకి చిన్నప్పుడే తెలుసు. బాల్యంలో తన డాల్ హౌస్‌తో ఆడుకోకుండా, దాని గోడలను కత్తిరించి, దాన్లోని ఫర్నిచర్‌ను సర్ది, కంటికింపుగా అలంకరిస్తూ ఉండేది. అదే మక్కువ ఆమెతో పాటే పెరిగి, ఆమెను ఆర్కిటెక్ట్, ఆర్టిస్ట్, మ్యూజియాలజిస్ట్, వ్యాపారవేత్తగా భారతీయ చారిత్రక నిర్మాణలను ఆకట్టుకునేలా అలంకరించే స్థాయికి ఎదిగేలా చేసింది. ఆమె కళాత్మకత.. మానెక్ షా సెంటర్‌లోని కొత్త పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి భవనంతో పాటు తాజాగా ప్రారంభమైన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం ఇంటీరియర్‌లో సైతం ప్రతిబింబిస్తోంది. ఈ 55 ఏళ్ల వ్యాపారవేత్త బెలీటా డిజైన్స్ పేరుతో తన కళాత్మక వృత్తిని పెంపొందించుకుని దేశం గుర్తించే స్థాయికి చేరుకోవడం విశేషం.

మూలాలు బాల్యంలోనే...

తండ్రి ఆర్మీ అధికారి కావడంతో, తెలంగాణాకు చెందిన మసూమా రిజ్వీ కుటుంబం దేశమంతా విస్తృతంగా పర్యటించింది. అమెరికాలో ఉండే తన తాతయ్య దగ్గర రిజ్వీ ఎక్కువ కాలం పెరిగింది. "మేమెప్పుడూ దూర ప్రాంతాలు ప్రయాణిస్తూనే ఉండేవాళ్లం. కాబట్టి నేను కొత్త ప్రదేశాలకు, ప్రజలకూ తేలికగా అలవాటు పడిపోతూ ఉంటాను. ఆ స్వభావం నాకెంతో ప్రయోజనకరంగా మారింది. చిన్నప్పటి ఆసక్తి, కొత్త ప్రదేశాలు, సంస్కృతుల ప్రత్యేకతలు నాలోని కళాత్మకతకు దన్నుగా మారాయి. అందమైన కళాకృతులను సృష్టించాలనే తపన నాతో పాటే పెరిగింది. దాంతో నేను ఆర్టిస్టుగా స్థిరపడాలని నిర్ణయించుకుని ఆ విషయాన్ని నా తల్లితండ్రులతో చెప్పాను. అప్పుడు వాళ్లు, నువ్వు చదువులో రాణిస్తున్నావు కాబట్టి సైన్స్‌లో ఉన్నత చదువులు చదువు. కళాకారిణిగా స్థిరపడడమెందుకు? అని నన్ను ఎదురు ప్రశ్నించారు. వాళ్ల మాటలతో నాకొక విషయం స్పష్టమైపోయింది. మంచి విద్యార్థిగా రాణిస్తే, తప్పనిసరిగా ఏ డాక్టరో, ఇంజనీరో అయి తీరాలి అని నాకు అర్థమైపోయింది. కానీ నా ఆలోచన వేరు. జీవితంలో మనం అనుకున్న అనుకున్న సమయానికి జరగకపోవచ్చు. కానీ మన కలలు నిజమయ్యే సమయం భవిష్యత్తులో మన కోసం వేచి ఉంటుందనడానికి నా జీవితమే ఒక ఉదాహరణ.

> **కలామ్ మన్ననలతో....**
>
> రాష్ట్రపతి భవనం లాంటి ప్రతిష్ఠాత్మక నిర్మాణాల అలంకరణ గురించి ప్రస్తావిస్తూ... "నేను రాష్ట్రపతి భవన్ కోసం పని చేస్తున్న సమయంలో అబ్దుల్ కలామ్ భారత రాష్ట్రపతిగా ఉండేవారు. ఆయన ఆ భవనంలో ఒక వెదురిల్లు నిర్మించడం కోసం కళాకారుల నుండి డిజైన్లను ఆహ్వానించారు. కానీ అందర్లోకీ నేను రూపొందిన అత్యంత సరళమైన డిజైన్ ఆయనను ఆకట్టుకుంది. అలా ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ కట్టడాలను డిజైన్ చేసే నా ప్రయాణం మొదలైంది. కలామ్ గారి అభీష్టం మేరకు ఈశాన్య భారతదేశం నుంచి కళాకారులను పిలిపించి, పర్యావరణహితమైన వెదురింటిని నిర్మించి, రంగులతో ఆకర్షణీయంగా మలిచాను. ఆ వెదురిల్లు కలామ్ గారికి ఎంతో బాగా నచ్చింది. అప్పటి నుంచి నాకు హైప్రొఫైల్ ఆఫర్లు రావడం మొదలుపెట్టాయి" అంటూ కలామ్‌తో తన పరిచయం గురించిన విశేషాలను పంచుకుంది రిజ్వీ.



అందర్నీ మెప్పించి...

అప్పుడు నాకు 18 ఏళ్లు. ఆ వయసులో నేను ప్రేమలో పడ్డాను. అంత చిన్న వయసులోనే పెళ్లి కూడా చేసేసుకున్నాను. అప్పుడు మా అమ్మ, ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటానని నా చేత ప్రమాణం చేయించుకుంది. దాంతో నేను అయిష్టంగానే సైన్స్‌ను స్వీకరించక తప్పలేదు. కానీ నా భవిష్యత్తు ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్‌లో ఉందని నా మనసుకు తెలుసు. చివరకు ఎలాగైతేనేం నాకు నచ్చిన ఆర్కిటెక్చర్‌లోకి అడుగు పెట్టాను. కానీ ఈ రంగంలో మహిళలకు అవకాశాలు తక్కువ. వృత్తిలోకి అడుగు పెట్టిన కొత్తలో, 'ప్రధాన ఆర్కిటెక్ట్ ఎక్కడ?' అని అడిగినప్పుడు, "అది నేనే" అని అనడం, వచ్చిన వాళ్ల నిరాశగా, నిరాసక్తంగా నన్ను చూడడం, చివరకు ప్రెజెంటేషన్ ఇచ్చేటప్పుడు కూడా, నేను వివరిస్తున్నది వాళ్లకు అర్థం కాకపోవడం లాంటివి జరిగాయి. అయితే నా కెరీర్‌కు ఇవేవీ అవరోధాలు కాకుండా జాగ్రత్తపడ్డాను" అంటూ తన అనుభవాల గురించి వివరిస్తోంది రిజ్వీ. తండ్రి, భర్తలతో కలిసి ఆర్మీ ఆఫీసులకూ, ప్రభుత్వ భవనాలకూ వెళ్లినప్పుడు, ఆకర్షణ లోపించిన ఆ నిర్మాణాలను, నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయేది. "ఆ ప్రదేశాలను చూడగానే, వాటిని అందగా తీర్చిదిద్దాలని అనిపించేది. అలా నేను ఆర్మీ మెస్సులు, మ్యూజియంలకు మెరుగులు దిద్దడంతో నా కెరీర్‌ను ప్రారంభించాను. క్రమేపీ నా పనికి గుర్తింపు పెరిగింది. ప్రస్తుతం నా కళాత్మకతకు క్యాన్వాసులుగా మారి, కొత్త రూపాలను సంతరించుకున్న నిర్మాణాల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోయింది" అంటూ తన కళాత్మక ప్రయాణం గురించి వివరించింది రిజ్వీ.

బాల్య జ్ఞాపకాలే దన్నుగా...

బాల్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న మ్యూజియాలెన్నిటినో రిజ్వీ సందర్శించింది. సందర్శకులను కట్టిపడేసే అక్కడి డిజైన్లు, సాంకేతికతలు రిజ్వీని కూడా ఆకట్టుకున్నాయి. ఆర్ట్ క్యూరేటర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టిన కొత్తలో, చిన్ననాటి జ్ఞాపకాలన్నిటినీ ఆమె తన పనిలో ప్రదర్శించడం మొదలుపెట్టింది. "భారత ప్రభుత్వం, ప్రతి ప్రభుత్వం నిర్మాణంలో ఒక్క శాతం కళాకృతులను తప్పనిసరి చేయడం హర్షణీయం. ఈ మార్పు కోసం నేనెంతో కాలంగా పోరాడుతున్నాను. సందర్శకులు ఆసక్తి కోల్పోకుండా ఉండడం కోసం మ్యూజియాలు, వారసత్వ సంపదలు, స్మారక స్థూపాలు, చిహ్నాలకు సరికొత్త సాంకేతికత సహాయంతో కొత్త హంగులు జోడించడం అవసరం. అందు కోసం కృత్రిమ మేథస్సు, సైన్స్‌లను ఉపయోగించుకోవాలి" అంటూ చెప్పుకొచ్చిన రిజ్వీ ప్రస్తుతం దాదాపు 300 సంప్రదాయ హస్త కళాకారులతో కలిసి పని చేస్తూ, సంప్రదాయ హస్తకళలను పరిరక్షణ కోసం కృషి చేస్తోంది.

మార్పు ఛాంపియన్

అడుగడుగునా ఆంక్షలతో, నిషేధాలతో... ఇంటికే పరిమితమైన మారుమూల గ్రామీణ బాలికలను క్రీడా మైదానాల్లోకి తీసుకురావడానికి పెద్ద పోరాటమే చేశారు దియా మజుందార్. ఆమె ప్రయత్నం ఆ పిల్లల జీవితాల్లోనే కాదు, పెద్దల ఆలోచనల్లోనూ మార్పునకు నాంది పలికింది. దియా ప్రోత్సాహంతో ఇప్పుడు ఎందరో పిల్లలు వాలీబాల్‌లో రాణిస్తున్నారు, ఛాంపియన్లుగా నిలుస్తున్నారు.



"మహిళలు ఎన్నో రంగాల్లో అత్యున్నత స్థాయికి చేరుకుంటున్నా, గొప్ప విజయాలు సాధిస్తున్నా... వారి పట్ల సమాజం కనబరిచే ధోరణుల్లో ఇప్పటికీ పెద్దగా మార్పు లేదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో అమ్మాయిలు ఎన్నో ఆంక్షల మధ్య బతకాల్సి వస్తోంది. క్రీడల్లో ఆడపిల్లలకు కనీస ప్రోత్సాహమైనా ఉండదు. ఒక క్రీడాకారిణిగా, కోచ్‌గా ఒడిశాలోని ఢెంకనల్ జిల్లాలోని గ్రామాల పరిస్థితి నన్ను తీవ్ర ఆవేదనకు గురి చేసింది. నేను పుట్టింది, పెరిగింది పశ్చిమబెంగాల్‌లోని బంకురా సిటీలో. చిన్న వయసు నుంచి ఆటలంటే ఇష్టం. హైస్కూల్లో చదువుతున్నప్పుడు వాలీబాల్ మీద ఆసక్తి ఏర్పడింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాను. కోచ్‌గా శిక్షణ పొంది... 'వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' నుంచి సర్టిఫికెట్ పొందాను. కోచ్‌గా కెరీర్ ప్రారంభించాలనుకుంటున్న సమయంలో... ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్‌కు చెందిన అశుతోష్ పాత్రాతో నా వివాహం జరిగింది. నాలుగేళ్ళ క్రితం... 2020లో నా భర్తకు గిరిజన ప్రాంతమైన ఢెంకనల్‌కు బదిలీ అయింది.

'అది జరగని పని' అన్నారు...

క్రీడాకారిణిగా... ఫిట్‌నెస్‌కు నేను ఎంతో ప్రాధాన్యత ఇస్తాను. మా ఇంటి ఆవరణలో రోజూ వ్యాయామంతో పాటు వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తూ ఉండేదాన్ని. చుట్టుపక్కల ఉన్న పిల్లలు నన్ను విచిత్రంగా చూసేవారు.



దానికి కారణం స్థానికంగా పాతుకుపోయిన కట్టుబాట్లే. అక్కడ ఆడపిల్లల జీవితాలు ఇంటి నాలుగు గోడలకే పరిమితం. బడికి వెళ్ళేవారి సంఖ్య కూడా తక్కువే. అమ్మాయిలు వీధుల్లోకి వచ్చి ఆటలు ఆడడం అనేది ఊహించలేని విషయం. మారుతున్న ప్రపంచానికి ఎంతో దూరంగా ఉన్న ఆ పిల్లల జీవితాల్లో క్రీడల ద్వారా మార్పు తేవాలని అనుకున్నాను. స్థానిక పాఠశాలలోని టీచర్‌తో నా ఆలోచనలు పంచుకున్నాను. "మీరేం మాట్లాడుతున్నారో అర్థం అవుతోందా? ఈ పల్లెటూరి అమ్మాయిలను వాలీబాల్ కోర్టుకు తీసుకురావడమా? అది జరగని పని. ఇక్కడ ప్రజలు కట్టుబాట్ల కోసం ప్రాణాలైనా ఇస్తారు. ఒక వయసు వచ్చాక ఆడపిల్లలను స్కూలుకు పంపడానికే ఇష్టపడరు" అన్నారావిడ. "ఆ పిల్లల తల్లితండ్రులను ఎలాగైనా ఒప్పిస్తాను. అయితే నాకు ఒడియా అంతగా రాదు. అందుకు మీ సాయం కావాలి" అని అడిగాను. ఆ టీచర్ కాస్త అయిష్టంగానే 'సరే'నన్నారు.

ఎంతో శ్రమపడ్డా...

ముందుగా ఆ స్కూల్‌లో చదివే అమ్మాయిలతో మాట్లాడాను. చాలామంది "క్రీడలంటే మాకు ఇష్టమే. కానీ మా ఇంట్లో ఒప్పుకోరు" అని చెప్పారు. దాంతో ఆ పిల్లల ఇళ్ళకు నేను, ఆ టీచర్ వెళ్ళాం. తల్లితండ్రులతో మాట్లాడాం. దాదాపు అందరూ ఎగతాళి చేశారు. "మీరు ఎక్కడి నుంచో వచ్చారు. ఇక్కడి పరిస్థితులు మీకు తెలియవు. మీ పని మీరు చూసుకుంటే మంచిది" అన్నారు. ఇతర పాఠశాలల అమ్మాయిల కుటుంబాలను కూడా కలుసుకున్నాను. ప్రతిచోటా స్పందన ఒకేలా ఉంది. అయినా నేను పట్టువదలలేదు. రెండు నెలల పాటు అదే పనిగా ప్రయత్నించాను. చదువుతోపాటు క్రీడల ప్రాధాన్యత గురించి, శారీరకంగా, మానసికంగా బాలికల ఎదుగుదలలో వాటి పాత్ర గురించి ఓపికగా వివరించాను. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తానని భరోసా ఇచ్చాను. చివరకు కొందరు తల్లితండ్రులు అంగీకరించారు. అలా... మూడేళ్ళ కిందట అయిదారుగురికి శిక్షణ ప్రారంభించాను. రోజూ వారి తల్లితండ్రులు కూడా మైదానానికి వచ్చేవారు. క్రమంగా వారికి నా మీద నమ్మకం కుదిరింది. శిక్షణకు వచ్చే పిల్లల సంఖ్య కూడా పెరిగింది. కానీ హాఫ్ ప్యాంట్ వేసుకోవడానికి సిగ్గుపడేవారు. సల్వార్ కమీజ్ వేసుకొనేవారు. ప్రాక్టీస్ సమయంలో ఇబ్బందిపడేవారు. క్రీడలకు అనుకూలంగా ఉండేలా దుస్తులు వేసుకోవాలని పిల్లలను, వారి కుటుంబ సభ్యులను ఒప్పించడానికి ఎంతో శ్రమపడ్డాను.

బలమైన ఆ జట్టును ఓడించి...

నా దగ్గర శిక్షణ తీసుకున్న తొలి బృందం పాఠశాల స్థాయి పోటీల్లో గెలవడం, వారి గురించి పత్రికల్లో రావడంతో... తమ పిల్లలను కూడా వాలీబాల్ శిక్షణకు పంపించాలన్న ఆలోచన ఇతరులలోనూ కలిగింది. క్రమంగా పిల్లల సంఖ్య పెరిగింది. ఇప్పటివరకూ ఢెంకనల్ జిల్లాలోని పలు గ్రామాల్లో 130 మందికి పైగా బాలికలు నా దగ్గర శిక్షణ పొందారు. అందరికీ ఉచితంగానే శిక్షణ ఇస్తున్నాను. ఒకప్పుడు వాలీబాల్ అంటే తెలియని ఆ జిల్లా... 14 ఏళ్ళలోపు బాలికల విభాగంలో రాష్ట్రంలోనే ఛాంపియన్‌గా నిలిచింది. అది కూడా అత్యంత బలమైన కేంద్రపడ జిల్లా జట్టును 2-0 తేడాతో ఓడించింది. నా దగ్గర శిక్షణ పొందిన వారిలో 45 మంది రాష్ట్ర స్థాయి మ్యాచుల్లో రాణించారు. ఏడుగురు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ముఖ్యంగా ఆ పిల్లలందరిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రపంచాన్ని చూసే దృక్పథం మారింది. బిడియంగా ఉండే ఆ అమ్మాయిలు ఇప్పుడు వాలీబాల్ కోర్టులో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తున్నారు. తమ తల్లితండ్రులకు గర్వకారణంగా నిలుస్తున్నారు. కుమార్తెలను ఇంటి పనులకే పరిమితం చేస్తున్న ఎన్నో కుటుంబాలకు ఈ పిల్లల విజయాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశిస్తున్నాను. వాలీబాల్‌లో ఆడపిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలన్నది నా కల. అది నెరవేరడానికి నా భర్త అశుతోష్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు."



వివాహం విజయవంతమవ్వాలంటే..

విజయవంతమైన వైవాహిక సంబంధానికి అవసరమైన పాళ్లేవిఎటి? చాలా మంది జంటలకు ఎదురయ్యే ప్రశ్న ఇది. మానసిక శాస్త్రవేత్తలు వివరిస్తున్న ఈ పాళ్లేమిటో చూద్దాం..

1 ఆరోగ్యకరమైన సరిహద్దులు..

ప్రతి వ్యక్తికి కొన్ని వ్యక్తిగతమైన విషయాలు.. ఆలోచనలు ఉంటాయి. ఆ విషయాలలోకి చొచ్చుకురానంత వరకు ఎటువంటి సమస్యలు రావు. ప్రతి వ్యక్తి తన భాగస్వామికి సంబంధించిన ప్రైవసీని గౌరవించాలి. ఆ ప్రైవసీ హద్దులను దాటకూడదు. దాటితే సమస్యలు ఎదురవుతాయి.

2 ఆలంబన

ఆడ, మగ అనే తేడా లేకుండా అందరికీ జీవితంలో ఎదగాలనే ఆశ ఉంటుంది. కొన్ని లక్ష్యాలు ఉంటాయి. ఆ లక్ష్యాలను చేరుకోవటానికి సాయపడే వారి కోసం వారు ఎదురుచూస్తూ ఉంటారు. తన భాగస్వామికి ఏం కావాలో తెలుసుకొని- ఆ లక్ష్యాన్ని చేరుకోవటంలో వారికి సాయపడినప్పుడు మంచి అనుబంధం ఏర్పడుతుంది.

3 అభిప్రాయాల కలయిక..

ఏ ఇద్దరు ఒకలా ఉండరు. అభిప్రాయాలు కూడా వేర్వేరుగా ఉండవచ్చు. కానీ వైవాహిక జీవితం ఆనందంగా ఉండాలంటే- ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవాలి. హాబీలను పంచుకోవాలి. ఇలా కొద్ది కాలం ప్రయాణం చేస్తే- ఒకరిపై మరొకరికి భరోసా ఏర్పడుతుంది. ఆనందంగా జీవించగలుగుతారు.

4 విలువల పందిరి

రెండు కుటుంబాల నుంచి వచ్చిన వారికి వేర్వేరు విలువలు.. జీవన శైలి ఉండే అవకాశముంది. అయితే మౌలిక భావనలు ఒకటే అయినప్పుడు వాటిని గుర్తించి ఆచరిస్తే- అనుబంధం బలపడుతుంది.

5 మార్పు అవసరం

ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోవటం.. వాటిని గౌరవించటం చాలా కష్టమైన విషయం. వివాహ బంధంలో - ఒకరి అభిప్రాయాలు మరొకరికి నచ్చకపోవచ్చు. కానీ తమ అవసరమైన తమ అభిప్రాయాన్ని మార్చుకొనే పరిణితి ఉండాలి. అభిప్రాయబేధాలు వచ్చినప్పుడు వాటిని అధిగమించటానికి ప్రయత్నించాలి. మొత్తం వివాహబంధాన్నే వదిలేసి పారిపోకూడదు.

6 సుఖాలే కాదు కష్టాలు కూడా

వివాహబంధంలో నవ్వులే కాదు.. విషాదాలు ఉంటాయి. సరదాలే కాదు. సమస్యలు ఉంటాయి. సమస్యలు ఎదురయినప్పుడు- వాటిని అధిగమించటానికి ఒకరితో మరొకరు మనసు విప్పి మాట్లాడుకోగలగాలి. ఆ స్వేచ్ఛ ఉన్నప్పుడే వివాహబంధం బలోపేతమవుతుంది.

7 స్నేహితులుగా మారండి..

భార్య, భర్తలనగానే కుటుంబం పట్ల.. సమాజం పట్ల తమకు ఉన్న బాధ్యతలు గుర్తుకు వస్తాయి. ఈ బాధ్యతల ఒత్తిడిలో సమస్యలే ఎక్కువగా కనిపిస్తూ ఉండచ్చు. అందువల్ల భార్యభర్తలు ముందు ఒకరితో మరొకరు అన్నీ పంచుకొనే స్నేహితులుగా మారాలి. ఆ తర్వాతే సహచరులు అవ్వాలి.

8 ప్రాధమ్యాలు..

ఆధునిక జీవితంలో అందరూ చాలా బిజీగా ఉండారు. అలాంటి బిజీ షెడ్యూల్స్‌లో కూడా భాగస్వామికి తగిన సమయం కేటాయించాలి. పనితో పాటుగా వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే వివాహబంధం బలపడుతుంది.



ఒకే ఓవర్‌లో 39 పరుగులు

సమోవా బ్యాటర్ విస్సెర్ అరుదైన రికార్డు

ఏపియా (సమోవా): ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లతో 36 పరుగులు అంటే వావ్.. అనుకుంటాం. కానీ ఏకంగా 39 పరుగులు సాధిస్తే. సంచలనమే కదా! టీ20 వరల్డ్ కప్ 2026 క్వాలిఫయర్ (ఈస్ట్ ఆసియా-పసిఫిక్ సబ్ రీజియన్)లో భాగంగా సమోవా-వనువాటు జట్ల మధ్య మ్యాచ్‌లో ఈ వరల్డ్ రికార్డు నమోదైంది. సమోవా బ్యాటర్ డేరియస్ విస్సెర్ తమ ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి 6, 6, 6, నోబ్, 6, 0, నోబ్, నోబ్+6, 6తో అదరగొట్టాడు. దీంతో ఇప్పటి దాకా టీ20ల్లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగుల (36) రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. మొత్తంగా ఈ మ్యాచ్‌లో విస్సెర్ 5 ఫోర్లు, 14 సిక్సర్లతో 132 (62 బంతుల్లో) పరుగులు సాధించి జట్టు విజయానికి కూడా కారణమయ్యాడు. మ్యాచ్‌లో సమోవా జట్టు 10 పరుగుల తేడాతో గెలిచింది. మొదట సమోవా.. డేరియస్ సూపర్ ఇన్నింగ్స్‌తో 20 ఓవర్లలో 174 పరుగులు చేయగా.. వనువాటు జట్టు 20 ఓవర్లలో 164/9 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. ఇక, సమోవా తరఫున తొలి టీ20 సెంచరీ నమోదు చేసిన బ్యాటర్‌గానూ నిలిచాడు. మరోవైపు గతంలో ఐదుసార్లు ఒకే ఓవర్‌లో 36 పరుగుల రికార్డు నమోదైంది. 2007 టీ20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌పై యువరాజ్ వరుసగా ఆరు సిక్సర్లతో తొలిసారి ఈ సూపర్ ఫీట్ సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పొలార్డ్, దీపేంద్ర సింగ్ (నేపాల్) కూడా ఇలాగే ఆరు సిక్సర్లతో ఈ ఫీట్ నమోదు చేశారు. ఇక నికోలస్ పూరన్‌తో పాటు రోహిత్, రింకూ కలిసి ఒకే ఓవర్‌లో మొత్తంగా ఇన్నేసి పరుగులు సాధించిన జాబితాలో ఉన్నారు.



జాక్‌పాట్

ఐపీఎల్‌తో రూ.5,210 కోట్లు

గతేడాది బీసీసీఐ లాభం ఇది

2022తో పోలిస్తే 116 శాతం పెరుగుదల

ముంబై: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత సంపన్న బోర్డుగా కొనసాగుతున్న భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) ఖజానా.. ఐపీఎల్‌తో మరింత కళకళలాడుతోంది. ఇతర దేశాల బోర్డులకు కన్ను కుట్టే రీతిలో 2023 సీజన్‌కుగాను బీసీసీఐకి ఏకంగా రూ. 5,210 కోట్ల లాభాన్ని ఐపీఎల్ అందించింది. ఇది పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వార్షిక ఆదాయంకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ కావడం విశేషం. అలాగే 2022 సీజన్‌తో పోలిస్తే ఈసారి 116 శాతం పెరుగుదల కనిపించిందని బోర్డు తమ వార్షిక నివేదికలో పేర్కొంది. దీనిప్రకారం ఐపీఎల్ 2023 సీజన్‌లో మొత్తంగా రూ. 11,769 కోట్ల ఆదాయం రాగా.. 2022తో పోలిస్తే ఇది 78శాతం అధికం కావడం విశేషం. మరోవైపు ఖర్చులు కూడా 68 శాతం పెరుగుదలతో రూ. 6,648 కోట్లకు చేరాయి. ఇక, 2023-27 కాలానికి బోర్డు రూ. 48,390 కోట్లతో మీడియా హక్కుల ఒప్పందం కుదుర్చుకోవడం కూడా ఈ అధిక లాభాలకు కారణంగా చెప్పవచ్చు. ఇందులో డిస్నీ స్టార్ గ్రూప్ రూ. 23,575 కోట్లతో టీవీ రైట్స్ తీసుకోగా, జియో సినిమా రూ. 23,758 కోట్లతో డిజిటల్ హక్కులను కొనుగోలు చేసింది. అలాగే ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను టాటా సన్స్ రూ. 2500 కోట్లకు తీసుకోవడం గమనార్హం. గతేడాది ఆరంభమైన మహిళల ప్రీమియర్ లీగ్ కూడా బీసీసీఐకి రూ. 377 కోట్ల మిగులు సంపాదనను తీసుకువచ్చింది. ఇలా, లీగ్‌లతో బీసీసీఐ తన ఆదాయాన్ని రోజురోజుకూ పెంచుకుంటూ ముందుకెళుతోంది.

నెలాఖరులోగా రిటెన్షన్ రూల్‌పై స్పష్టత

వచ్చే ఏడాది ఐపీఎల్ మెగా వేలం జరుగబోతోంది. దీనికంటే ముందే ఫ్రాంచైజీలన్నీ ఆటగాళ్ల రిటెన్షన్ పాలసీ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాయి. ఈనెలాఖరులోగా బీసీసీఐ ఈ విషయంలో స్పష్టతనిచ్చే అవకాశం ఉందని సమాచారం. అయితే లీగ్‌లోని ప్రతీ జట్టు రైట్ టు మ్యాచ్ ఆప్షన్‌తో కలిపి ఆరుగురిని అట్టిపెట్టుకునేందుకు అనుమతించే ఆలోచనలో ఉంది. వేలానికి ముందే ఆయా జట్లు తమ ఆటగాళ్లను మార్చుకోవడాన్ని రైట్ టు మ్యాచ్ అని పిలుస్తుంటారు. కొన్ని ఫ్రాంచైజీలు అసలు మెగా వేలమే వద్దని బోర్డును కోరినట్టు తెలుస్తోంది. అయితే ఇందుకు బీసీసీఐ మాత్రం సుముఖంగా లేదు.



హోటల్‌లో సర్వర్‌గా ఒలింపిక్ పతక విజేత!

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన తర్వాత పోడియంపై నిల్చొని అమాయకంగా పతకాన్ని ముద్దాడిన వీడియోతో వైరల్ అయిన 18 ఏళ్ల చైనా జిమ్నాస్ట్ ఝౌ యాకిన్.. మరోసారి నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. తాజాగా ఒలింపిక్ యూనిఫాంలో ఓ రెస్టారెంట్‌లో సర్వ్ చేస్తున్న ఆమె వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. హెంగ్‌యాంగ్ సిటీలో 'ఫ్యాట్ బ్రదర్' పేరుతో యాకిన్ తల్లిదండ్రులు రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నారు. దీంతో విశ్వక్రీడలు ముగిసిన తర్వాత ఇంటి చేరుకున్న యాకిన్ తల్లిదండ్రులకు సహాయంగా కస్టమర్లకు సర్వ్ చేస్తోంది. ఇలా.. ఆటను, కుటుంబ బాధ్యతలను చక్కగా బ్యాలెన్స్ చేస్తోన్న యాకిన్‌పై నెట్టింట ప్రశంసల వర్షం కురుస్తోంది. పారిస్ క్రీడల్లో బ్యాలెన్సింగ్ బీమ్‌లో దిగ్గజం సిమోన్ బైల్స్ లాంటి వారితో పోటీపడి యాకిన్ రెండో స్థానంలో నిలిచింది. పతక ప్రదానం సందర్భంగా స్వర్ణం, కాంస్యం గెలిచిన ఇటలీ జిమ్నాస్ట్‌లు అలీస్ డిమాంటో, మనీలా ఎస్పోసిటోలు పతకాన్ని కొరికి సందడి చేస్తుంటే.. ఆశ్చర్యంగా వారివైపు చూసిన యాకిన్, పతక విజేతలు ఇలాగే చేయాలేమో అనుకొని పతకం నోటి దగ్గర పెట్టుకొని ఫొటోలకు ఫోజులివ్వడం అందరినీ ఆకట్టుకుంది.

బంగ్లా నుంచి యూఏఈకి

మహిళల టీ20 ప్రపంచ కప్ వేదిక మార్పు

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచకప్ వేదికపై సందిగ్ధతకు తెరపడింది. ఈ మెగా ఈవెంట్‌ను బంగ్లాదేశ్ నుంచి యూఏఈకి తరలిస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 3 నుంచి 20 వరకు వరల్డ్ కప్ బంగ్లాదేశ్‌లో జరగాలి. కానీ, అక్కడ రాజకీయ అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో వేదిక తరలింపుపై కొన్నిరోజులుగా ఐసీసీ మల్లగుల్లాలు పడుతున్న సంగతి తెలిసిందే. ఓ దశలో టోర్నీ నిర్వహణ కోసం భారత్‌ను ఐసీసీ సంప్రదించినా, బీసీసీఐ అందుకు ఒప్పుకోలేదు. ఇక, ఆతిథ్యానికి తాము సిద్ధమంటూ జింబాబ్వే క్రికెట్ బోర్డు ముందుకొచ్చినా, ఐసీసీ మాత్రం చివరకు యూఏఈనే ఎంపిక చేసింది.



రాజకీయాల్లోకి వినేశ్?

సోదరి బబితపై పోటీ!

చండీగఢ్: అధిక బరువు కారణంగా ఒలింపిక్స్ పతకానికి దూరమైన రెజ్లర్ వినేశ్ ఫొగట్ దృష్టి ఇప్పుడు రాజకీయాలపై పడిందనే కథనాలు వినిపిస్తున్నాయి. అనర్హతకు గురైన వెంటనే వినేశ్ ఆటకు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. త్వరలో జరుగబోయే హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె బరిలోకి దిగే అవకాశం లేకపోలేదని సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా వరుసకు తన సోదరైన మాజీ రెజ్లర్ బబితా ఫొగట్‌పై పోటీకి దిగనుందనే వార్తలు కూడా చక్కర్లు కొడుతున్నాయి. 'రాజకీయాల్లోకి వినేశ్ ఎందుకు రాకూడదు? కొన్ని పార్టీలు ఇప్పటికే ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఏ పార్టీలో చేరనుందనే విషయంలో ప్రస్తుతానికి స్పష్టత లేదు. అయితే, హరియాణా ఎన్నికల్లో వినేశ్ వర్సెస్ బబితా పోటీ కూడా ఉండవచ్చు' అని వినేశ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరోవైపు వినేశ్ భారత్‌కు చేరుకున్న సమయంలో ఎయిర్‌పోర్ట్ వద్ద కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా అంతా తానై స్వాగత ఏర్పాట్లు చేశాడు. ఇక బబితా ఫొగట్ బీజేపీ తరఫున 2019లో దాద్రి స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయింది.

గుకేష్, ప్రజ్ఞానందకు డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్యూఫీల్డ్ చెస్ కప్‌ను భారత యువ గ్రాండ్ మాస్టర్లు గుకేష్, ప్రజ్ఞానంద డ్రాలతో ఆరంభించారు. తొలి రౌండ్‌లో వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో గుకేష్.. నోడిర్‌బెక్ అబ్దుస్తరోవక్ (ఉజ్బెకిస్థాన్)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నారు.



'పికిల్‌బాల్'లో సమంత

చెన్నై జట్టును దక్కించుకున్న నటి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ (డబ్ల్యూపీబీఎల్)లో పోటీ పడే చెన్నై జట్టును టాలీవుడ్ నటి సమంత దక్కించుకుంది. సోమవారం ముంబైలో జరిగిన వేలంలో సమంత చెన్నై జట్టును సొంతం చేసుకున్నట్టు డబ్ల్యూపీబీఎల్ ప్రకటించింది. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ.. పికిల్‌బాల్ ఆటను చూసిన తొలిసారే దాంతో ప్రేమలో పడ్డానని చెప్పింది. 'దేశీయ క్రీడారంగంలో ఎక్కువ మంది మహిళలను భాగం చేయాలనేది నా లక్ష్యం. ఇందుకోసం డబ్ల్యూపీబీఎల్‌తో కలిసి పనిచేస్తా' అని సమంత తెలిపింది.



రేసింగ్ లీగ్ కౌంట్‌డౌన్ షురూ

24 నుంచి చెన్నైలో ఐఆర్ఎల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎఫ్ఐఏ ఫార్ములా-4 ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్)కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. వచ్చే శనివారం నుంచి చెన్నై వేదికగా ఈ రేసింగ్ పోటీలు జరగనున్నాయి. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ సహా మొత్తం ఆరు దేశీయ జట్లు ఇందులో తలపడనున్నాయి. హైదరాబాద్ జట్టు యజమాని, టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య లీగ్ ప్రారంభ వేడుకల్లో పాల్గొననున్నాడు. చైతూతో పాటు ఇతరజట్ల యజమానులైన టీమిండియా మాజీ కెప్టెన్ గంగూలీ, బాలీవుడ్ నటులు అర్జున్ కపూర్, జాన్ అబ్రహాం వేడుకలకు హాజరవనున్నారు.

ఆసియా బ్యాడ్మింటన్ సారథిగా జ్ఞానదత్తు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ఐదుగురు తెలంగాణ, ఇద్దరు ఆంధ్ర షట్లర్లు అర్హత సాధించారు. చైనాలో గురువారం నుంచి జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనే భారత బృందానికి తెలంగాణ షట్లర్ జ్ఞానదత్తు సారథ్యం వహించనున్నాడు. బాలుర సింగిల్స్ అండర్-17లో జ్ఞానదత్తు, అండర్-15లో శశాంక్, అండర్-15 డబుల్స్‌లో రాహుల్ (ఆంధ్ర), బాలికల అండర్-17లో తన్వీ రెడ్డి, దుర్గ (ఆంధ్ర), మిక్స్‌డ్ అండర్-17లో శౌర్య కిరణ్-కీర్తి బరిలోకి దిగనున్నారు.

ప్రపంచ షూటింగ్‌కు ముఖేష్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వచ్చేనెల 26 నుంచి పెరూలో జరగనున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ ఎంపికయ్యాడు. జాతీయ షూటింగ్ సమాఖ్య ప్రకటించిన భారత క్రీడాకారుల బృందంలో ముఖేష్‌తో పాటు మైలవరం షూటర్ మద్దినేని ఉమామహేష్‌కు చోటు లభించింది. జాతీయ స్థాయిలో జరిగిన షూటింగ్ ట్రయల్స్‌లో ముఖేష్ సత్తా చాటి, ఏకంగా ఒకే చాంపియన్‌షిప్‌లో ఆరు విభాగాల్లో పోటీ పడేందుకు అర్హత సాధించాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, టీమ్ విభాగం, 25 మీ., ర్యాపిడ్ ఫైర్ పిస్టల్, స్పోర్ట్స్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్, 50 మీటర్ల పిస్టల్ కేటగిరీలో ముఖేష్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. తొలుత గుంటూరులోని సుబ్రమణ్యేశ్వర రావు వద్ద శిక్షణ తీసుకున్న ముఖేష్ ప్రస్తుతం గగన్ నారంగ్ గన్ ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో సాధన చేస్తున్నాడు.

కాంస్యపోరుకు రోనక్, సాయినాథ్

అమ్మాన్ (జోర్డాన్): భారత యువ రెజ్లర్లు రోనక్ దహియా (110 కిలోలు), పార్థీ సాయినాథ్ (51 కిలోలు) అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక పోరులో నిలిచారు. సెమీస్‌లో రోనక్ 0-2తో జొల్లాన్ జాకో చేతిలో ఓడాడు. దీంతో రోనక్ కాంస్య పతక పోరులో ఎమురుల్లాతో తలపడతాడు. తొలిరౌండ్లో సాయినాథ్ 1-5తో తుషాన్ చేతిలో ఓడాడు. తుషాన్ ఫైనల్ చేరడంతో సాయినాథ్‌కు రెపిచేజ్ రౌండ్ చాన్స్ దక్కింది. దీంతో కాంస్యంకోసం డొమినిక్‌తో సాయినాథ్ పోటీపడనున్నాడు.

బిజినెస్

ఫ్రెషర్లకు రూ.9.5 లక్షల ప్యాకేజీ!

పవర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన ఇన్ఫోసిస్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ ఇన్ఫోసిస్ ప్రాంగణ నియామకాల (క్యాంపస్ ప్లేస్‌మెంట్) ప్రక్రియలో భాగంగా పవర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఎంపిక చేసిన కాలేజీల నుంచి నియమించుకునే ఫ్రెషర్లకు రూ.9 లక్షల వరకు వార్షిక పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. సాధారణంగా కంపెనీ ఫ్రెషర్లకు ఆఫర్ చేసే రూ.3-3.5 లక్షల వార్షిక ప్యాకేజీతో పోలిస్తే చాలా అధికమిది. పవర్ ప్రోగ్రామ్‌లో ఫ్రెషర్లకు సాఫ్ట్‌వేర్ కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా పారితోషికాన్ని ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. గత ఏడాది కాలంలో హైరింగ్‌ను బాగా తగ్గించిన ఇన్ఫోసిస్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా 15,000-20,000 మంది గ్రాడ్యుయేట్లను చేర్చుకోనున్నట్లు జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా వెల్లడించింది.

మార్కెట్ సంపదలో రూ.2.5 లక్షల కోట్ల వృద్ధి

రూ.456.7 లక్షల కోట్లకు మార్కెట్ క్యాప్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం మళ్లీ లాభాల బాట పట్టాయి. ఒక దశలో 518 పాయింట్లు ఎగబాకి 81,000 స్థాయికి చేరువైన సెన్సెక్స్.. చివరికి 378.18 పాయింట్ల లాభంతో 80,802.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 126.20 పాయింట్ల వృద్ధితో 24,698.85 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో రంగ షేర్లలో జోరుగా కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో పాటు ముడి చమురు ధరల తగ్గుదల కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. మార్కెట్ ర్యాలీలో ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.46 లక్షల కోట్లు పెరిగి రూ.456.7 లక్షల కోట్లకు చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 25 లాభపడ్డాయి.

సరస్వతి శారీ డిపో బంపర్ లిస్టింగ్

గతవారం పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ను పూర్తి చేసుకున్న సరస్వతి శారీ డిపో లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.160తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 25 శాతం ప్రీమియంతో రూ.200 వద్ద లిస్టయింది. ఆ తర్వాత మరింత పుంజుకుని 31.21 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.209.95కు చేరకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.831.40 కోట్లుగా నమోదైంది.

సైయెంట్ డీఎల్ఎంలో 14.5 శాతం వాటా విక్రయం

రూ.860 కోట్లు సమీకరించే అవకాశం

తన అనుబంధ విభాగమైన సైయెంట్ డీఎల్ఎంలో 14.5 శాతం వాటాను ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని హైదరాబాద్‌కు చెందిన ఐటీ కంపెనీ సైయెంట్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు మంగళవారం వెల్లడించింది. సైయెంట్ డీఎల్ఎంలో 14.5 శాతం వాటాకు సమానమైన 1.149 కోట్ల షేర్లను ఈ నెల 21న (బుధవారం) విక్రయించనున్నట్లు తెలిపింది. ఒక్కో షేరు కనీస ధరను రూ.748.65గా నిర్ణయించింది. తద్వారా సైయెంట్‌కు రూ.860.9 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది. ఈ నిధులతో రుణ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు నిర్వహణ మూలధన అవసరాలకు వినియోగించుకోనున్నట్లు స్పష్టం చేసింది. ఈ బ్లాక్ డీల్ అనంతరం సైయెంట్ డీఎల్ఎంలో సైయెంట్ వాటా 66.66 శాతం నుంచి 52.16 శాతానికి తగ్గనుంది.

పసిడి హైజంప్

- ఒక్కరోజే రూ.1,400 పెరుగుదల
- తులం రూ.74,150కి చేరిక
- రూ.3,150 పెరిగిన కిలో వెండి

న్యూఢిల్లీ: దేశీయంగా బులియన్ ధరలు గడిచిన నెల రోజుల్లో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మంగళవారం రూ.1,400 పెరుగుదలతో రూ.74,150కి చేరుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,150 ఎగబాకి రూ.87,150 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు సరికొత్త రికార్డు స్థాయికి చేరడం ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 2,560 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 30.19 డాలర్ల వద్ద ట్రేడైంది.

కిమ్స్ హాస్పిటల్‌లో ఎస్‌బీఐ లైఫ్‌కు మరో 0.97% వాటా

హైదరాబాద్‌కు చెందిన కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్)లో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అదనంగా మరో 7,75,758 లక్షల షేర్లను రూ.184.11 కోట్లకు కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 0.97 శాతానికి సమానమైన ఈ షేర్లను కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ బ్లాక్ డీల్ డేటా వెల్లడించింది. ఒక్కో షేరును రూ.2,373.30 సగటు ధరతో ఎస్‌బీఐ లైఫ్ కొనుగోలు చేసింది. కాగా ఐసీఐసీఐ వెంచర్స్‌కు చెందిన ఇండియా అడ్వాంటేజ్ ఫండ్ ఎస్4-1, డైనమిక్ ఇండియా ఫండ్ ఎస్4 యూఎస్-1.. ఇదే ధరకు కిమ్స్ షేర్లను విక్రయించాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌బీఐ లైఫ్.. రూ.239 కోట్లతో కిమ్స్‌లో 1.4 శాతం వాటాను కొనుగోలు చేసింది.

ఐడీబీఐ బ్యాంక్ డిపాజిట్ రేటు పెంపు

న్యూఢిల్లీ: ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ఐడీబీఐ బ్యాంక్ దానిపై వడ్డీ రేటు పెంచింది. దీని కింద 444 రోజుల డిపాజిట్‌కు గరిష్ఠంగా 7.85 శాతం వడ్డీ చెల్లిస్తారు. ఇది పరిమిత కాల ఆఫర్. 375 రోజుల డిపాజిట్‌పై 7.75 శాతం వడ్డీ చెల్లిస్తారు. ఈ ఆఫర్ సెప్టెంబరు 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని బ్యాంక్ ప్రకటించింది. ఉత్సవ్ డిపాజిట్ స్కీమ్ కింద 700 రోజుల డిపాజిట్‌కు 7.70 శాతం, 300 రోజుల డిపాజిట్‌కు 7.55 శాతం వడ్డీ ఇస్తున్నట్టు కూడా బ్యాంక్ తెలిపింది.

ఎఫ్‌డీలపై 8.5% వరకు వడ్డీ రేటు

బంధన్ బ్యాంక్

ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) కోసం బంధన్ బ్యాంక్ ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తోంది. ఒక ఏడాది తొమ్మిది నెలల కాలపరిమితి ఉండే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు 8.5 శాతం, ఇతరులకు 8 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. ఒక సంవత్సరం తొమ్మిది నెలలకు మించి, ఐదేళ్ల లోపు ఉండే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, ఇతరులకు 7.25 శాతం చొప్పున వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నట్లు బ్యాంక్ ప్రకటించింది.

టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ మరోసారి ప్రపంచంలోని టాప్ సెంట్రల్ బ్యాంకర్లలో ఒకరిగా ఎంపికయ్యారు. అమెరికా కేంద్రంగా పనిచేసే గ్లోబల్ ఫైనాన్స్ పత్రిక ఈ ఎంపిక చేసింది. దాస్ టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా ఎంపికవడం వరుసగా ఇది రెండోసారి. గ్లోబల్ ఫైనాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్- 2024 పేరుతో గ్లోబల్ ఫైనాన్స్ పత్రిక ఒక జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో పాటు డెన్మార్క్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ క్రిస్టియన్ కెట్టెల్ థామ్సన్, స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ థామస్ జోర్డాన్‌లకు అత్యుత్తమ ఏ+ రేటింగ్ లభించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▼	66,600 ▼	92,000 ▲
ముంబై	71,945 ▲	65,902 ▲	85,321 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	480
వరంగల్	452	గోదావరి	480
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	114
కర్నూలు	107	నెల్లూరు	114
విశాఖపట్నం	109	అనంతపురం	113
గోదావరి	113		

ఓఎన్‌జీసీకి మరో అధునాతన రిగ్

మేఘా ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్స్ మార్కెట్లో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి మరో అధునాతన ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్‌ను సరఫరా చేసింది. అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన ఈ ఫుల్లీ ఆటోమేటెడ్, హైడ్రాలిక్ 2000 హెచ్‌పీ రిగ్‌ను ఓఎన్‌జీసీ రాజమండ్రి ప్రాంతంలో చమురు, సహజ వాయువు అన్వేషణకు ఉపయోగించనుంది. తీవ్రమైన ఒత్తిడి, ఉష్ణోగ్రతల్లోనూ ఈ డ్రిల్లింగ్ రిగ్ సాయంతో 6,000 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేయవచ్చు. చమురు, సహజవాయువు కోసం డ్రిల్లింగ్ చేసేటప్పుడు ఏర్పడే బ్లోఅవుట్స్‌ను అదుపు చేసేందుకూ ఈ రిగ్‌లో ప్రత్యేక ఏర్పాటు ఉందని ఎంఈఐఎల్ తెలిపింది. కేవలం ఇద్దరి సహాయంతో ఈ రిగ్‌ను ఆపరేట్ చేయడం మరో ప్రత్యేకత. ఆత్మనిర్భర్ భారత్ కింద ఎంఈఐఎల్ ఈ అధునాతన రిగ్‌లను తయారు చేస్తోంది. అంతర్జాతీయ పోటీని తట్టుకుని ఓఎన్‌జీసీకి మొత్తం 47 డ్రిల్లింగ్ రిగ్‌లు సరఫరా చేసే కాంట్రాక్టును ఎంఈఐఎల్ దక్కించుకుంది.

హైదరాబాద్‌లో ఫ్లట్టర్ గ్లోబల్ కెపాసిటీ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆన్‌లైన్ క్రీడల బెట్టింగ్, ఐ గేమింగ్ కంపెనీ ఫ్లట్టర్ ఇండియా మంగళవారం హైదరాబాద్‌లో కొత్త గ్లోబల్ కెపాసిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభించింది. 35 లక్షల డాలర్ల (రూ.29 కోట్లు) వ్యయంతో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ సెంటర్‌లో ఇప్పటికే 700 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. సృజనాత్మకతను ప్రోత్సహించడం, భారత ఉపాధి, నైపుణ్యాల మార్కెట్లో తమ అస్తిత్వాన్ని శక్తివంతం చేసుకోవడం, వృద్ధి సాధన ఈ సెంటర్ ఏర్పాటు చేయడం వెనుక లక్ష్యాలని ఫ్లట్టర్ ఎంటర్‌టైన్‌మెంట్ సీఓఓ ఫిల్ బిషప్ తెలిపారు. డేటా అనలిటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో నియామకాలు చేపట్టాలనుకుంటున్నామని, ఈ ఏడాది చివరికి ఉద్యోగుల సంఖ్య 900కి పెంచాలన్నది తమ లక్ష్యమని చెప్పారు.

మరింత సులభంగా రైట్స్ ఇష్యూలు!

సెబీ ప్రతిపాదన

న్యూఢిల్లీ: నిధుల సమీకరణ కోసం కంపెనీలు జారీ చేసే రైట్స్ ఇష్యూలను మరింత సులభతరం చేయాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. దీనికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలతో ఒక చర్చాపత్రం విడుదల చేసింది. సంబంధిత పార్టీలన్నీ ఈ ప్రతిపాదనలపై తమ అభిప్రాయాలను వచ్చే నెల 10వ తేదీలోగా తనకు పంపాలని కోరింది. సెబీ ప్రతిపాదనలు ఇవే..

- రైట్స్ ఇష్యూల్లో మర్చంట్ బ్యాంకర్ల అవసరాన్ని తొలగించి ఆ బాధ్యతను రిజిస్ట్రార్లు లేదా స్టాక్ ఎక్స్ఛేంజీలకు అప్పగించడం
- రైట్స్ ఇష్యూల ద్వారా సమీకరించిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ ఏజెన్సీ ఏర్పాటు
- రైట్స్ ఇష్యూ సమయానికి ఆ కంపెనీ షేర్ల ట్రేడింగ్‌పై నిషేధం ఉంటే రైట్స్ ఇష్యూని అనుమతించకూడదు.
- లెటర్ ఆఫ్ ఆఫర్‌లో రైట్స్ ఇష్యూకి సంబంధించిన వివరాలు మాత్రమే వెల్లడించేలా నిబంధనల హేతుబద్ధీకరణ
- కంపెనీల బోర్డు ఆమోదించిన తర్వాత రైట్స్ ఇష్యూల గడువును టీ+20 వర్కింగ్ డేస్‌కు కుదించడం
- రైట్స్ ఇష్యూకి వచ్చిన దరఖాస్తుల వ్యాలిడిటీ, షేర్ల కేటాయింపు ప్రాతిపదికను నిర్ణయించే విషయం రిజిస్ట్రార్లతో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీ సంస్థలకు అప్పగించడం

ఒక్కో షేరుకు రూ.19 డివిడెండ్

హిందుస్థాన్ జింక్

వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్) మరోసారి వాటాదారులకు తీపి కబురు చెప్పింది. ఒక్కో షేరుకు రూ.19 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. రూ.2 ముఖ విలువతో కూడిన హెచ్‌జెడ్ఎల్ ఈక్విటీ షేర్లపై ఇది 950 శాతానికి సమానం. మంగళవారం జరిగిన సమావేశంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్‌జెడ్ఎల్ మధ్యంతర డివిడెండ్ ప్రకటించడం ఇది రెండోసారి. ఈ డివిడెండ్ చెల్లింపునకు మొత్తం రూ.8,028.11 కోట్లు ఖర్చవుతుందని అంచనా. కాగా సెరెంటికా రెన్యువబుల్స్ నుంచి 180 మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరా ప్రారంభమైందని తెలిపింది.

కృష్ణపట్నం పోర్టులో అడ్వాన్స్‌డ్ కార్గో హ్యాండ్లింగ్ సిస్టమ్

న్యూఢిల్లీ: అదానీ కృష్ణపట్నం పోర్టులో ఆధునిక కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థను మంగళవారం ప్రారంభించారు. దీని వల్ల పోర్టు సామర్థ్యం, ఉత్పాదకత పెరుగుతాయని కంపెనీ తెలిపింది. ఆధునిక టెక్నాలజీతో పని చేసే ఈ కొత్త వ్యవస్థ కంటైనర్ల ద్వారాను, బల్క్‌గాను వచ్చే కార్గో నిర్వహణను వేగవంతం చేస్తుందని, తద్వారా పోర్టులో కార్గో కార్యకలాపాలు విప్లవాత్మకమవుతాయని,వ్యయాలు తగ్గుతాయని తెలిపింది.

జగన్.. విష ప్రచారం మానుకో

● వెలిగొండ కోసం రూ.5 అయినా ఖర్చు చేశావా?: మంత్రి నిమ్మల

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సొంత పత్రిక ద్వారా అసత్య కథనాలతో విషం చిమ్మడం మానుకోవాలని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. ఐదేళ్ల కాలంలో జగన్ చేసిన రూ.14 లక్షల కోట్ల రుణభారాన్ని మోస్తూ పాలన సాగిస్తున్నామని అన్నారు. వెలగపూడి సచివాలయంలో నిమ్మల మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'గత ఐదేళ్లలో జగన్ పాలనలో వెలిగొండ ప్రాజెక్టు సహాయ పునరావాసం కోసం ఐదు రూపాయలు కూడా ఖర్చు చేయలేదు. వ్యవస్థలన్నింటిని నాశనం చేసినట్లుగానే వెలిగొండనూ సర్వనాశనం చేశారు. హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తవ్వకుండా ప్రాజెక్టులను ప్రారంభించిన మోసగాడు జగన్. వెలిగొండ ప్రాజెక్టును నాశనం చేశారు. పోలవరం, వెలిగొండ, శ్రీశైలం, సోమశిల, గుండ్లకమ్మ, అన్నమయ్య... ఇలా ప్రతి ప్రాజెక్టులోనూ జగన్ అవినీతి స్పష్టంగా కనిపిస్తుంది. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను కట్టకుండా జగన్ కోట్లు దోచేశారు' అని నిమ్మల విమర్శించారు.

వెలిగొండపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: గొట్టిపాటి

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల పున రావాసం గురించి మాట్లాడే హక్కు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేదని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సీఎంగా ఉండగా వెలిగొండను అనుమతి లేని ప్రాజెక్టుగా జగన్ చూపించారు. కేంద్రం వద్దకు చంద్రబాబు నేతృత్వం లోని బృందం వెళ్లి దీనిని అధికారిక ప్రాజెక్టుగా గుర్తించేలా నోటిఫికేషన్ ఇప్పించింది. అధికారంలో ఉన్న జగన్ చేయాల్సిన పనిని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు చేశారు. కేంద్రాన్ని ఒప్పించి వెలిగొండకు నోటిఫికేషన్ ఇప్పించలేనందుకు జగన్ సిగ్గుపడాలి' అని మంత్రి రవికుమార్ విమర్శించారు.

విదేశీ పర్యటనకు అనుమతివ్వండి

● సీబీఐ కోర్టులో జగన్, విజయసాయిరెడ్డి పిటిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో నిందితులుగా ఉన్న ఏపీ మాజీ సీఎం జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి సీబీఐ కోర్టులో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు. సెప్టెంబరు, అక్టోబరులలో రెండు నెలలపాటు యూకే, స్వీడన్, అమెరికా తదితర దేశాల్లో పర్యటించేందుకు అనుమతివ్వాలన్న ఎంపీ విజయసాయిరెడ్డి పిటిషన్‌పై వాదనలు ముగియడంతో తీర్పు ఈ నెల 30కి వాయిదా పడింది. సెప్టెంబరులో 20 రోజులపాటు యూకే వెళ్లడానికి జగన్ అనుమతి కోరగా ఈ పిటిషన్ బుధవారం విచారణకు రానుంది.

అక్టోబరు నుంచి నూతన మద్యం పాలసీ: మంత్రి కొల్లు

ప్రత్తిపాడు, ఆగస్టు 20: కూటమి ప్రభుత్వం అక్టోబరు నుంచి నూతన మద్యం పాలసీని అమల్లోకి తీసుకువస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఇసుక, మద్యం వ్యవహారంలో గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు దారుణంగా దోపిడీకి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరంల్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాతో కలసి ఆయన మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో అనేక క్వారీలను వైసీపీ వారు అక్రమంగా హస్తగతం చేసుకున్నారు. క్వారీల నిర్వాహకులపై రాష్ట్రవ్యాప్తంగా రూ.4వేల కోట్ల అపరాధ రుసుము వేశారు. మద్యం, ఇసుక వనరుల నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాన్ని దోచేశారు. గత ప్రభుత్వ పాపాలు ఇప్పటికీ ఇబ్బందులు కలిగిస్తున్నాయి' అని వివరించారు.

స్థానిక సంస్థలకు 1,452 కోట్లు: పయ్యావుల

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'గ్రామాల అభివృద్ధితోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి అన్న మహాత్మా గాంధీ ఆశయాలను పాటించే ప్రభుత్వం మాది. సీఎం ఆదేశాలతో స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్లు విడుదల చేశాం' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అమరావతి సచివాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ '15వ ఆర్థిక సంఘం నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేస్తోంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే స్థానిక సంస్థలకు మరిన్ని నిధుల విడుదలకు నిర్ణయం తీసుకున్నాం. గ్రామ పంచాయతీలకు రూ.998 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.454 కోట్లు విడుదలకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం' అని మంత్రి అన్నారు.

అమరావతిలో ప్రపంచబ్యాంకు బృందం

● సీఎం చంద్రబాబుతో సమావేశం

● రాజధానికి 15 వేల కోట్ల సాయంపై చర్చలు



ప్రపంచ బ్యాంకు, ఏడీబీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి చేయూతనిచ్చేందుకు ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. రాజధాని కట్టడానికి రూ.15 వేల కోట్ల సాయం అందిస్తామని కేంద్రప్రభుత్వం ఇటీవలి బడ్జెట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ఈ రెండు బ్యాంకుల ప్రతినిధులు ప్రస్తుతం అమరావతిలో పర్యటిస్తున్నారు. మంగళవారమిక్కడ సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. వారి వెంట కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు కూడా ఉన్నారు. ఏడీబీ, ప్రపంచ బ్యాంకు అధికారులు ఈ నెల 27 దాకా అమరావతిలోనే ఉండి అన్ని అంశాలనూ పరిశీలిస్తారు. వీలైనంత త్వరగా ఈ నిధులను సమీకరించి అమరావతి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అటు రాష్ట్ర అధికారులు కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. కాగా, ప్రపంచబ్యాంకు, ఏడీబీ అధికారులు తనతో సమావేశమై అమరావతి భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారని చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సీబీఐకి అనుమతి కొనసాగింపు

రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల అవినీతిపై చర్యలు తీసుకోవడం, ఇతరత్రా కీలక కేసుల్లో దర్యాప్తునకు సీబీఐ మరో ఏడాది పాటు రాష్ట్రంలోకి నేరుగా రావొచ్చు. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం మంగళవారం నాడు గెజిట్ జారీ చేసింది. సీబీఐకి ఆరేళ్ల క్రితం ఏపీలోకి అనుమతి నిరాకరిస్తూ అప్పటి ప్రభుత్వం నిషేధం విధించింది. ఆ తర్వాత వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా రాష్ట్రంలోకి ప్రవేశించిన సీబీఐకి ప్రతి ఏటా కొనసాగింపు లభిస్తోంది. ఈ ఏడాది జూన్ 30నాటికి గడువు తీరిపోవడంతో ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ
రాష్ట్రంలో తయారవ్వాల్సిందే!

● విభిన్నమైన పాలసీ తీసుకురావాలి

● వచ్చే కేబినెట్ ముందు పెట్టండి: సీఎం

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా రూపొందించేలా ప్రపంచంలోనే విభిన్నమైన పాలసీని తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సోలార్ ప్యానెళ్లు, బ్యాటరీల తయారీ పరికరాల ముడి సరుకులన్నీ రాష్ట్రంలోనే లభ్యమవుతున్నాయని.. ఇవి చైనా, జపాన్ సహా ఇతర దేశాలకు వెళ్తున్నాయని.. అక్కడ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు తయారవుతున్నాయని.. తిరిగి వాటిని మనకే అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. అలా కాకుండా ఎలక్ట్రానిక్ రంగంలో తయారీ నుంచి వినియోగం దాకా 'ఎండ్ టు ఎండ్' పాలసీని రూపొందించాలని స్పష్టం చేశారు. మంగళవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో ఇంధన రంగంపై ఆయన సమీక్ష జరిపారు. ఈ భేటీలో అధికారులిచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను పరిశీలిస్తూనే.. ఇంధన రంగంలో తీసుకురావలసిన చర్యలపై ఆయన స్పష్టత ఇచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తేవాలని.. చార్జింగ్ పాయింట్ల ద్వారా వినియోగించే విద్యుత్ అందుబాటు ధరల్లో ఉండేలా విధానం రూపొందించాలని సూచించారు. ఈ నెల 28న జరిగే కేబినెట్ భేటీలో రాష్ట్ర సోలార్, ఈవీ పాలసీలను తీసుకురావాలని స్పష్టం చేశారు. బ్యాటరీ తయారీ పరికరాల ముడిసరుకు రాష్ట్రంలోనే లభ్యమవుతున్నా.. తయారీ యూనిట్లు ఇక్కడ ఏర్పాటు కావడం లేదని.. వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బయట నుంచి ఎలక్ట్రానిక్ వాహనాలు, పరికరాలు కొనుగోలు చేసే విధానానికి స్వస్తి పలకాలన్నారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లపై హైబ్రిడ్ విధానంలోనే ముందుకు వెళ్దామని చెప్పారు. విడివిడిగా ఈ ప్లాంట్లకు అనుమతులివ్వడం వల్ల 24 గంటలూ కరెంటు అందుబాటులో ఉంటుందన్నారు. 974 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉందని.. దానిని సౌర విద్యుత్‌కు ఉపయోగించుకుందామని చెప్పారు. వేస్ట్‌ల్యాండ్‌లో బయో ఇంధనం తయారీకి ప్రాధాన్యం ఇద్దామన్నారు. రిలయన్స్ సంస్థ గడ్డి నుంచి ఇంధనం తయారు చేసే విధానం అమలుకు సిద్ధమైందని.. ఆ తరహా ఆలోచనల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎంవో కార్యదర్శి రాజమౌళి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ట్రాన్స్‌కో ఎండీ చక్రధరబాబు, ట్రాన్స్‌కో జేఎండీ కృతి, ఇంధనశాఖ సహాయ కార్యదర్శి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌తో హెచ్‌సీఎల్ ప్రతినిధులు

రాష్ట్రంలో హెచ్‌సీఎల్ భారీ విస్తరణ

మరో 15 వేల ఉద్యోగాల కల్పనకు కార్యాచరణ

మంత్రి నారా లోకేశ్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తమ సేవలను భారీగా విస్తరించేందుకు హెచ్‌సీఎల్ సంసిద్ధత వ్యక్తం చేసిందని, ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక అమలుకు అడుగులు వేస్తున్నట్టుగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం లోకేశ్‌తో హెచ్‌సీఎల్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీమంతి శివశంకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో తమ సంస్థ విస్తరణ ద్వారా మరో 5,500 మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని వారు చెప్పారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో హెచ్‌సీఎల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఛైర్మన్ శివనాడర్‌ను కలసి ఒప్పించానని, ఇందుకు ఆయన అంగీకరించి గన్నవరంలో సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో 4,500 మందికి ఉద్యోగాలు దక్కాయన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా 20,000 మందికి ఉద్యోగాలు కల్పించాల్సిన సంస్థ కేవలం 4,500 మందితోనే ఆగిపోయిందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. హెచ్‌సీఎల్ విస్తరణకు అవసరమైన అనుమతులు, రాయితీలు అందజేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రాయితీలను విడతల వారీగా చెల్లిస్తామన్నారు.

కమీషన్లకే కిక్కు

(మొదటి పేజీ తరువాయి)



ప్రశ్నించింది. ఆర్డర్లు రావడం వెనకున్న అసలు గుట్టు తమ దగ్గర ఉందని, వివరంగా చెబితే బాగుంటుందని సీఐడీ అధికారులు గట్టిగా అడిగారు. నోరు విప్పిన మద్యం డిస్టిలరీస్ యాజమానులు వైసీపీ ప్రభుత్వ పెద్దలు పిలిచి లిక్కర్ కేసుకు 200, బీరు అయితే 50 రూపాయలు కమీషన్ డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. ఆ తర్వాత ధరలు భారీగా పెంచి ఆ మొత్తాన్ని నగదు రూపంలో తీసుకున్నట్లు గుట్టు విప్పారు. తాము ప్రత్యేకంగా కమీషన్ ఇవ్వలేదని, కాకపోతే అదనపు సొమ్ము ఆదాయంగా చూపించాల్సి రావడంతో ఆ పన్నులు భరించాల్సి వచ్చిందని వివరించారు. ఎక్కువగా వాసుదేవ రెడ్డి వ్యవహారాలన్నీ చూసేవారని, ఎవరు ఎక్కువ కమీషన్ ఇస్తే వారికి సంబంధించి మద్యం ఆర్డర్లు ఇచ్చేవారని యజమానులు చెప్పినట్టు సమాచారం. అందుకే మద్యం షాపుల్లో రోజుకొక బ్రాండు అందుబాటులో ఉండేదని, షాపులో సెల్లర్ ఇచ్చిందే మద్యంబాబులు తీసుకోవాల్సి వచ్చేదని చెప్పినట్లు తెలిసింది. తెలంగాణలో వెయ్యి రూపాయల విలువైన మద్యానికి ఏపీలో రూ.1600 బిల్లు వేస్తే ఎప్పటికైనా బయటికి వస్తుందన్న భయం మీకు కలగలేదా? అని సీఐడీ అధికారులు ప్రశ్నించారు. అందుకు డిస్టిలరీల యజమానులు కాసేపు మౌనం వహించారు. తర్వాత నోరు విప్పి అప్పట్లో తాము ఏది చెప్పినా వినేవారు అరుదని చెప్పారు. ఆ రూ.600 నగదు రూపంలో వైసీపీ పెద్దలకు ఇచ్చామని, దానిపై పన్ను తాము భరించామని తెలిపారు. 'మేం ప్రభుత్వ ఖజానా నుంచి ఇస్తున్నప్పుడు ఆ సొమ్ము ఇచ్చేందుకు మీకేంటి ఇబ్బంది' అనే ప్రశ్నలు వైసీపీ పెద్దల నుంచి వచ్చేవని, ఈ సందర్భంగా గతంలో సకల శాఖల మంత్రిగా పేరున్న ప్రముఖ వ్యక్తి పేరు చెప్పినట్లు తెలిసింది. మరింత సమాచారం కోసం త్వరలో మళ్లీ పిలుస్తామని సీఐడీ అధికారులు చెప్పడంతో వారు వెనుదిరిగారు. సంపూర్ణ మద్య నిషేధమంటూ ఎన్నికల ముందు ప్రజల్ని మభ్య పెట్టి.. జగన్ అధికారంలోకి వచ్చాక నాసిరకం మద్యంతో పేదల రక్తాన్ని జలగలా పీల్చేశారు. దేశంలో ఎక్కడా లేని ధరలతో మందుబాబుల్ని లూటీ చేశారు. వేల కోట్లు అక్రమంగా వసూలు చేసిన తాడేపల్లి పాలకుడి పాపాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

నేడు సీఎం దృష్టికి..

జగన్ పాలనలో మద్యం దోపిడీ ఎలా జరిగిందో ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీఐడీ అధికారులు వివరించబోతున్నారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం శాంతిభద్రతలపై సమీక్షించనున్న సీఎంకు మద్యం కుంభకోణం కేసులో పురోగతిని తెలియజేయనున్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి ఇచ్చిన సమాచారం, డిస్టిలరీస్ యాజమానులు వెల్లడించిన కమీషన్ల వ్యవహారంతో పాటు వైసీపీ పెద్దల్లో ఎవరెవరి పాత్ర ఎంత ఉంది? మొత్తం కుంభకోణం విలువ ఎన్ని వేల కోట్లు ఉండొచ్చు? పక్కాగా సేకరించిన ఆధారాలు ఏమిటి? ఇంకా ఎవరెవరిని ప్రశ్నించాల్సి ఉంది? న్యాయపరమైన చిక్కుల్లేకుండా తీసుకోబోతున్న జాగ్రత్తలు తదితర అంశాలపై డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ ఏడీసీ రవిశంకర్ అయ్యన్నార్ చర్చించే అవకాశం ఉంది. మంగళవారం సచివాలయానికి వచ్చిన ఈ ఇద్దరు ఉన్నతాధికారులు సీఎంవోలోని కీలక అధికారితో ఈ విషయంపై చూచాయగా చర్చించినట్లు తెలిసింది.

బోగస్ సర్టిఫికెట్లు పెడితే పింఛన్లు కట్

● దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రై సైకిళ్లు

● ట్రాన్స్‌జెండర్లకు రేషన్ కార్డులు: మంత్రి డోలా

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందేవారి ప్రయత్నాన్ని అడ్డుకోవాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమంపై మంగళవారం అమరావతి సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా రేషన్ కార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అంధ విద్యార్థులకు ఒకేషనల్, స్కిల్ కోర్సులు ప్రవేశపెట్టాలని చెప్పారు. కలెక్టరేట్లలో జరిగే గ్రీవెన్స్‌కు ఆయాశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు సంక్షేమ పథకాలు, పింఛన్లు అందించాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ ప్రకాశ్ రివర్స్ గేర్

● మళ్లీ సర్వీస్‌లోకి వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వివాదాస్పద సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ మరోసారి వార్తల్లోకి ఎక్కారు. గత వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన పోస్టుల్లో పనిచేసిన ఆయన ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీతో అంటకాగిన ఆయన్ను జీఏడీకి సరెండర్ చేసింది. దీంతో తాను స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మూడు నెలల ముందస్తు నోటీసు ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు జూన్ 25న లేఖ సమర్పించారు. సెప్టెంబరు 30తో నోటీసు గడువు ముగిసేలోగా ఆయన వీఆర్ఎస్‌ను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం జీవో ఇవ్వాల్సి ఉంది. అయితే వారం రోజుల వ్యవధిలోనే ఆయన వీఆర్ఎస్‌ను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం అనూహ్యంగా జీవో జారీ చేసింది. ఆ జీవో సెప్టెంబరు 30 తర్వాత అమలులోకి వస్తుందని పేర్కొంది. దీంతో ఆ తేదీ వరకూ ఆయన రాష్ట్రంలోనే ఉండాలి. కానీ ప్రభుత్వం ఎలాంటి పోస్టింగ్ ఇవ్వదు. ఇదిలా ఉండగా ప్రవీణ్ ప్రకాశ్ తాజాగా తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది. వీఆర్ఎస్ దరఖాస్తును వెనక్కి తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు ఆయన సీఎస్ కార్యాలయానికి సంకేతాలు పంపుతున్నారు. వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో తాను ఒత్తిడిలో ఉన్నానని, ప్రభుత్వం కూడా వెంటనే దాన్ని ఆమోదించిందని సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు తెలుస్తోంది. తనను మళ్లీ సర్వీస్‌లోకి తీసుకోవాలని ప్రవీణ్ ప్రకాశ్ దరఖాస్తు చేస్తారని సమాచారం. ప్రస్తుతం సీఎస్ కార్యాలయంలో ఇదే అంశంపై చర్చ నడుస్తోంది. కానీ, ఇప్పటి వరకూ ఆయన సీఎస్‌కు ఎలాంటి దరఖాస్తు చేయలేదు. ప్రవీణ్ ప్రకాశ్ ఇటువంటి నిర్ణయం తీసుకుంటారని ముందే భావించిన ప్రభుత్వం ఆయన వీఆర్ఎస్‌ను వెంటనే ఆమోదించింది. సెప్టెంబరు 30న కచ్చితంగా రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన దరఖాస్తుపై పునరాలోచన చేసే ప్రసక్తే లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఖరీఫ్‌కు గడ్డుకాలం!

రాష్ట్రవ్యాప్తంగా 61% మించని సాగు

49 మండలాల్లో వానలోటు

● వానలోటు లేకపోయినా.. కొన్ని చోట్ల ఎక్కువగా డ్రైస్పెల్స్

● ప్రత్యామ్నాయ పంటలపై సర్కార్ దృష్టి

● 80% రాయితీపై విత్తనాల పంపిణీకి సిద్ధం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



తనను కలిసిన థాయ్‌లాండ్ సీపీఎఫ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఖరీఫ్‌పై ప్రతికూల ప్రభావం పడింది. అతివృష్టి, అనావృష్టి వాతావరణంతో ప్రధాన పంటలతో సహా మిగిలిన పంటల సాగు మందకొడిగా మారింది. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 32.5లక్షల హెక్టార్లలో పంటలు వేయాల్సి ఉండగా, 19.78లక్షల హెక్టార్లలో(61%)మాత్రమే సాగులోకి వచ్చాయి. వరి 15.12లక్షల హెక్టార్లకు గాను 9.56లక్షల హెక్టార్లు మాత్రమే సాగువుతోంది. ఇక, పత్తి 5.70కి గాను 3.50, వేరుశనగ 5.55కి గాను 2.63, కంది 2.33కి గాను 1.70 లక్షల హెక్టార్లు సాగులోకి వచ్చింది. అలాగే, మొక్కజొన్న 1.05, చిరుధాన్యాలు 0.48, నూనె గింజలు 0.13, ఇతర వాణిజ్య పంటలు 0.27లక్షల హెక్టార్లలో సాగులో ఉన్నాయి. తొలకరి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 356.4 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా, 413.4 మి.మీ. నమోదైంది. 16.0% అదనంగా వర్షపాతం రికార్డులో ఉంది. కానీ వర్షపాతంలో 14 జిల్లాలు మెరుగ్గానే ఉన్నా.. మరో 12 జిల్లాలో సాధారణంగానే ఉంది. పక్షం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత, వేడిగాలుల వల్ల గాలిలో, భూమిలో తేమ కొరవడింది. దీంతో కడప 9, శ్రీకాకుళం 8, ప్రకాశం 6, నెల్లూరు, అన్నమయ్య, పల్నాడు జిల్లాల్లో 4 చొప్పున, కర్నూలు, బాపట్ల 3 చొప్పున, అనంతపురం, శ్రీసత్యసాయి, తూర్పుగోదావరి, తిరుపతి, అల్లూరి, నంద్యాల, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక్కోటి చొప్పున మొత్తం 49 మండలాల్లో వానలోటులో ఉన్నాయి. కృష్ణా, గోదావరికి వరదలు రావడంతో కాలువలకు పుష్కలంగా నీరు విడుదలవుతున్నా.. మెట్ట ప్రాంతాల్లో పంటల సాగు పుంజుకోలేదు. ముఖ్యంగా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రతికూలత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో 2.22లక్షల హెక్టార్లలో ఉలవలు, మిగతా భూముల్లో పెసర, మినుము, అలసంద, జొన్న, కొర్ర, సజ్జ పంటల సాగుకు శాస్త్రవేత్తలు సిఫారసు చేశారు. అందువల్ల ప్రత్యామ్నాయ పంటల సాగుకు వాస్తవ అంచనాలు రూపొందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. దీంతో కంటింజెన్సీ యాక్షన్ ప్లాన్ కింద ఉలవలు 55,587, జొన్న 6,400, పెసర 4,600, అలసంద 4,173, మినుము 2,021, కొర్ర 650 క్వింటాళ్ల విత్తనాలను అధికారులు ఏపీసీడ్స్ ద్వారా సిద్ధం చేస్తున్నారు. వచ్చేనెల మొదటి వారంలోగా 80% రాయితీపై విత్తనాలు పంపిణీచేసి, గుర్తించిన మండలాల్లో కంటింజెన్సీ ప్లాన్ అమలు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఆదాయం తగ్గకుండా చర్యలు: అచ్చెన్న

రాయలసీమలో ఏ ఒక్క రైతు ఆదాయం కూడా తగ్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఖాళీగా ఉన్న వ్యవసాయ భూముల్లో సాగును ప్రోత్సహించడంతో పాటు రైతులకు 80శాతం రాయితీపై విత్తనాలు అందించాలని స్పష్టం చేశారు. మంగళవారం అమరావతి సచివాలయం నుంచి రాయలసీమ జిల్లాల వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మంత్రి అచ్చెన్నతో థాయ్ బృందం భేటీ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో థాయ్‌లాండ్‌కు చెందిన సీపీఎఫ్ అగ్రికల్చర్ బిజినెస్ ఇండియా ప్రతినిధులు భేటీ అయ్యారు. మంగళవారం అమరావతి సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆక్వా రంగ అభివృద్ధి, ఎగుమతుల వృద్ధి, ఆక్వా సీడ్ నాణ్యత, ఆర్గానిక్ ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల అవకాశాలపై సీపీఎఫ్ వైస్ ఛైర్మన్ సిరపాంగ్ నా పోంగ్సా, అసిస్టెంట్ వైస్ ఛైర్మన్ సురచాయ్ డిచింగ్ మంత్రితో చర్చించారు.

అనంత, కర్నూలు జిల్లాల్లో భారీ వర్షం

● పొంగిపొర్లిన వాగులు, వంకలు

● వందలాది ఎకరాల్లో పంట నష్టం

కర్నూలు(ఆంధ్రజ్యోతి), కర్నూలు అగ్రికల్చర్, అనంతపురం అర్బన్, ఆగస్టు 20: కర్నూలు, అనంతపురం జిల్లాల్లో సోమవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీవర్షం కురిసింది. బెళుగుప్ప సమీపంలోని బ్రిడ్జిపై నీరు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 196 హెక్టార్లలోని రూ.1.73 కోట్ల విలువైన పంటనష్టం జరిగింది. కర్నూలు జిల్లాలోని పత్తికొండ డివిజన్‌లో కురిసిన వర్షానికి హంద్రీనది పరివాహక ప్రాంతంలోని వందల ఎకరాల పంట కొట్టుకుపోయింది. హంద్రీ వంక ప్రవాహానికి చినహుల్తి వద్ద ఆదోని-పత్తికొండ ప్రధాన రహదారిలో సుమారు ఆరు గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కౌతాళం మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. దేవనకొండ మండలంలో హంద్రీనది ఉధృతికి దాదాపు 1200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అంచనా. వేదవతి నది ఉగ్రరూపం దాల్చడంతో హాలహర్వి మండలంలో కల్లివాగు ప్రవాహంతో రాకపోకలు స్తంభించిపోయాయి. హంద్రీనదికి వరద రావడంతో కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలంలో 25 మంది రైతులు, కూలీలు చిక్కుకుపోయారు. హంద్రీనది సమీపంలోని గంజహళ్లిలో 25 మంది రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లారు. 11గంటల సమయంలో హంద్రీలో నీటి ఉధృతి పెరిగింది. రైతులు చెట్లపైకి, గట్టుపైకి చేరుకుని రక్షించమంటూ కేకలు వేశారు. గాజులదిన్నె నుంచి నీటితెప్పను, గజ ఈతగాళ్లను రప్పించి వారిని క్షేమంగా ఒడ్డుకు చేర్చారు.



హంద్రీనదిలో చిక్కుకుపోయిన రైతులు, కూలీలను తెప్పల ద్వారా తరలిస్తున్న గజ ఈతగాళ్లు

వాతావరణ అనిశ్చితి

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడు, దానికి ఆనుకుని కోస్తాంధ్ర పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రాష్ట్రంలో మంగళవారం ఎండ తీవ్రం గా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2నుంచి 4డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. అత్యధికంగా కావలి, కడపలో 37.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24గంటల్లో కోస్తా, రాయల సీమల్లో అక్కడక్కడా వర్షాలు కురవనున్నాయని, మిగిలినచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

జోగి రాజీవ్ కేసు విచారణ నేటికి వాయిదా

విజయవాడ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న మాజీ మంత్రి కుమారుడు జోగి రాజీవ్ కేసు విచారణను ఏసీబీ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. రాజీవ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, ఏసీబీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై కోర్టులో మంగళవారం వాదనలు జరిగాయి. పీపీ ఆనంద జ్యోతి, ఏసీబీ న్యాయ సలహాదారుడు శేషయ్య వాదనలు వినిపించారు. కేసు విచారణను న్యాయాధికారి హిమబిందు బుధవారానికి వాయిదా వేశారు.

పోలీసు విచారణకు జోగి రమేశ్ గైర్హాజరు

మంగళగిరి, ఆగస్టు 20: ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దాడికి సంబంధించిన కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ విచారణకు గైర్హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటికే ఒకసారి విచారణ ఎదుర్కొన్న జోగి రమేశ్‌కు మంగళగిరి రూరల్ పోలీసులు మరోమారు నోటీసులు జారీ చేశారు. మంగళవారం విచారణకు హాజరు కావలసి వుండగా ఆయన తరపు న్యాయవాదులు గవాస్కర్, వెంకటేశ్ శర్మ, ఆదాం పోలీసు స్టేషన్‌కు వచ్చారు. గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావును కలిసి జోగి రమేశ్ తరపున నోటీసులకు సమాధానమిచ్చారు. న్యాయవాదులు మీడియాతో మాట్లాడుతూ.. జోగి రమేశ్ సెల్‌ఫోను, సిమ్‌కార్డులు సమర్పించాలని పోలీసులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. చట్టప్రకారం సెల్‌ఫోను, సిమ్‌కార్డులను అడిగే హక్కు లేదన్నారు.

వారిని బదిలీల నుంచి మినహాయించండి: బొప్పరాజు

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సంవత్సరంలోపు రిటైర్ అయ్యే ఉద్యోగులకు ప్రస్తుత బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మంగళవారం కోరారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల ఉత్తర్వుల్లో సంవత్సరంలోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులకు ప్రస్తుత బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వలేదని తెలిపారు. వారిని బదిలీ చేస్తే 62 ఏళ్ల వయసులో ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. దీనిపై సచివాలయంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీని, సీఎంఓ అధికారుల సానుకూలంగా స్పందించారని తెలిపారు.

15100కు ఫోన్ చేస్తే ఉచిత న్యాయ సహాయం

▸▸ సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్: న్యాయసేవాధికార సంస్థ



న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత, ఉప కార్యదర్శి అమర రంగేశ్వరరావు

అమరావతి (ఆంధ్రజ్యోతి), తుళ్లూరు, ఆగస్టు 20: రాష్ట్రవ్యాప్తంగా ఉచిత న్యాయ సహాయం అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 15100ను ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ (ఏపీఎస్ఎల్ఎస్ఏ) ప్రకటించింది. మహిళలతో పాటు ఎస్సీలు, ఎస్టీలు, కార్మికులు, సంవత్సర ఆదాయం మూడు లక్షలలోపు ఉన్నవారు దీనికి అర్హులని, వారు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపింది. అమరావతి సచివాలయం వద్ద ఉన్న రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం సభ్య కార్యదర్శి ఎం బబిత ఈ వివరాలు వెల్లడించారు. బాధితులు ఫోన్ చేస్తే వివిధ ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహకారంతో జైళ్లలో ఉన్న 93 మంది ఖైదీలకు ఏపీఎస్ఎల్ఎస్ఏ నేతృత్వంలో వృత్తి నైపుణ్య శిక్షణ అందించామని చెప్పారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీఎస్ఎల్ఎస్ఏ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ జి.నరేందర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 14న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో ఏపీఎస్ఎల్ఎస్ఏ మెంబర్ సెక్రటరీ బబితతో పాటు ఉపకార్యదర్శి డాక్టర్ అమర రంగేశ్వరరావు, సహాయ కార్యదర్శి యస్ జేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ యువ టీచర్ల కుటుంబాలకు సర్కారు అండ

▸▸ 'చిన్నారుల మృతి' ఘటనపై సీఎం సీరియస్: మంత్రి సంధ్యారాణి

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దురదృష్టవశాత్తు వాగు దాటుతూ మృతి చెందిన ఏకలవ్య పాఠశాలకు చెందిన యువ ఉపాధ్యాయుల కుటుంబాలకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో వాగు దాటుతూ ఏకలవ్య పాఠశాలకు చెందిన ఇద్దరు యువ ఉపాధ్యాయులు... పంజాబ్‌కు చెందిన మహేశ్(29), ఆర్తి(26) దురదృష్టవశాత్తు మృతి చెందారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వారి పార్థివ దేహాలను విమానంలో వారి స్వస్థలాలకు తరలించాం. కేంద్రం సాయం రూ.10 లక్షలు, రాష్ట్ర సాయం రూ.5 లక్షలు... మొత్తం రూ.15 లక్షలను ఒక్కొక్క కుటుంబానికి అందజేస్తాం. అలాగే ఆయా కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగం ఇవ్వనున్నాం' అని మంత్రి సంధ్యారాణి తెలిపారు.

పవన్ కార్యాలయంలో మినియేచర్ శిల్పాలు

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):ఉప ముఖ్యమంత్రిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ, శాస్త్రసాంకేతిక శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళగిరిలోని ప్రైవేటు కార్యాలయంలో తన శాఖలకు సంబంధించిన అంశాలపై మినియేచర్ శిల్పాలు, చిత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. శాస్త్ర సాంకేతిక విభాగం పరిధిలోకి వచ్చే అంశాలతో బొమ్మలు ప్రత్యేకంగా చేయించారు. అంతరిక్ష పరిశోధన ప్రస్థానాన్ని తెలిపేబొమ్మలు, లోహంతో చేసిన మినియేచర్ శిల్పాలను బెంగళూరుకు చెందిన క్రాఫ్టిజన్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేశారు. అలాగే, తన శాఖలకు సంబంధించిన అంశాలను తెలియజేసేలా ఒకపక్క గోడచిత్రాలు, కొయ్య శిల్పాలతో అలంకరించాలని సంబంధిత నిపుణులను కోరారు.



మినియేచర్ శిల్పాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

చిక్కడు.. దొరకడు!

అజ్ఞాతంలోనే 'గనుల'రెడ్డి!!

▸▸ వైసీపీ ముఖ్య నేత సూచనతో చెన్నైలో సేద తీరుతున్నారని ప్రచారం

▸▸ ఈ నెల 31న వెంకటరెడ్డి పదవీవిరమణ

▸▸ తెరవెనుక జగన్ అనుయాయుల సన్నాహాలు

▸▸ అటు ఏసీబీ తీరుపైనా సందేహాలు

▸▸ ఆయనపై ఇంతవరకు కేసే పెట్టని వైనం

▸▸ సెప్టెంబరులో ముందస్తు బెయిల్‌కు వెంకటరెడ్డి?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కోస్ట్‌గార్డ్ నుంచి డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి వ్యవహారం చిక్కడు..దొరకడులా మారింది. ఇసుక టెండర్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన చాలాకాలంగా అజ్ఞాతంలో ఉంటున్నారు. ఆయన ఆచూకీని ఏసీబీ ఇంతవరకు కనిపెట్టలేకపోయింది. ఈ నెల 31న రిటైరయ్యేవరకు ఆయన బయటకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. వైసీపీ ముఖ్య నేత సలహాతో ఆయన ప్రస్తుతం చెన్నైలో సేద తీరుతున్నారని తెలుస్తోంది. గనుల శాఖలోని జోడు పదవుల నుంచి తప్పించిన సర్కారు.. ఆయన్ను తన నియంత్రణలో ఉంచుకోలేకపోయింది. ఇసుక టెండర్లలో అక్రమాలకు సంబంధించి జూలై 31న ఆయన్ను సస్పెండ్ చేసింది. అదే రోజున ఆయన డిప్యుటేషన్ కాలపరిమితి కూడా ముగిసింది. అదే రోజున సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేసినా.. వాటిని అందుకునేందుకు ఆయన అందుబాటులో లేరు. కడప జిల్లాలో సొంతింట్లో, హైదరాబాద్, తిరుపతి, చెన్నైల్లో పోలీసు బృందాలు గాలించినా లాభం లేకపోయింది. మాతృశాఖకు కూడా సమాచారం ఇవ్వకుండా మాయమయ్యారు. ఇసుక టెండర్లలో అక్రమాలపై విచారణ అంటే మాజీ ముఖ్యమంత్రి జగన్‌తోపాటు జేపీ వెంచర్స్‌ను అడ్డంపెట్టుకుని ఇసుక మాఫియా నడిపిన వైసీపీ ముఖ్య నేతల పాత్రను వెలికితీయడం అన్న మాట. ఇటు ప్రభుత్వానికి, అటు జగన్ శిబిరానికి ఈ కేసు చాలా కీలకమైనది. వెంకటరెడ్డిని ఏసీబీ అరెస్టు చేస్తే తమ మెడకూ చుట్టుకుంటుందన్న ఉద్దేశంతో జగన్ శిబిరం ఆయన్ను అజ్ఞాతంలోకి పంపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నెల 31న కోస్ట్‌గార్డ్ సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్‌గా వెంకటరెడ్డి పదవీ విరమణ చేయబోతున్నారు. ఆ ప్రక్రియ సజావుగా సాగేంత వరకు ఏసీబీ కంటపడొద్దని వైసీపీ ముఖ్య నేత గట్టిగా సూచించినట్లు వెంకటరెడ్డి సన్నిహిత వర్గాలు తెలిపాయి. అందుకే చెన్నైలో వెంకటరెడ్డి సేదతీరుతున్నట్లు తెలిసింది. రిటైర్మెంట్ తర్వాత సెప్టెంబరు మొదటి వారంలో అనారోగ్య కారణాలను చూపి ముందస్తు బెయిల్ తీసుకోవాలన్న వ్యూహంలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు వెంకటరెడ్డి విషయంలో ఏసీబీ మెతగ్గా వ్యవహరిస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు ఆయనపై కేసే నమోదు చేయకపోవడం, లుకౌట్ నోటీసులు ఇవ్వకపోవడం వీటికి బలం చేకూరుస్తున్నాయి.



ఆయన కోసం పోస్టే సృష్టించారు!

వెంకటరెడ్డి కోస్ట్‌గార్డ్‌లో సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్. 2019 వరకు ఆయనెవరో ఎవరికీ తెలియదు. జగన్ ప్రభుత్వం వచ్చాక 2019 డిసెంబరులో డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. సీఎం పేషీ అధికారి ధనుంజయరెడ్డి సహకారంతో స్పెషల్ సెక్రటరీ అనే పోస్టు సృష్టించి వెంకటరెడ్డిని నియమించారు. ఆ తర్వాత 2020లో గనులశాఖ డైరెక్టర్‌గా నియమించారు. ఆ తర్వాత కొంతకాలానికే ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. చట్టాలు, నిబంధనలు, మార్గదర్శకాలను, ప్రజాప్రయోజనాలను తుంగలో తొక్కి.. జగన్ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేశారని తొలి నుంచీ విమర్శలు ఉన్నాయి. 2023లోనే ఆయన డిప్యుటేషన్ కాలపరిమితి ముగిసిపోయింది. అయితే జగన్ సర్కారు కేంద్రం ద్వారా 2024 జూలై 31 వరకు పొడిగింపు ఇప్పించింది. మళ్లీ రాష్ట్రంలో జగన్ సర్కారే వస్తుందని, తాను ఏపీఎండీసీ ఎండీగా కొనసాగుతానని వెంకటరెడ్డి ధీమాతో ఉండేవారు. ఆగస్టు 31న పదవీవిరమణ చేసినా గనులశాఖలోనే కొనసాగిస్తామని జగన్ శిబిరం నుంచి హామీలు లభించాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఆయన డిప్యుటేషన్ ముగిసిన రోజునే.. జూలై 31వ తేదీన ఇసుక టెండర్ల అక్రమాల ఆరోపణలపై సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ ఉత్తర్వులు అందుకునేందుకు వెంకటరెడ్డి అందుబాటులో లేరు. సస్పెండ్ చేయడానికి ఒక రోజు ముందే కోస్ట్‌గార్డ్ సర్వీసులో తిరిగి చేరిపోయారని, అక్కడే విధుల్లో ఉన్నారని ప్రచారం జరిగినా తర్వాత అది వాస్తవం కాదని తేలింది. ఆయన ఇంటి గోడలకు సస్పెన్షన్ ఉత్తర్వుల కాపీలను అంటించారు. ఇసుక టెండర్లలో అక్రమాల కేసు విచారణను ఏసీబీకి అప్పగించారు. ఈ కేసులో వెంకటరెడ్డిని విచారించాల్సి ఉంది. అది జరగాలంటే ముందు ఇసుక టెండర్ల అక్రమాలపై ఏసీబీ కేసు నమోదు చేయాలి. విచారణకు హాజరుకావాలని వెంకటరెడ్డికి నోటీసులివ్వాలి. అసలీ ప్రక్రియ ఏసీబీ నుంచి జరిగిందా లేదా అన్న అనుమానాలున్నాయి. మరోవైపు ఎలాంటి అడ్డంకులూ లేకుండా వెంకటరెడ్డి కోస్ట్‌గార్డ్ సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్‌గా 31న పదవీ విరమణ చేసేందుకు.. రక్షణ శాఖలో ఉన్న జగన్ అనుయాయులు తెరవెనుక ఏర్పాట్లు చేయిస్తున్నట్లు తెలిసింది. తమకున్న ఢిల్లీ పరిచయాలను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. సర్వీసులో ఉండగానే ఏసీబీ అరెస్టు చేస్తే ఆ తర్వాత రక్షణ శాఖలో అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుందని, అందుకే సేఫ్ రిటైర్మెంట్ కోరుకుంటున్నారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగానే ఈ నెల 31 వరకు ప్రభుత్వానికి, ఏసీబీకి అందుబాటులోకి రాకూడదని ఆయన అజ్ఞాతంలో కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి.



వెంకటేశ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

ఆంధ్రజ్యోతి జర్నలిస్టుకు మోటూరి అవార్డు

విజయవాడ (గవర్నర్‌పేట), ఆగస్టు 20: ఆంధ్రజ్యోతి నవ్య పేజీలో మానవీయ కథనాలు రాసి పాఠకులను మెప్పించిన జర్నలిస్టు కె.వెంకటేశ్‌కు మోటూరి హనుమంతరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డును ప్రదానం చేశారు. విజయవాడలో మంగళవారం ప్రజాశక్తి దినపత్రిక 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. వెంకటేష్‌కు శాలువా కప్పి, జ్ఞాపికను ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తదితరులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు తెలకపల్లి రవి, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ పాల్గొన్నారు.



ఆడపిల్లల రక్షణ బాధ్యత అందరిదీ: అనిత

విజయవాడ, ఆగస్టు 20: ఆడపిల్లల బాధ్యత అందరిదీ అని, అఘాయిత్యాలు జరిగినపుడు అన్ని వర్గాలూ మద్దతుగా పోరాడాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ విజయవాడలో వాసవ్య మహిళా మండలి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇతర డాక్టర్స్ అసోసియేషన్స్ సంయుక్తంగా నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆమె పాల్గొన్నారు.

ఐదేళ్లలో 17 వేల కి.మీ.

(మొదటి పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకుని ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. మంగళవారమిక్కడ అమరావతి సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ.. 2014-19 మధ్య చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా నాడు గ్రామాల రూపురేఖలు మార్చామని.. కానీ గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసి గ్రామాలను సమస్యలకు కేంద్రాలుగా మార్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఒక ఇంటికి, ఒక గ్రామానికి, ఒక ప్రాంతానికి ఏం అవసరమో గుర్తిస్తాం.. సదుపాయాలు కల్పిస్తాం. ఒక ఇంటికి అవసరమైన విద్యుత్, గ్యాస్, టాయ్‌లెట్, నీటి కుళాయి వంటి వాటిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి. ఒక గ్రామానికి వీధిలైట్లు, డ్రైనేజీ కాలువలు, సిమెంట్‌రోడ్లు, తాగునీటి సరఫరా, ఘనవ్యర్థాల మేనేజ్‌మెంట్ కేంద్రాల వంటి సౌకర్యాలు కల్పించాలి. గ్రామం నుంచి సమీప ప్రాంతాల అనుసంధానం కోసం రోడ్లు, మార్కెట్ ప్లేస్‌లు వంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. వీటిని కూడా కనీస అవసరాలుగా గుర్తించి అందించేందుకు పంచాయతీరాజ్‌శాఖ సమగ్ర ప్రణాళికతో రానున్న రోజుల్లో పనిచేయాలి. జనవరి నుంచి 'జన్మభూమి 2.0'ను తిరిగి ప్రారంభిస్తున్నాం. గ్రామాల అభివృద్ధికి ముందుకొచ్చే వారితో కలిసి పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నాం' అని తెలిపారు.

గ్రామాల నిధులు దారిమళ్లించారు..

గత ప్రభుత్వం గ్రామాల్లో ఖర్చు చేయాల్సిన నిధులు దారిమళ్లించిందని... దీనివల్ల కనీస స్థాయిలోనూ మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని సీఎం చెప్పారు. పంచాయతీరాజ్‌శాఖకు రావలసిన రూ.990 కోట్లను ఆర్థికశాఖ నుంచి ప్రస్తుతంవిడుదల చేస్తున్నామన్నారు. 'గత ప్రభుత్వం అసమర్థతతో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే జల్‌జీవన్ మిషన్ పనుల్లో రాష్ట్రం 19వ స్థానానికి దిగజారిపోయింది. ఈ మిషన్ కోసం రాష్ట్ర వాటా కింద ఆర్థిక శాఖ నుంచి రూ.500 కోట్లు వెంటనే విడుదల చేస్తాం. కేంద్రమిచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. ఎల్ఈడీ విద్యుత్ దీపాల కోసం రూ.482 కోట్ల చెల్లింపులు చేయాల్సి ఉందని.. గత ఐదేళ్లుగా ఆ నిధులు విడుదల చేయకపోవడం వల్ల కొత్త లైట్లు ఏర్పాటు, నిర్వహణ మూలన పడిందని అధికారులు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల భవనాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని సూచించారు. గత ప్రభుత్వ తీరు వల్ల మూలనబడిన ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాలను మళ్లీ ప్రారంభించాలన్నారు. ఎకో టూరిజం, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అడవుల్లో టూరిజం అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపిచ్చారు.

23న రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు: ఉపాధి పనులపై ఆయా గ్రామాల్లో ఈ నెల 23న తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అక్టోబరు 2 నుంచి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలన్నింటినీ తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2014-19 మధ్య ఎన్టీఆర్ జలసిరి కింద 32,693 బోర్లు వేసి పంపుసెట్లు బిగిస్తే.. గత ప్రభుత్వం కేవలం 2,580 పంపుసెట్లే ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో 10వేల కి.మీ డ్రెయిన్లు, 2,500 కి.మీ బీటీ రోడ్లు వేయాలని, 5 లక్షల పంటకుంటలు తవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అధికారులు వివరించారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు.

సమూల మార్పులు తెస్తున్నాం: పవన్

పంచాయతీరాజ్ శాఖలో గత కొద్ది రోజుల్లో తీసుకున్న పలు నిర్ణయాలను, సంస్కరణలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షలో వివరించారు. గ్రామాల ముఖచిత్రం మార్చడంలో కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని.. నేడు మళ్లీ నిధులు, కొత్త విధానాల ద్వారా గ్రామాల్లో సమూల మార్పులు తీసుకొస్తామని తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, డైరెక్టర్ కృష్ణతేజ, అదనపు కమిషనర్ సుధాకర్‌రావు, స్వచ్ఛాంధ్ర సీఈవో గంధం చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం

● మంత్రి కొలుసు పార్థసారథి



గోడౌనులో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఆగస్టు 20: ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కంకిపాడు మార్కెట్ యార్డులోని గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన గోడౌన్‌ను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. గృహ నిర్మాణానికి సంబంధించిన సిమెంటు బస్తాలు, ఐరన్ నిలువలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన సిమెంటు, ఐరన్ పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం స్థానిక విలేకరులతో మంత్రి సారథి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వ పని చేస్తోందన్నారు. వంద రోజుల్లో 1.25 లక్షల ఇళ్లు పూర్తి చేయాలని, రానున్న మార్చి నాటికి 7 లక్షల ఇళ్లు పూర్తి చేసేలా ప్రణాళికలను రూపొందించుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పలు సూచనలు చేశారని వాటిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. జిల్లాలోని వీఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల నిర్మాణం నాణ్యతగా లేవని ఫిర్యాదులు వచ్చాయన్నారు. గృహ నిర్మాణ శాఖ ఎండీతో ప్రత్యేకమైన విచారణ చేపడతామన్నారు. టీడీపీ హయాంలో పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను పంపిణీ చేస్తే చంద్రబాబుకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందన్నారు. ఈ ఏడాదిలోగా నూరు శాతం టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఆర్భాటాలకు పోయి అప్పుల పాలవుతున్న లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించుకోవడంలో సలహాలివ్వాలని అధికారులను కోరారు. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మెయిదిన్ దివాస్, ఎండీ పి.రాజాబాబు, ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గృహ నిర్మాణ శాఖ సీఈ జీవీ ప్రసాద్, ఎస్ఈలు జయ రామాచారి, నాగభూషణం కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల హౌసింగ్ పీడీలు జీవీ సూర్యనారాయణ, రజిని, ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, మార్కెటింగ్ ఏడీ సత్యానందం, ఈఈ ఎస్ వెంకట్రావు, డీఈ శివప్రసాద్‌రావు, ఏఈ అబ్దుల్ జిల్లా, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, టీడీపీ, జనసేన సమన్వయ కర్త ముప్పా రాజా, టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బాంబు పేల్చిన మంత్రి సారథి

మార్చి నాటిని ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థికసాయం అందకుండా పోతుందని మంత్రి సారథి తెలిపారు. కంకిపాడులో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ ఇళ్లనిర్మాణంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులు వచ్చే 2025 నాటికి ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. లేకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రానున్న ఆర్థిక సాయం అందకుండా పోతుందన్నారు. ఇక ఎప్పటికీ వారికి ఆర్థికసాయం అందదన్నారు. లబ్ధిదారులు తక్షణం ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

సీతారాం సిత్రాలను ఆదరించండి: హీరో లక్ష్మణ్



లబ్బీపేట, ఆగస్టు 20: పాతరోజులను గుర్తుచేస్తూ పెళ్లి, వీసీఆర్ క్యాసెట్‌పై అల్లిన ఒక అందమైన ప్రేమ కథా చిత్రమే 'సీతారాం సిత్రాలు' అని ఈనెల 30న విడుదల కానున్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని హీరో లక్ష్మణ్ కోరారు. ఈ చిత్ర యూనిట్ మంగళవారం నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా బందర్ రోడ్డులోని హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరో లక్ష్మణ్ మాట్లాడుతూ తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డి చెప్పిన కథ విని హీరోగా నటించేందుకు అంగీకరించినట్టు తెలిపారు. రూ.కోటి బడ్జెట్‌తో చిత్రం పూర్తయిందని, అందమైన ప్రేమ కావ్యానికి ఈ నలుగురు నిర్మాతలు ఎంతో సహకరించారన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ భ్రమరాంబిక యూట్యూబ్ ద్వారా ప్రేక్షకులకు సుపరిచితమేనని, ఆమె క్యారెక్టర్ తెలుగింటి అమ్మాయిలా ఉండి ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. దర్శకుడు నాగ శశిధర్ రెడ్డి, నిర్మాత పవన్‌రాజు, మహమ్మద్ సలీం, ఇర్ఫాన్, బుచ్చిరాజు పాల్గొన్నారు.

పీజీటీ హిందీ పోస్టులను భర్తీ చేయండి

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం



పాయకాపురం, ఆగస్టు 20: ఈ విద్యా సంవత్సరానికి హిందీ పండిత శిక్షణ కళాశాలను పునరుద్ధరించాలని, రాబోయే డీఎస్సీలో విఎగతా సబ్జెక్ట్‌లతో సమానంగా హిందీ ఉపాధ్యాయుల పీజీటీ హిందీ పోస్టులను భర్తీ చేయాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలో కేంద్ర మంత్రి కె. రామ్మోహన్‌నాయుడికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఆధారంగా గుర్తించి హిందీ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, హిందీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకర్, హిందీ ప్రచార సభ ప్రతినిధులు ఎస్. గైబువల్లి, మంచుపల్లి శ్రీరాములు, సీఎల్ నాయుడు, ప్రచార సంచాలకుడు కోనే శ్రీధర్ ఉన్నారు.

పారా క్రీడాకారులకు సౌకర్యాలు

● అసోసియేషన్, క్రీడాకారులకు శాప్ ఎండీ గిరిషా హామీ



విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 20: పారా స్పోర్ట్సు అసోయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు సూచనల మేరకు శాప్ వీసీ, ఎండీ, వైస్‌చైర్మన్ గిరిషాను అసోసియేషన్ కార్యదర్శి వీ రామస్వామి ఆధ్వర్యంలో మంగళవారం పలువురు కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 28 నుంచి పారిస్‌లో జరిగే పారా ఒలింపిక్స్‌లో రాష్ట్రం తరఫున పాల్గొంటున్న క్రీడాకారుల వివరాలను రామస్వామి వివరించారు. ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు అన్నివిధాలా సహాయ సహకారాలను అందిస్తామని శాప్ వీసీ, ఎండీ గిరిషా హామీ ఇచ్చారు. క్రీడాకారులతో ఆయన స్వయంగా వీడియోకాల్‌లో మాట్లాడి అభినందించారు. నేషనల్, ఇంటర్నేషనల్ మెడలిస్ట్‌కు సకాలంలో ఆర్థికసాయం ఇస్తామన్నారు. త్వరలో పారా క్రీడాకారులకు నగరంలో ప్రత్యేకంగా అకాడమీ ఏర్పాటు చేస్తామన్నారు. పారా అసోసియేషన్ సెక్రటరీ రామస్వామితో పాటు సభ్యులు డి.నాగేంద్ర, జి.శివగంగ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల
సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



గవర్నర్‌పేట, ఆగస్టు 20: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీపీఎం డిమాండ్ చేసింది. విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరిగింది. సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటు న్న పలు సమస్యలపై ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ ఎస్ విక్టర్ ఇమ్మాన్యుయేల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ట్రూ అప్ కరెంట్ చార్జీలు రద్దు చేయాలని, ప్రీపైడ్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ఓవర్‌లోడ్ చార్జీ వసూలు నిలిపివేయాలని కోరారు. కరెంట్ కోతలు నివారణతో పాటులో ఓల్టేజీ, హై ఓల్టేజీతో నష్టపోయిన వి నియోగదారులకు నష్టపరిహారం చెల్లించాలని, ట్రాన్స్‌ఫార్మర్స్ కెపాసిటీ పెంచాలని కోరారు. కొండ ప్రాంతాల్లో డామేజ్ ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చాలని, వీధి వ్యాపారులకు వివక్షత లేకుండా విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని, సిబ్బం ది సంఖ్యను పెంచాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోయి సత్తిబాబు, జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రవీణ్, టి.దుర్గారావు, కె.భాస్కర్ పాల్గొనారు.

బీసీ కులగణన చేపట్టాలి: పూర్ణచంద్రరావు



ధర్నాచౌక్, ఆగస్టు 20: బీసీల కులగణన పూర్తయ్యాకే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జే పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. బీసీల కులగణనను వెంటనే పూర్తిచేసి జనాభా నిష్పత్తి ప్ర కారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ని ఓ హోటల్‌లో 'బీసీ కులగణన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికీ తమ అవకాశాలను ఎక్కువశాతం అగ్రకులాలే పొందాయని భవిష్యత్‌లో అలా జరగకుండా బీసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, బీఎస్పీ పార్టీ నేతలు వందన కుమార్, గౌతమ్, పుష్పరాజ్, బీసీ సంఘాల నేతలు శంకర్రావు, వెంకటేశ్వర్లు గౌడ్, గోవింద్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



అధ్యాపక అప్రిసియేషన్ అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు శ్రీనివాస్

ఉషారామాకు అవార్డులు

ఉంగుటూరు, ఆగస్టు 20: కాకినాడలోని జేఎన్‌టీయూ 17వ వర్సిటీ ఫార్మేషన్ డే వేడుకల సందర్భంగా మం గళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో స్థానిక ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలకు ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్ అవార్డుతోపాటు, ప్రిన్సిపాల్, అధ్యాపక అప్రిసియేషన్ అవార్డులు కూడా సొంతం చేసుకుందని కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం తెలిపారు. జేఎన్‌టీయూ పరిధిలోని మొత్తం 119 ఇంజనీరింగ్ కళాశాలల్లో 9 కళాశాలలు అవార్డులకు ఎంపికవగా, తమ కళాశాలకు 3 అవార్డులు లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్, కాకినాడ పోర్ట్ సీవోవో మురళీధర్‌రావు చేతుల మీదుగా ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్ అవార్డుతో పాటు ప్రిన్సిపాల్ అప్రిసియేషన్ అవార్డ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, అ ధ్యాపకుల అప్రిసియేషన్ అవార్డ్‌ను కళాశా ల కెమిస్ట్రీ విభాగానికి చెందిన బీఎన్.శ్రీనివాస్ అందుకున్నారన్నారు. కాగా సాయం త్రం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్‌తోపాటు అవార్డు గ్రహీతలకు సహచర అధ్యాపకులు పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపారు.





తొలగించాలి మళ్లీ.. మళ్లీ..!

● 'మళ్లీ వెలిశాయి' కథనానికి స్పందించిన వీఎంసీ

● మరోసారి బడ్డీలు తొలగించిన అధికారులు

మొగల్రాజపురం, ఆగస్టు 20: నగరంలోని మధురానగర్ బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన తొలగించిన చోట మళ్లీ వెలిసిన బడ్డీలను అధికారులు మంగళవారం మరోసారి తొలగించారు. 'మళ్లీ వెలిశాయి' అని ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి కొత్తగా వెలసిన బడ్డీలను తొలగించారు. మరోసారి అక్కడ బడ్డీలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే కాల్వ ఒడ్డున ఉన్న బడ్డీలను తొలగించిన అధికారులు నర్సరీ జోలికి వెళ్లలేదు. అంతకు ముందు కూడా వీటి గురించి పట్టించుకోలేదు. కాల్వ ఒడ్డున పడవల రేవు వద్ద సబ్‌స్టేషన్‌ను అనుకుని ఎన్నికల ముందు ఖాళీస్థలంలో షేడ్‌లు వేశారు. వాటిని పాక్షికంగా తొలగించి వదిలేశారు. వీటికి అనుకుని నర్సరీ కూడా ఉంది. ఈ రెండింటిని ఎందుకు వదిలేశారోనని జనాలు గుసగుసలాడుకుంటున్నారు. బడ్డీలు పెట్టుకున్నవారు కూడా బీఆర్‌టీఎస్ వంతెన వద్ద ఒక వైపు ఉన్న అనధికార ఫుడ్ కోర్టుస్టాల్స్‌ను వదిలేశారని తమవి మాత్రమే తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ద్వంద నీతి సమంజసంగా లేదని వాపోయారు. దీనిపై న్యాయపోరాటానికి కొందరు సంసిద్ధులవుతున్నారని సమాచారం.

సమస్యలు పరిష్కరించండి

● మంత్రి లోకేశ్‌కు ప్రజారవాణా సంస్థ కార్మిక పరిషత్ నేతల వినతి

వన్‌టౌన్, ఆగస్టు 20: ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రజా రవాణా సంస్థ కార్మిక పరిషత్ ప్రతినిధులు మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శేషగిరిరావు, సీసీఎస్ ఎం.సి మెంబర్ కె.సురేంద్ర, చిత్తూరు జిల్లా కార్యదర్శి, హరిప్రసాద్, కడప జిల్లా కార్యదర్శి ఎం.పురుషోత్తం, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వై. రమేష్, విజయవాడ డిపో కార్యదర్శి ఎస్. ప్రభాకర్ మంత్రితో మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. యువగళంలో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. 2004 సెప్టెంబర్ 1నాటికి ఉద్యోగులకు పాత పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. పాత వైద్య విధానాన్ని అమలు చేయాలన్నారు. కేడర్ స్ట్రెంత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. 2019లో జారీచేసిన సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఖాళీల భర్తీకి పదోన్నతుల ప్యానల్ అమలు చేయాలన్నారు. సిబ్బంది నియామకాలను చేపట్టాలని కోరారు. డ్రైవర్, కండక్టర్, ఇతర కేటగిరి ఉద్యోగులకు విధుల ఆధారిత అలవెన్సులను చెల్లించాలన్నారు. ఈ సమస్యలు విన్న మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ వీటిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, సమస్యలు పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు.



మంత్రి లోకేశ్‌ని కలిసిన ప్రజా రవాణా సంస్థ కార్మిక పరిషత్ నేతలు

నగరంలో ఫుట్‌వేర్ పార్క్ ఏర్పాటుకు ప్రయత్నాలు



మాట్లాడుతున్న చుక్కపల్లి అరుణ్ కుమార్

వన్‌టౌన్, ఆగస్టు 20: నగరంలో ఫుట్‌వేర్ పార్క్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని, ఇప్పటికే ప్రయత్నాలను ప్రారంభించినట్టు ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చుక్కపల్లి అరుణ్‌కుమార్, వీర్‌ప్రీత్ సింగ్ తెలిపారు. మంగళవారం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. పాదరక్షల తయారీ, విక్రయరంగాలను ప్రోత్సహించేందుకు నగరంలో ఫుట్‌వేర్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రికి నివేదిక సమర్పించినట్టు చెప్పారు. వచ్చే ఏడాది నాటికి పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. 5శాతంగా ఉన్న జీఎస్టీని 12 శాతానికి పెంచారని దీంతో పరిశ్రమ నష్టాల ఊబిలో చిక్కుకుందన్నారు. జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కోరుతూ వివిధ రాష్ట్రాల పాదరక్షల తయారీ, విక్రయదారుల సంఘాలతో సమన్వయం చేసుకుని పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. 2ఏళ్ల క్రితం ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్‌ను ప్రారంభించామని, వివిధ డిమాండ్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కలుస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. అనిల్ కుమార్ భవానీ, సభ్యుడు బి.ఎస్. కోటేశ్వరరావు, శ్రీనివాస బాబు మాట్లాడుతూ ఫుట్‌వేర్ పరిశ్రమకు అవసరమైన శిక్షణకు నగరంలో ఒక శిక్షణా కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అసోసియేషన్ మేనేజింగ్ కమిటీకి 21 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏడుగురు సభ్యులతో మేనేజింగ్ కమిటీ ఏర్పాటైంది. అధ్యక్షుడిగా సి.హెచ్. అరుణ కుమార్, ఉపాధ్యక్షుడు-1గా కె.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు-2గా డి.భరత్ కుమార్, కార్యదర్శిగా వీర్ ప్రీత్ సింగ్, కోశాధికారిగా అనిల్ కుమార్ భవానీ, సంయుక్త కార్యదర్శి-1గా హెచ్.చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి-2గా వై.వి.రమేష్ ఎన్నికయ్యారు.

బొడ్డుబొమ్మ సెంటర్
పార్కింగ్‌కు టెండర్లు పిలవొద్దు

● వీఎంసీ కమిషనర్‌కు దుర్గగుడి ఈవో లేఖ

వన్‌టౌన్, ఆగస్టు 20: దుర్గగుడి కొండ దిగువన బొడ్డుబొమ్మ సెంటర్ వద్ద కాలువ గట్టున వాహనాల పార్కింగ్‌కు టెండర్లను పిలవొద్దని దుర్గగుడి ఈవో రామారావు మునిసిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. అనధికార వ్యక్తులు ఇక్కడ దేవస్థానం పేరిట ముద్రించిన రశీదులను ఇస్తూ పార్కింగ్ రుసుం వసూలు చేసుకుంటున్న వైనం, కార్పొరేషన్‌కు అక్రమార్కుల ద్వారా భారీగా ఆదాయం గండిపడుతున్న అంశాలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. మరోపక్క ఇక్కడ టెండర్లను పిలిచి అక్రమార్కులకు చెక్‌పెట్టి ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు పార్కింగ్ టెండర్ పిలవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ లేఖ చర్చనీయాంశంగా మారింది. అయితే బొడ్డుబొమ్మ సెంటర్, కెనాల్ గట్టున పార్కింగ్ రుసుము వసూలు చేసుకునేందుకు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చినట్టయితే దేవస్థానానికి వచ్చే భక్తుల వాహనాల నిలుపుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని లేఖలో వివరించారు. వివిధ ప్రదేశాల నుంచి రథం సెంటర్, బ్యారేజీ మీదుగా వాహనాల్లో వచ్చే భక్తులు తమ వాహనాలను నిలుపుకునేందుకు పార్కింగ్‌కు అవకాశం కల్పిస్తే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మరోవైపు దేవస్థానంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను బొడ్డుబొమ్మ సెంటర్‌లోనే నిలుపుకోవాల్సి ఉంటుందని, అందుకు ఈ స్థలం అవసరమన్నారు. ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు జరుగుతుండటంతో కనకదుర్గానగర్, ఇతర ప్రదేశాల్లో పార్కింగ్‌కు అవకాశం లేనందున బొడ్డుబొమ్మ సెంటర్, కెనాల్ ఒడ్డున స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు టెండర్ల ప్రక్రియను నలిపేయాలని కోరారు. అభివృద్ధి పనులు పూర్తయ్యే దేవస్థానానికి మాత్రమే సంబంధిత స్థలాన్ని కేటాయించాలని కోరారు.

విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోండి

● ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూబీఐ జీఎం భాస్కరరావు



వన్‌టౌన్, ఆగస్టు 20: పీఎం విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలని స్టేట్ లెవల్ బ్యాంకర్స్ ఆఫ్ కమిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్, యూబీఐ జనరల్ మేనేజర్ సీవీఎన్ భాస్కరరావు అన్నారు. మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అన్ని బ్యాంకుల సహకారంతో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో ప్రతి కుటుంబంలో 18ఏళ్లు నిండిన ఒకరికి లబ్ధి చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ స్వయం ఉపాధి లేదా వ్యాపారాభివృద్ధికి రుణాలు పొందినవారు, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పథకానికి అర్హులు కారన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంలో స్కీమ్‌ల గురించి తెలుపుతూ వృత్తిపరమైన నైపుణ్యశిక్షణ ఉచితంగా ఇస్తారన్నారు. శిక్షణానంతరం గుర్తింపు పత్రాలు రూ.15వేల విలువైన వృత్తిపరమైన పరికరాలను ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ గుర్తింపుపత్రం ఆధారంగా ఆయా బ్యాంకులు అతి తక్కువ వడ్డీకి రుణం ఇస్తాయన్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే రెండో విడత 30 నెలల కాల పరిమితిలో రూ.2 లక్షలు రుణంగా పొందవచ్చన్నారు. లబ్ధిదారులు లబ్ధి పొందుటకు ఏ ఏ అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై సోదాహరణంగా వివరించారు. జాయింట్ డైరెక్టర్ రామలింగరాజు, కేవీఐసీ స్టేట్ డైరెక్టర్ గ్రీప్, ఎస్.ఎస్.బి.సి. ఎస్.ఈ.వో వి. ప్రశాంత్, ఎం.ఎస్.ఎం.ఈ. అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, కృష్ణాజిల్లా డీఐసీ జీఎం సుధాకర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయ్ చిత్ర హీరో, హీరోయిన్

నగరంలో 'ఆయ్' చిత్ర బృందం సందడి

లబ్బీపేట: నగరంలో ఆయ్ చిత్ర బృందం సందడి చేసింది. ఈ చిత్రం విడుదలైన అన్ని కేంద్రాల్లో పాజిటివ్‌టాక్‌తో నడుస్తుండటంతో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో సక్సెస్ టూర్ జరుగుతోంది. ఈనేపథ్యంలో నగరంలోని ట్రిబుల్ ఎస్ పాకహోటల్ నందు మంగళవారం చిత్ర బృందం విలేకరుల సమావేశం నిర్వహించారు. కథానాయకుడు నార్నే నితిన్ మాట్లాడుతూ ఈ చిత్రం విడుదలైన అన్ని కేంద్రాల్లో పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోందన్నారు. తెలుగు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, థియేటర్స్‌లో ప్రేక్షకులను కలిసి కృతజ్ఞతలు చెబుతున్నామనీ, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో సక్సెస్‌టూర్ నిర్వహిస్తున్నామని, ప్రతిచోటా ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనంతరం హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ ఈ చిత్రం విజయవంతం కావడం సంతోషంగా ఉందని, తాను తెలుగింటి అమ్మాయిలా కనిపించాననీ, ఈ చిత్రాన్ని వీక్షించి సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపుతున్నానన్నారు.



నిహారికకు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న ఈవో

దుర్గమ్మ సన్నిధిలో నిహారిక కొణిదెల

వన్‌టౌన్: ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల, కమిటీ కుర్రోళ్లు చిత్ర బృందం మంగళవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసి దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. ఈవో కేఎస్ రామారావు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం వారికి అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల బదిలీలకు
మార్గదర్శకాల విడుదలపై ఈయూ హర్షం

బస్‌స్టేషన్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆర్టీసీ ఉద్యోగుల బదిలీలకు కూడా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మార్గదర్శకాలు విడుదల చేయటంపై ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. బదిలీలు కావాల్సిన ఉద్యోగులు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ఉమ్మడి రీజినల్, ఉమ్మడి జోన్ పరిధిలోని ఉద్యోగులు బదిలీలు కోరుకున్నట్టయితే ఉమ్మడిజోన్‌లోని ఈడీలకు, ఉమ్మడి రీజియన్‌లోని రీజనల్ మేనేజర్‌కు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.

జిల్లా అండర్-20 పురుషుల క్రికెట్ టీమ్ ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు: 2024-25లో ఉమ్మడి కృష్ణా క్రికెట్ అసోసియేషన్ నుంచి అండర్-23 పురుషుల క్రికెట్ మల్టీడేస్ మ్యాచ్‌లో ఆడే జట్టును ఎంపిక చేసినట్టు కేడీసీఏ సెక్రటరీ ఎం రవీంద్రచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

జట్టు: జి.చంటి (కెప్టెన్), వరుణ్ సాత్విక్ (వైస్ కెప్టెన్), ఎం శుశాంత్ నాయుడు, వి విశాల్, ఎస్‌కే ఖాజామొహిద్దీన్, పీవీ దుర్గారావు, సీహెచ్ యోచన్, ఎం మానస్, బీ గీత్, జీ నిఖిల్, టీ సాయి ప్రకాష్, ఎన్ రాజేష్, ఏ దేవి ధనుష్, కేఎస్ఎన్ శ్రీ నిశ్చయ్, ఆర్. యశ్వంత్, స్టాండ్ బైలుగా బీ భార్గవ్, కే ఆర్యన్, పీ అనంత కార్తికేయ, ఎల్ చిన్న, ఎన్ బాను వరప్రసాద్ ఎంపికయ్యారు. వీరికి కోచ్ ఎస్ రామ్‌కుమార్ (గాంధీ) వ్యవహరిస్తారు.

సబ్ లీజుదార్ల పేరుతోనే ఈ-క్రాప్ నమోదు చేయాలి

● కౌలు రైతుల సంఘం



దిల్లీరావుకు వినతిపత్రం

పాయకాపురం: దేవదాయ భూములను సాగుచేస్తున్న సబ్ లీజుదారులుగా ఉన్న వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈ-క్రాప్ నమోదు చేయాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు కోరారు. ఈమేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్. ఢిల్లీరావును మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ బంజర్లు, నదీ పరివాహక ప్రాంతాలు, అటవీ భూముల్లోనూ కొంత మంది పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. వీరికి ఎలాంటి ఆధారం ఉండటం లేదని, భూమి ఏ శాఖకు చెందినదయినా వాస్తవ సాగుదారుల పేరుతో ఈ-క్రాప్ నమోదు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు వ్యవసాయంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని వా రికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వటం లేదని కౌలురైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.



టెక్నోజోలాతో సృజనాత్మకత మెరుగు

ఉంగుటూరు: విద్యార్థుల్లో సాంకేతిక, సృజనాత్మక నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కళాశాలలో నిర్వహించే టెక్నోజోలా ఈవెంట్లు దోహదం చేస్తాయని సీఎస్ఈ విభాగాధిపతి రాయ్‌చౌదరి అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం టెక్నోజోలా ఈవెంట్ నిర్వహించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మొదటి టెక్ టాంగిల్స్ రౌండ్‌లో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు పరీక్షించే పోటీ, 2వ రౌండ్ కోడ్ విజార్డ్‌లో కోడింగ్ నైపుణ్యాలను పరీక్షించే పోటీలు జరిపారు. చివరిగా విద్యార్థుల సాఫ్ట్‌స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు పరీక్షించే టెక్ టెస్ట్ టాక్స్ రౌండ్ నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ (ఏఐడీఎస్) మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) విభాగాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఆయా అంశాల్లో చురుగ్గా పాల్గొని తమకున్న సాంకేతిక పరిజ్ఞానం, విశ్లేషణా సామర్థ్యం, కమ్యునికేషన్ స్కిల్స్‌ను ప్రదర్శించారు. ఈవెంట్ విజేతలుగా వై.విజయ్ (సీఎస్ఈ), కె.హర్షవర్ధన్ (ఏఐడీఎస్), వై.అజయ్‌కుమార్ (ఏఐఎంఎల్) నిలిచారు. విజేతలను ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

జనసేన జనవాణిలో జనం గోడు



జనసేన గ్రీవెన్స్ సెల్‌లో వినతులు స్వీకరిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మహిళా నేత తిరుపతి అనూష

విద్యాధరపురం, ఆగస్టు 20: మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనవాణిలో పి.గన్నవరం నియోజకవర్గం, మామిడికుదురు మండలం నగరం గ్రామ ప్రజలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జనసేన మహిళా నాయకురాలు తిరుపతి అనూష వినతిపత్రాలు స్వీకరించారు. గెయిల్ గ్యాస్ పైప్ లైన్ బ్లాస్టింగ్ జరిగి పదేళ్లు అవుతున్నా బాధితులకు పూర్తిన్యాయం జరగలేదని నగరం గ్రామ నివాసి వానరాసి నాగసత్యస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమలాపురం కలెక్టర్‌తో మాట్లాడి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. నూజివీడు మండలం సిద్ధార్థనగర్‌కు చెందిన కాంట్రాక్టర్ వై.శ్రీనివాస్ తాను చేసిన రోడ్ల పనులకు అయిదేళ్లు గడిచినా డబ్బులివ్వలేదని వాపోయాడు. పలువురు మహిళలు, దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకునేందుకు పార్టీ కార్యాలయానికి తరలి వచ్చారు. రేషన్ కార్డులు, పెన్షన్‌లు, ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకున్నారు. టిడ్కో ఇంటికోసం ప్రభుత్వానికి రూ.లక్ష చెల్లించామని, ఇళ్లు రాకపోగా, కట్టిన డబ్బు వెనక్కు రాలేదని, తనకు న్యాయం చేయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన బండి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆస్తిని కాజేసి బ్యాంక్ అధికారులు మోసం చేశారని కాకినాడ ప్రాంతానికి చెందిన బత్తిన సుజాత తన ఆవేదనను వెలిబుచ్చింది. కోనసీమ జిల్లా, మండపేట నియోజకవర్గం అంగర గ్రామంలో 10ళ్లుగా డంపింగ్ యార్డ్‌ను తొలగించటం లేదని, దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. విదేశంలో ఉద్యోగం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి దాసరి హరికృష్ణసాయి, విజయలక్ష్మి, ఐశ్వర్య రూ.10లక్షలు తీసుకున్నారని, ఉద్యోగం రాకపోగా, డబ్బులివ్వలేదని పొన్నూరుకు చెందిన రావి సుధారాణి పేర్కొన్నారు. పోలీసులకు చెప్పినా ఫలితం లేదన్నారు. జనసేన నేతలు ఎస్. శ్రీనివాసరావు, సుందరరామిరెడ్డి, లీగల్ సెల్ సభ్యులు వి.కోటేశ్వరరావు, జె.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



బిడ్డ కోసం...

బిడ్డను రక్షించుకునేందుకు కేజీహెచ్‌లో మంగళవారం ఓ నవజాత శిశువు తండ్రి పడిన ఆరాటం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. అప్పుడే పుట్టిన బిడ్డకు ఊపిరి తీసుకోవడం (ఆయాసం)లో ఇబ్బంది ఉండడంతో పీడియాట్రిక్ వార్డు నుంచి నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అంబులెన్స్ వచ్చేంత వరకు వేచి ఉండలేక శిశువు తండ్రి నాయుడు అక్కడే ఉన్న నర్సింగ్ సిబ్బంది చేతిలో తన బిడ్డను పెట్టి, తాను ఆక్సిజన్ సిలిండర్ పట్టుకుని ఎన్‌ఐసీయూ వార్డుకు పరుగుపరుగున తీసుకువెళుతూ కనిపించాడు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి



కోల్‌కతా ఘటనపై వైద్యుల గర్జన

▸▸ **నెల్లూరులో నర్సుల కాగడాల ప్రదర్శన**

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20: కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ మంగళవారం రాత్రి నెల్లూరు నగరంలో 24 కళాసంఘాల ఆధ్వర్యంలో నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. కాగడాలు చేతబట్టి వీఆర్‌సీ నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఈ కేసులో ముద్దాయి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. భరతమాత వేషధారణలో ఓ విద్యార్థిని పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాంజలి ఆర్కెస్ట్రా నిర్వాహకులు శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇంతవరకు అసలైన నిందితులను పట్టుకోకపోవటం సిగ్గుచేటని, పైగా కేసును సీబీఐకి అప్పగించడం ఆ ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తోందని మండిపడ్డారు.

జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జూడాలు కూడా ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి నుంచి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. సెల్‌ఫోన్ లైట్లు వేసుకుని ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు జునాయిద్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి పీరస్ జోయల్, కార్యదర్శి హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ఉత్తమ్‌కుమార్, రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు తేజస్విని, అబిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ ఏపీ 2047

▸▸ **అక్టోబరు 2న డాక్యుమెంట్ ఆవిష్కరణ: సీఎస్**

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను అక్టోబరు 2న లాంఛనంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వెల్లడించారు. 'వికసిత ఏపీ 2047' ప్రణాళిక రూపకల్పనపై మంగళవారం అమరావతి సచివాలయం నుంచి ఆయన వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. 2047 నాటికి ఏపీని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంతోపాటు 45 వేల డాలర్ల తలసరి ఆదాయంతో కూడిన 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగల రాష్ట్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ విజన్ డాక్యుమెంట్ ఉంటుందన్నారు. ఈ నెల 28న జరిగే మంత్రిమండలి సమావేశంలో విజన్ డాక్యుమెంట్ ప్రవేశపెడతామని, దీనిపై సెప్టెంబరు 1 నుంచి 15 వరకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. సెప్టెంబరు 15-24 మధ్య ముసాయిదా ఖరారు చేసి సెప్టెంబరు 25న తుది ముసాయిదాను సిద్ధం చేసి నీతి ఆయోగ్ సమన్వయంతో అక్టోబరు 2న వికసిత్ ఏపీ విజన్ డాక్యుమెంట్‌ను ప్రధాన మంత్రి, సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిలో భాగంగా ప్రతి జిల్లాకు ఐదేళ్ల విజన్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని చెప్పారు.

విపత్తు దృశ్యాల ప్రసారంలో సూచనలు పాటించాలి

▸▸ **చానల్స్‌కు విపత్తుల నిర్వహణ సంస్థ విజ్ఞప్తి**

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, పెద్ద ప్రమాదాలకు సంబంధించిన ప్రసారాల విషయంలో శాటిలైట్ టీవీ చానల్స్‌కు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేసిన సూచనలను పాటించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది. ఆమేరకు మంగళవారం ఓ ప్రకటన చేసింది. 'వీక్షకులు ఎలాంటి గందరగోళానికి లోనుకాకుండా అన్ని చానళ్లు విపత్తులు, పెద్ద ప్రమాదాల ఫుటేజ్‌ను ప్రసారం చేసేటప్పుడు వీడియోపైన ఘటన తేదీ, సమయం స్టాంప్ ప్రముఖంగా కనిపించేలా చూసుకోవాలి. దీని వల్ల కచ్చితమైన సమయం, ప్రదేశం, వాస్తవ పరిస్థితి వీక్షకులకు తెలుస్తుంది. అన్ని ప్రైవేట్ చానల్స్ ప్రోగ్రామ్ కోడ్‌కు కట్టుబడి ఉండాలి' అని సూచించింది..

హాస్టళ్ల నిర్వహణలో అలక్ష్యం వద్దు: మంత్రి సవిత

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో అధికారులు, వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. అమరావతి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'హాస్టళ్లలో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం హాస్టళ్లలోకి రానివ్వవద్దు. విద్యార్థులు కూడా బయటకు వెళ్లకుండా చూడాలి. హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. సురక్షితమైన నీటినే తాగునీటిగా అందించాలి. వార్డెన్లు రాత్రిళ్లు హాస్టళ్లలోనే బస చేయాలి. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరించారు.

అప్పట్లో జగన్‌రెడ్డి ఏం గడ్డి పీకారు: పంచుమర్తి

ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆహారం కలుషితమైన ఘటనలు పదుల సంఖ్యలో జరిగితే జగన్‌రెడ్డి ఏం గడ్డి పీకారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ప్రశ్నించారు. ఆ సమయంలో ఏ స్పందనా లేకుండా మౌనవ్రతం పాటించిన ఆయనకు ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదని మంగళవారం అన్నారు.

దమ్ముంటే అవినీతిపై చర్చకు రావాలి

▸▸ **జగన్ హయాంలో ఉన్నవారంతా దండుపాళ్యం బ్యాచ్: బుద్దా వెంకన్న**



విజయవాడ (వన్‌టౌన్), ఆగస్టు 20: 'జగన్ పాలన సమయంలో ప్రతి శాఖలోనూ అవినీతి జరిగింది. దమ్ముంటే ఆ విషయమై నాతో చర్చకు రావాలి' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న వైసీపీకి సవాల్ విసిరారు. మంగళవారమిక్కడ తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ప్రతి శాఖలోనూ అవినీతి జరిగింది. కనుకనే ఆ ఫైళ్లను తగులబెడుతున్నారు. జగన్ హయాంలో ఉన్నవారంతా దండుపాళ్యం బ్యాచ్. టీడీపీ పాలనలో వచ్చిన పరిశ్రమలు జగన్ వచ్చాక వెళ్లిపోయాయి. చంద్రబాబు రాగానే ఏపీలో పెట్టుబడులు పెడతామని పారిశ్రామికవేత్తలు వస్తున్నారని చెప్పారు.

వేదవతికి 200 కోట్లు కేటాయించాలి: రామకృష్ణ

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'వేదవతి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించాలి. కరువు పీడిత ప్రాంతమైన కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి ఆ ప్రాజెక్టు వరదాయిని' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఈమేరకు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు.

కౌన్సెలింగ్ పద్ధతిలో పంచాయతీలు కేటాయించాలి

▸▸ **గ్రేడ్ 5 కార్యదర్శుల విజ్ఞప్తి**

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మెరిట్‌లో ఉద్యోగం వచ్చిందని సంతోషించాలో, అదే మెరిట్ కారణంగా పదవిలో ఉన్నంత కాలం సహాయకుడిగానే మిగిలిపోతున్నామని బాధపడాలో అర్థంకాని దుస్థితిలో ఉన్నామంటూ గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం 'ఒక పంచాయతీకి ఒక్కరే కార్యదర్శి' అంటూ విధానపరమైన నిర్ణయం తీసుకోవడమే వారి వేదనకు కారణమయింది. ఉద్యోగాలు ఇచ్చే సమయంలో మాదిరిగా పంచాయతీలు కేటాయించే సమయంలో కూడా కౌన్సెలింగ్ పద్ధతి అనుసరిస్తే తమకు ఇలాంటి అన్యాయం జరగదని వారు భావిస్తున్నారు.

మార్గదర్శి కేసులో కౌంటర్లు వేయండి

▸▸ **తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు టీ.హైకోర్టు ఆదేశాలు**

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందన్న ఆరోపణలపై మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాఖలైన కేసులో వివరణ ఇవ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బకాయిలు రావాల్సిన డిపాజిటర్లు ఉంటే వారందరికీ తెలిసేలా ప్రముఖ వార్తాపత్రికల్లో బహిరంగ నోటీసు ప్రచురించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. డిపాజిటర్ల సమాచారం ఎలక్ట్రానిక్ రూపంలో కావాలనుకుంటే అందుకు తగినవిధంగా దరఖాస్తు సమర్పించాలని పిటిషనర్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుల ధర్మాసనం మంగళవారం సూచించింది.

వేణుస్వామిపై జర్నలిస్టు మూర్తి ఫిర్యాదు

బంజారాహిల్స్/యూసుఫ్‌గూడ/హిమాయత్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జ్యోతిష్యుడు వేణుస్వామిపై ప్రముఖ జర్నలిస్టు మూర్తి.. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను రూ.5 కోట్ల డబ్బు డిమాండ్ చేసినట్లు చెబుతూ వేణుస్వామి, ఆయన భార్య తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేణుస్వామి సోషల్ మీడియాలో పెట్టిన వీడియోను పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. మరోవైపు తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోషియేషన్ ప్రతినిధులు కూడా వేణుస్వామిపై మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లోకేశ్ ఫ్లెక్సీ పెట్టామని

హోటల్ మూయించారు

▸▸ **మంత్రి సంధ్యారాణికి తంబళ్లపల్లె బాధితుని ఫిర్యాదు**

▸▸ **వైసీపీ వ్యక్తులు అత్యాచారయత్నం చేసి, చంపాలని చూశారు**

▸▸ **ఊరు విడిచివెళ్లకుంటే ప్రాణాలు దక్కవని డీఎస్పీ చైతన్య బెదిరించారు**

▸▸ **టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన బాధితులు**



ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న లోకేశ్

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేత లోకేశ్ జన్మదినం సందర్భంగా ఆయన ఫ్లెక్సీ పెట్టామని తన హోటల్ మూయించారని అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకు చెందిన ప్రకాశ్ బాబు మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబుతో కలసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మాస్క్ పెట్టుకోలేదన్న సాకు చూపించి తనపై తప్పుడు కేసులు కూడా వైసీపీ నేతలు పెట్టించారని, తనకు న్యాయం చేయాలని ప్రకాశ్ బాబు మంత్రికి విజ్ఞప్తి చేశారు. వైసీపీకి చెందిన వ్యక్తులు తనపై అత్యాచార యత్నం చేయడంతోపాటు చంపాలని కూడా ప్రయత్నించారని, ఊరు విడిచి వెళ్లకపోతే ప్రాణాలు దక్కవని అప్పటి డీఎస్పీ చైతన్య తననే బెదిరించారని అన్నమయ్య జిల్లాకు చెందిన సరోజ అనే మహిళ ఫిర్యాదు చేశారు. వైసీపీ గుండాలపైనా, వారికి కొమ్ము కాసిన పోలీస్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇచ్చినందుకు వైసీపీ మద్దతుదారుల ప్రోద్బలంతో ఎస్సై, కానిస్టేబుళ్లు తమను కొట్టి హింసించారని, వారిపై చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా శింగనమల మండలం సలకం చెరువుకు చెందిన దళితులు తాడి మేరి తిరపాలు, రాజా రాముడు విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లు వైసీపీలో తిరిగిన వ్యక్తులు ఎన్నికలు కాగానే టీడీపీలో చేరి పార్టీలో మొదటి నుంచి ఉన్న దళితులకు పదవులు రాకుండా అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారని, దీనిపై పార్టీపరంగా విచారణ చేయాలని ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలం శింగనపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు కోరారు. చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీ మాకాంబికాపురంలో పశువుల మేత పోరంబోకు, కాల్వ పోరంబోకు భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని చెంగల్రాయరెడ్డి వినతి పత్రం ఇచ్చారు.

చిత్తూరు జిల్లా హోం గార్డుల వినతి

చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న తమను గత ప్రభుత్వం ఇచ్చిన ఒక ఆదేశం వల్ల 120 కిలోమీటర్ల దూరంలోని అన్నమయ్య జిల్లాలో పనిచేయాలని చెబుతున్నారని, చాలీచాలని జీతాలతో అంత దూరం వెళ్లి పనిచేయలేమని, సొంత జిల్లాలో ఉండేలా చూడాలని పదుల సంఖ్యలో వచ్చిన హోం గార్డులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. చిత్తూరు ఎస్పీకి ఫోన్ చేసిన మంత్రి వారి సమస్యను పరిశీలించాలని సూచించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల పరిధిలో 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వారిని పర్మినెంట్ చేయాలని... యాజమాన్యాలే నేరుగా జీతాలు ఇచ్చేలా చూడాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. 1998 డీఎస్సీ ద్వారా ఎంపికైన తమకు 2023లో నియామకాలు ఇచ్చారని, పరీక్ష రాసిన జిల్లాల్లో కాకుండా తాము స్థిరపడిన జిల్లాల్లో పోస్టింగులు ఇచ్చేలా చూడాలని వారు కోరారు.

జాతీయ స్థాయికి ఎదగడానికి..

ఆప్కాస్ ద్వారా విశాఖ కేజీహెచ్, అనకాపల్లి మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న తమకు అనేక నెలల నుంచి జీతాలు రావడం లేదని కొందరు నాలుగో తరగతి ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. తన తండ్రి తోపుడు బండి మీద పండ్లు అమ్ముతాడని, తాను పరుగు పందెంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో 26 పతకాలు సాధించానని పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన షేక్ అబ్దుల్లా చెప్పారు. తాను జాతీయ స్థాయికి ఎదగడానికి తర్ఫీదుకు నెలకు రూ.15 వేలు ఖర్చవుతుందని, దానికి సాయం చేయాలని అబ్దుల్లా విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రానికి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్: మంత్రి భరత్

తిరుమల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చంద్రబాబే పెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని మంత్రి టీజీ భరత్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా తిరుమలకు వచ్చి శ్రీవారి ఆశీస్సులు తీసుకున్నా. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు వచ్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలన్నీ నెరవేరాలని స్వామిని కోరుకున్నా. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు కాకముందే అనేక పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయి. చాలామంది భారీ పారిశ్రామికవేత్తలు సీఎంను కలిసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. హైదరాబాద్ తరహాలో అమరావతి కూడా అభివృద్ధి కావాలని స్వామిని ప్రార్థించా. మరోవైపు ఇతర ప్రాంతాలతోపాటు ఒకప్పుడు రాజధాని అయిన కర్నూలు కూడా అభివృద్ధి కావాలని కోరుకున్నా" అని భరత్ అన్నారు.



తిరుమల ఆలయం వద్ద కుటుంబసభ్యులతో భరత్

2028 ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

▸▸ **ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అవసరం**

▸▸ **అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి**

▸▸ **విశాఖలో ఘనస్వాగతం**



విశాఖ చేరుకున్న అథ్లెట్ జ్యోతి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20: 'పారిస్ ఒలింపిక్స్ మంచి అనుభవం ఇచ్చింది. 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరిగే సమ్మర్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించే దిశగా సాధన చేయడమే నా ముందున్న లక్ష్యం' అని నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి తెలిపింది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొని మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో జ్యోతి మాట్లాడుతూ... 'ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొంటున్న తొలి అథ్లెట్‌గా గుర్తింపు రావడంతో కొంత ఒత్తిడికి గురయ్యాను. దీనికితోడు హీట్స్ ముందు రోజు వరకు గాయం కొంత ఇబ్బంది పెట్టింది. అయినప్పటికీ క్వాలిఫై కావాలని రౌండ్-1లో పట్టుదలతో పరుగు తీసినా ఆశించిన ఫలితం సాధించలేకపోయా. ఉద్దండులైన అథ్లెట్లతో పోటీపడడంతోపాటు ఒలింపిక్స్ వంటి అతి పెద్ద ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై రేస్‌లో పాల్గొనడం మంచి అనుభవాన్నిచ్చింది. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో అకాడెమీలు ఏర్పాటుచేసి మంచి శిక్షణ అందిస్తే ఉన్నత స్థాయి అథ్లెట్లు రూపొందుతారు. ఔత్సాహికులకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం అందితే ఆసియా గేమ్స్, కామన్‌వెల్త్, ఒలింపిక్స్ వంటి అత్యున్నత స్థాయి ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్స్‌లో దేశానికి పతకాలు అందించే అథ్లెట్లు తయారవుతారు' అని అభిప్రాయపడింది. జ్యోతికి స్వాగతం పలికిన వారిలో ఒలింపిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, కోశాధికారి మోహన్ వెంకటరామ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్, కోచ్‌లు, మాజీ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూలకు చేరిన మగ్గం

▸▸ **జగన్ ఐదేళ్ల పాలనలో నిర్వీర్యం**

▸▸ **నేడు టెక్స్‌టైల్ పాలసీపై చంద్రబాబు కీలక నిర్ణయం**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



విజయవాడ చేనేత వస్త్ర ప్రదర్శనలో సవిత

దేశంలోనే అతి పెద్ద చేనేత పరిశ్రమగా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌లో గతంలో ఎన్నడూ లేనంతగా నేతన్నలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన చేనేతలు ఇప్పుడు పూట కూలీ కూడా తెచ్చుకోలేక పోతున్నారు. దారానికి రంగులద్ది కళ్లకు ఇంపైన రంగుల వస్త్రాన్ని నేసిన కళాకారుల కళ్లు నేడు చెమ్మగిల్లుతున్నాయి. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో బతుకు భారమై వృత్తికి దూరమవుతున్నారు. అపురూపమైన కళను వదిలి వ్యవసాయ కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా బతుకు వెళ్లదీస్తున్నారు. ముడిసరుకు సబ్సిడీపై ఇచ్చి పని కల్పించాలని, నేసిన వస్త్రాన్ని ప్రభుత్వ అవసరాలకు కొనుగోలు చేయాలని వేడుకొంటున్నారు. ఐదేళ్లుగా చేనేత పనిలేక, ప్రభుత్వ సహకారం అందక మూలన పడ్డ మగ్గాలకు తిరిగి చప్పుళ్లు చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. పదమూడు జిల్లాల నుంచి 26 జిల్లాలకు చేరిన రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల (సోసియో ఆడిట్ 2023) ప్రకారం 1282 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. సొంత మగ్గంపై వస్త్రాలు నేసే కార్మికులతో కలిపి రెండు లక్షలకు పైగా నేతన్నలు ఉండగా, అనుబంధ కార్మికులు మరో రెండున్నర లక్షల మంది ఉంటారు. ఒకప్పుడు ఎన్టీఆర్ ప్రభుత్వం, ఉమ్మడి-విభజిత ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం వీరి జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడింది. నూలు సబ్సిడీ మొదలు వస్త్రానికి మార్కెటింగ్ సౌకర్యం వరకూ చేయూత అందించింది. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖల అవసరాలకు ఆప్కో ద్వారా నేత వస్త్రాలు తప్పనిసరిగా కొనుగోలు చేయాలంటూ ఉమ్మడి రాష్ట్రంలో జీవో 24, విభజిత రాష్ట్రంలో జీవో 142 విడుదల చేసింది. చేనేత రంగానికి ఊతమిస్తూ మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆప్కోను బలోపేతం చేసి రిబేటు అమలు చేసింది. ఐదేళ్ల క్రితం అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి గతంలో ఉన్న సదుపాయలన్నీ తీసేశారు. కమీషన్లు ఇచ్చే ప్రైవేటు వస్త్ర వ్యాపారులకే వైసీపీ పాలకులు ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చారు. నాలుగున్నర లక్షల మందిలో కేవలం 81 వేల మందికి నెలకు రెండు వేల చొప్పున నేతన్న నేస్తం అందించి ఎంతో చేశామని గొప్పలు చెప్పింది. అసలైన పని లేక పోవడంతో రాష్ట్రంలో చేనేత రంగం కుదేలైంది. పని కల్పించాలంటూ చేనేత జౌళి శాఖ అధికారుల వద్దకు సహకార సంఘాల ప్రతినిధులు వెళ్లి అడిగినా పట్టించుకోలేదు. 'కమిషనర్‌కు చెబితే సెక్రటరీ అంటారు. సెక్రటరీ వద్ద కెళితే జీఎంను కలవమంటారు. ఆయనేమో ఆప్కో ఎండీ పేరు చెబుతారు' అని నేతన్నలు వాపోయారు. చేనేత వస్త్రాలు విక్రయించే ఆప్కో ఉన్నతాధికారి (చేనేత సామాజిక వర్గం) వద్దకు బనగానపల్లె కార్మికులు వస్తే.. 'నాకు స్వెట్ (చెమట) అలర్జీ ఉంది. మీరు బయటికి వెళ్లండి. ఏసీ రూములో వాసన వస్తోంది' అంటూ బయటికి పంపారు. కన్నీటితో బయటకు వెళ్లిన కార్మికులు మగ్గాలు మూలన పడేసి, చేనేత వృత్తి వదిలి కర్ణాటకలో భవన నిర్మాణ కార్మికులుగా పనికి వెళుతున్నారు. తమకు ఎంతో ఇష్టమైన చేనేత కళను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మగ్గమున్న ప్రతి కార్మికుడికి యార్న్, డైయింగ్, డిజైన్, మార్కెటింగ్ లాంటి సహకారం అందిస్తేనే మనుగడ సాధ్యమని గుర్తు చేస్తున్నారు. గడిచిన ఐదేళ్ల ప్రతికూల పరిస్థితులతో వృత్తిపై పూర్తిగా ఆశలు వదిలేసుకున్నామని, ఇటీవల చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తమలో ఆశలు చిగురింపజేశాయని గుర్తు చేస్తున్నారు. ఏపీ టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చేందుకు బుధవారం సమావేశం అవుతున్న చంద్రబాబు తమకు న్యాయం చేయాలని నేతన్నలు విన్నవిస్తున్నారు.

భవన నిర్మాణాలకు సత్వరమే అనుమతులు

▸▸ **ఆన్‌లైన్‌లో అన్ని శాఖలు అనుసంధానం: మంత్రి నారాయణ**

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి త్వరితగతిన అన్ని అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. ఈమేరకు భవన నిర్మాణాల కోసం అనుమతిలిచ్చే శాఖల అధికారులతో మంగళవారం మంత్రి సమీక్షించారు. సీడీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ హరినారాయణ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ శేషగిరిబాబుతోపాటు పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, గనులు, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. అన్ని శాఖలను ఆన్‌లైన్ విధానంలో అనుసంధానం చేసేలా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో వందల కోట్ల అక్రమాలు చోటుచేసుకున్న టీడీఆర్ బాండ్ల జారీపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని నారాయణ చెప్పారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

▸▸ **ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం: మంత్రి కొండపల్లి**

అమరావతి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'సామాజిక, ఆర్థికాభివృద్ధిలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర కీలకం. వారి మేథోసంపత్తిని అర్థం చేసుకుని వారిని ప్రోత్సహించాలి' అని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ (ఎంఎస్‌ఎంఈ) మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్‌ఎంఈ రంగంలో మహిళా పారిశ్రామికవేత్తల సామర్థ్యాన్ని తమ ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి మహిళా మేథో సంపత్తి వ్యాపార సదస్సు - 2024ను సోమవారం ఆయన ప్రారంభించారు.

ఆరేళ్లలో అమరరాజా లిథియం అయాన్ బ్యాటరీలు!

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలో అమరరాజా లిథియం అయాన్ బ్యాటరీల తయారీ ప్లాంటు సిద్ధమవుతుందని టీఎస్ ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని దివిటిపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న అమరరాజా ప్లాంట్ పురోగతిపై మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, అమరరాజా ఛైర్మన్ జయదేవ్ గల్లా, సంస్థ ప్రతినిధులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం మూడు దశల్లో 16 గిగావాట్ల సామర్థ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తి జరుగుతుందని శ్రీధర్ బాబు చెప్పారు. రూ.9500 కోట్ల పెట్టుబడితో మొదలైన ఈ కర్మాగారం మొదటి దశ ఇప్పటికే పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించిందన్నారు.

ఉక్కు ఉద్యోగులకు అలవెన్సుల్లో కోత

▸▸ **ఒక్కొక్కరికి సగటున 3 వేలు తగ్గింపు**

విశాఖపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా ఉద్యోగుల అలవెన్సుల్లో కోత విధిస్తున్నట్టు విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. దీని కారణంగా ఒక్కో ఉద్యోగికి సగటున రూ.3,000 తగ్గిపోనుంది. ఇది ఆగస్టు నెల నుంచే అమలులోకి వస్తుందని, వచ్చే మార్చి నెలాఖరు వరకు అమలులో ఉంటుందని తెలిపింది. ఉక్కు ఉద్యోగులకు 2007లో చివరిసారిగా వేతన సవరణ చేశారు. అందులో కూడా వేతనాన్ని నాలుగు భాగాలుగా విడదీశారు. బేసిక్ పేను ఒక భాగం చేసి, పెర్క్స్ అందులో 50 శాతానికి మించకూడదని ఆంక్షలు పెట్టారు. ఆ తరువాత లాభాలు వస్తే బోనస్ ఇస్తామని నిబంధన పెట్టారు. ఇప్పుడు అందులో పెర్క్స్‌ని తగ్గిస్తూ ఆదేశాలు ఇచ్చారు. బోర్డు స్థాయి ఎగ్జిక్యూటివ్‌లకు అలవెన్సులు 12% తగ్గించారు. ప్రస్తుతం వారికి 46% వరకు అలవెన్సులు వస్తుండగా... ఇకపై 34% ఇస్తారు. వీరి సంఖ్య చాలా తక్కువ. ఇక మిగిలిన వారందరికీ అలవెన్సులను ఆరు శాతం తగ్గించారు. ప్లాంటు ఆర్థిక పరిస్థితి బాగా లేనందున వివిధ రూపాల్లో రూ.5 వేల కోట్లు సాయం చేయడానికి కేంద్రం అంగీకరించిందని, ప్లాంటులో ఉద్యోగుల తరఫున ఏడాదికి రూ.100 కోట్లు ఆదా చేయాలని సూచించడంతో ఇక్కడి యాజమాన్యం ఇలా అలవెన్సుల్లో కోత పెట్టిందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. గతంలో ఇలాంటి సాయం చేసినప్పుడు కేంద్రం ఏనాడూ ఇలా చేయలేదని, ఇది సరి కాదంటూ ఉద్యోగ వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి.

పొన్నవోలుకు ప్రాణహాని లేదు

▸▸ **భద్రత అవసరం లేదని ఎస్ఆర్‌సీ నిర్ధారించింది**

▸▸ **వాదనలు వినిపించిన ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్**

▸▸ **పొన్నవోలు పిటిషన్‌పై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్**

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి ఎలాంటి ప్రాణహానీ లేదని, ఆయనకు భద్రత అవసరం లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ) నివేదిక ఇచ్చిందని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ మంగళవారం హైకోర్టుకు నివేదించారు. అడిషనల్ అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) హోదాలో అనేక కేసులు వాదించినందున తనకు ప్రాణహాని పొంచి ఉందన్న పిటిషనర్ వాదనలో అర్థం లేదన్నారు. భద్రత కల్పించాలని కోరుతున్న నేపథ్యంలో ప్రాణహాని ఉందని ఆధారాలు చూపించాల్సిన బాధ్యత పిటిషనర్‌పై ఉందన్నారు. కానీ, ఎలాంటి ఆధారాలనూ కోర్టు ముందు ఉంచలేదన్నారు. ఎస్ఆర్‌సీలోని అధికారులు దురుద్దేశంతో వ్యవహరించారని ఎలాంటి ఆరోపణలు చేయడం లేదన్నారు. పొన్నవోలు తరఫున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... కోర్టు ఆదేశాలను అనుసరించి ఎస్ఆర్‌సీ నివేదికను తమకు అందజేయలేదన్నారు. ఎస్ఆర్‌సీ నిర్ణయాన్ని జిల్లా ఎస్పీ పిటిషనర్‌కు తెలియజేశారన్నారు. జిల్లా ఎస్పీ ఎస్ఆర్‌సీలో సభ్యుడు కాదన్నారు. అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ.. ఎస్ఆర్‌సీ నివేదిక కాన్ఫిడెన్షియల్ డాక్యుమెంట్ అని, దాన్ని పిటిషనర్‌కు అందజేయడం వీలుకాదని చెప్పారు. కేవలం ఎస్ఆర్‌సీ నిర్ణయాన్ని మాత్రమే అధికారులు పిటిషనర్‌కు తెలియజేస్తారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలో తీసుకున్న ధర్మాసనం ఏఏజీ హోదాలో తనకు కల్పించిన భద్రతను కొనసాగించాలని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దాఖలుచేసిన వ్యాజ్యంలో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పొన్నవోలుకు భద్రతను కొనసాగించాలని పోలీసులను ఆదేశించాలని, అందుకు అయ్యే ఖర్చును ఆయనే భరించాలని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. న్యాయస్థానం తీర్పు వెల్లడించే వరకు ఇవి అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. రెడ్‌బుక్‌లో తన పేరు ఉన్నందున తనకు భద్రత తొలగిస్తారనే ఆందోళన ఉందని, ప్రస్తుతం ఉన్న 2 ప్లస్ 2 సెక్యూరిటీని కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

వైవీ పిటిషన్‌పై విచారణ వాయిదా

మరోవైపు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తనకు ఉన్న 2 ప్లస్ 2 భద్రతను కుదించడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యం మంగళవారం మరోసారి హైకోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి పిటిషనర్‌కు ఎలాంటి ప్రాణహాని లేదన్న సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ) నిర్ణయాన్ని పిటిషనర్‌కు తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. భద్రత కుదింపు విషయంలో ప్రభుత్వం వేసిన కౌంటర్‌పై రిప్లై వేయాలని పిటిషనర్‌కు సూచించించారు. తదుపరి విచారణలో పిటిషన్‌పై తుది విచారణ జరుపుతామని ప్రకటిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు ఎలాంటి ప్రాణహాని లేదని ఎస్ఆర్‌సీ నిర్ధారించిందన్నారు. ఈ నేపథ్యంలో భద్రతను 1 ప్లస్ 1కు కుదించామన్నారు. ఎస్ఆర్‌సీ నివేదిక కాన్ఫిడెన్షియల్ అని, దాన్ని పిటిషనర్‌కు అందజేయడం వీలుకాదని అన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పిటిషనర్‌కు ఉన్న 2 ప్లస్ 2 భద్రతను 1 ప్లస్ 1కు కుదించారన్నారు. ఎంపీగా 2 ప్లస్ 2 సెక్యూరిటీ పొందేందుకు పిటిషనర్ అర్హుడన్నారు. ఎస్ఆర్‌సీ నివేదికను తమకు అందజేయలేదన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 21 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

కాళోజీ అనుబంధ కళాశాలల్లో
మేనేజ్‌మెంట్ కోటా

యూజీ

వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ కోర్సుల్లో మేనేజ్‌మెంట్/ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ/మైనారిటీ మెడికల్ & డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్‌ఆర్‌ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ఆర్మీ డెంటల్ కాలేజ్ సహా అనురాగ్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సీట్లను కూడా ఈ నోటిఫికేషన్ ద్వారానే అలాట్ చేస్తారు. కౌన్సెలింగ్ నాటికి సీట్ల వివరాలు ప్రకటిస్తారు. మేనేజ్‌మెంట్ కోటా-బీ కేటగిరీలో 85 శాతం సీట్లను స్థానికులకు రిజర్వ్ చేశారు.

అర్హత

అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 127; జనరల్ దివ్యాంగులకు 144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఎన్‌ఆర్‌ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.6300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** అభ్యర్థి ఫొటో; నీట్ యూజీ 2024 అడ్మిట్ కార్డ్, స్కోర్ కార్డ్; ఆధార్ కార్డ్, తొమ్మిదోతరగతి నుంచి పదోతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు; ఇంటర్/తత్సమాన కోర్సు స్టడీ సర్టిఫికెట్; కులం, ఆదాయం, వైకల్యం సంబంధిత ధ్రువీకరణ పత్రాలు; ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్; ఎన్‌ఆర్‌ఐ బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్; ఎన్‌ఆర్‌ఐ పాస్‌పోర్ట్ కాపీ; పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు.
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in

ఎండీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్)- ఎండీఎస్ ప్రోగ్రామ్‌లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్మీ డెంటల్ కాలేజ్ సహా తెలంగాణలోని అనుబంధ ప్రైవేట్ డెంటల్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. నీట్ ఎండీఎస్ 2024 స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ సమయంలో ప్రకటిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు.

అర్హత

డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ) గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీడీఎస్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తయి ఉండాలి. నీట్ ఎండీఎస్ 2024లో జనరల్ అభ్యర్థులకు 263; బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 230; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 246ను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదివిన వారు పర్మనెంట్ డెంటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. ఎన్‌ఆర్‌ఐల బంధువులు ఎన్‌ఆర్‌ఐ కోటా కింద అప్లయ్ చేసుకోవచ్చు. వీరు సంబంధిత ఎన్‌ఆర్‌ఐ నుంచి స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్, స్టాటస్ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సబ్మిట్ చేయాలి. ఇన్‌స్టిట్యూషనల్ కోటా కింద అప్లయ్ చేసుకొనేవారు కాలేజ్ నుంచి స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ జతచేయాలి. ఆర్మీ డెంటల్ కాలేజ్‌లోని సీట్లను ఆర్మీ అధికారుల పిల్లలకు ప్రత్యేకించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** 6300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్ ఎండీఎస్ 2024 అడ్మిట్ కార్డ్, నీట్ ఎండీఎస్ 2024 స్కోర్ కార్డ్, బీడీఎస్ డిగ్రీ సర్టిఫికెట్, బీడీఎస్ స్టడీ సర్టిఫికెట్, రొటేటరీ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్; కులం, ఆదాయం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in



ఏపీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రానికి 4087 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.

అర్హత

విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు; వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.



రాత పరీక్ష వివరాలు

ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.

ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్

రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసే వరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **పరీక్ష ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

సీఐటీడీలో ఎంఈ

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ), ఓయూకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఎంఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్, టూల్ డిజైన్, డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్, మెకట్రానిక్స్

అర్హత

- ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో(బీఈ/బీటెక్)(మెకానికల్/ప్రొడక్షన్/మెకట్రానిక్స్/ఆటోమొబైల్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అభ్యర్థుల వయసు 45 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** www.citdindia.org

SCHOLARSHIP ALERT

Legrand Empowering Scholarship Program 2024-25

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility:

- The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.
- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.

**Special category:* Differently-abled girl students, LGBTQ+ students, Covid-affected students, and students with single parents or orphans.

Last Date to Apply: 05-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9



SBIF Asha Scholarship Program 2025

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards:

- **Classes 6 to 12:** INR 15,000 each
- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date to Apply: 01-10-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/SBIFS7

Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.

Eligibility:

- Students studying in any year of professional graduation in STEM courses can apply.
- Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
- The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources.
- The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vodadara (Gujarat).

Prizes & Rewards: Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

buddy4study.com

లిటిల్స్



మిత్రుల గొడవ

ఒక అడవిలో ఒక సింహం కలిసి స్నేహంగా ఉండేది. అవి రెండూ కలిసి వేరు వేరుగా వేటాడేవి. దొరికిన ఆహారాన్ని కలసి పంచుకునేవి. ఇలా హాయిగా ఉండే ఆ జంతువులకు ఒకసారి దయనీయమైన పరిస్థితి వచ్చింది. తినటానికి తిండి దొరకలేదు. పన్నెండు రోజుల పాటు పస్తులుండాయి. ఆహారం లేక వట్టి కడుపులతో నకనకలాడాయి. అప్పుడు సింహంతో పులి ఇలా అన్నది.. 'మనం ఇద్దరం వేరు వేరుగా వేటాడితే తప్పించుకుంటున్నాయి. ఇద్దరం వేర్వేరుగా కాకుండా కలిసి వేటాడుదాం' అని తీర్మానించుకున్నాయి. 'ఇద్దరికీ చెరీ సగమే' అని కూడా మాట్లాడుకున్నాయి.




ఇద్దరూ కలిసి జింకను వేటాడాయి. జింక పరిగెత్తలేక.. ఈ రెండింటి వలలో చిక్కుకున్నది. తీరా తిండి దొరికాక .. సగం పంచుకునే విషయం మర్చిపోయి సింహం, పులి కొట్లాడుకున్నాయి. చివరికి నిందించుకున్నాయి. 'నేను ఈ సలహా ఇవ్వకపోతే ఈ తిండి దొరికేది కాదు' అన్నది పులి. 'భలే చెప్పావు. జింక మీద తొలి పంజా వేసింది నేనే. నేను పట్టుకోకపోతే ఈ జింక మాంసం నీకెక్కడిది?' అన్నది సింహం. రెండు క్రూర జంతువులు. వాటికి ఎదురు చెప్పేవారెవ్వరూ లేరు.

పులి, సింహం రెండు వయసు పైబడటం వల్ల ఎక్కువగా పోట్లాడుకోలేకపోయాయి. ఈ సందులో ఒక జిత్తుల మారి నక్క వచ్చి ఆ జింకను వేగంగా ఈడ్చుకుని పోయింది. పోట్లాడి అలసిన ఆ వృద్ధ క్రూర జంతువులు ఒక్కడుగు కూడా వేయలేక పోయాయి. దీంతో పులి, సింహం బాధపడ్డాయి. చెట్టు చాటు నుంచి దూరంగా జింకను లాక్కెళ్లిన నక్క హాయిగా ఆ రోజు ఆహారాన్ని భుజించటమే కాకుండా కూత వేసి మిగతా నక్కలకూ విందు అందించింది. ఇద్దరు మిత్రులు గొడవ పడటం వల్ల మూడో జంతువు నక్క బాగుపడింది. తమ తప్పును తెలుసుకున్న పులి, సింహం తప్పును తెలుసుకున్నాయి.

5 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి





జంతువుల నీడను జతపరచండి



డైలీ సుడోకు - 389

	9			6	7			4
		3		4		2	7	
			2					6
		6	9		2	7	3	
	3	5	8		6	1		
6					5			
	8	2		1		9		
3			6	9			2	

సుడోకు - 388 సమాధానం

3	2	1	6	5	4
6	5	4	3	1	2
5	4	3	2	6	1
2	1	6	5	4	3
4	3	5	1	2	6
1	6	2	4	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.